తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

గురువారం 11.09.2025 | సంపుటి :12 సంచిక : 53 | పేజీలు :12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



ప్రకటనల కోసం సంప్రదించండి

98483 28698





## గాంధీ సరోవర్‌కు రక్షణ భూములను

# బదలాయించండి

### రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినతి



కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో ఎంపీలు కడియం కావ్య, చామల


- ప్రాజెక్టు కోసం 98.20 ఎకరాల భూములను కేటాయించాలని కోరిన సీఎం
- మూసీ, ఈసీ నదుల సంగమం సమీపంలో నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు వెల్లడి
- హైదరాబాద్‌లో ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టాలి
- అత్యవసరంగా స్కైవేలు, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం
- మెహిదీపట్నం వద్ద స్కై వాక్ ప్రాజెక్ట్ రాజీవ్ రహదారిలో ఔటర్ వరకు ఆరులేన్ల విస్తరణ వంటి పలు ప్రాజెక్టులపై చర్చ

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవా రం కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో భేటీ అయ్యారు. కంటోన్మెంట్‌లో రహ దారి విస్తరణ, రక్షణశాఖ భూముల బదలాయింపుపై చర్చిం చారు. ఈ సమావేశంలో రాష్ట్రానికి సంబంధిం చిన పలు కీలక అంశాలపై చర్చించారు. ము ఖ్యంగా, తెలంగాణలో ట్రాఫిక్ సమస్యలను పరిష్క రించేందుకు అవసరమైన రక్షణ శాఖ భూముల ను బదలాయించాలని సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. హైదరాబా ద్‌లోని ట్రాఫిక్ రద్దీని తగ్గిం చడానికి స్కైవేలు, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం అత్య వసరం అని ముఖ్యమంత్రి వివరించారు. ఈ ప్రాజెక్టుల నిర్మాణానికి రక్షణ శాఖ ఆధీనంలో ఉన్న భూములను రాష్ట్రానికి బదిలీ చేయాలని కోరారు. ముఖ్యంగా, మెహదీపట్నం రైతుబజార్ వద్ద స్కై వాక్ నిర్మాణానికి భూమి అవసరమని, దీనివల్ల ప్రజలకు మెరుగైన సౌకర్యాలు లభిస్తా యని చెప్పారు. సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి మరో ముఖ్యమైన అంశం రాజీవ్ రహదారి విస్తరణను కూడా ప్రస్తావించారు. హైదరాబాద్–కరీంనగర్–రామగుండంలను కలిపే ఈ రహ దారిలో, ప్యాకేజీ జంక్షన్ నుండి ఔటర్ రింగ్ రోడ్డు జంక్షన్ వరకు

మిగతా 2లో..

### అణచివేత, దమనకాండపై ధిక్కార పతాకాన్ని ఎగురవేసిన ధీర వనిత

చాకలి ఐలమ్మకు సీఎం రేవంత్ నివాళి



2లో..



## సాదాబైనామా క్రమబద్ధీకరణకు మార్గం సుగమం

దరఖాస్తుల పరిష్కారానికి నోటిఫికేషన్ జారీ

తెలంగాణ ప్రభుత్వ నిర్ణయంతో 9 లక్షల మంది రైతులకు ఊరట


**హైదరాబాద్(జనంసాక్షి):** తెల్ల కాగితాలపై రాసుకున్న భూ కొనుగోళ్ల ఒప్పందాల (సాదాబైనామా) క్రమబద్ధీకరణకు ఎట్టకేలకు మార్గం సుగమమైంది. సాదా బైనా మాల దరఖాస్తుల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం బుధవారం నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో హక్కుల కోసం ఎదురు చూస్తున్న సుమారు 9 లక్షల మంది రైతులకు ఊరట లభించనుంది. భూ భారతిచట్టం ప్రకారం క్రమబద్ధీకరణకు రెవెన్యూశాఖ చర్యలు ఆరంభించింది. 2020 ఆర్వోఆర్ చట్టంలో క్రమబద్ధీకరణకు సెక్షన్లు లేకపోవడంతో అప్పట్లో ఈ ప్రక్రియను న్యాయ స్థానం నిలిపివేసింది. సాదాబైనామాల క్రమబ ద్ధీకరణ చేపడతామంటూ ముఖ్యమంత్రి రేవంత రెడ్డి, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివా సరెడ్డి పలుమార్లు ప్రకటించారు. న్యాయస్థానం లో ఉన్న వివాద పరిష్కారానికి పలు చర్యలు చేపట్టారు. దీంతో తాజాగా హైకోర్టు సాదాబైనా మా రైతులకు 13–బి ప్రొసీడింగ్స్ జారీ చేయడా నికి అనుమతించిన విషయం తెలిసిందే. రాష్ట్రంలోని పట్టణాలు మినహా ఇతర ప్రాంతాల్లో 2014 జూన్ రెండో తేదీ ముందు వరకున్న

మిగతా 2లో..



2లో..

## నేపాల్‌లో పాలన ఆర్మీచేతుల్లోకి..



### మాజీ ప్రధాని ఓలి అదృశ్యం

- ఆయన ఆచూకీ తమకు తెలియదన్న ఆర్మీ
- రాజ్యాంగాన్ని తిరగరాయాలంటున్న జెన్‌జడ్
- నేపాల్ తాత్కాలిక సారథిగా సుశీలా కర్కీ?..

### నేపాల్‌లో చిక్కుకున్న తెలంగాణ వాసుల కోసం

## రాష్ట్ర ప్రభుత్వం అండ

- న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో సహాయ కేంద్రం ఏర్పాటు
- ముగ్గురు అధికారుల బృందానికి బాధ్యతలు అప్పగింత
- సహాయం కోసం 091 9871999044,091 9643723157, 091 9949351270 నంబర్లలో సంప్రదించాలని సూచన




**హైదరాబాద్(జనంసాక్షి):** నేపాల్‌లో హింసాత్మక ఘటనల నేప థ్యంలో పలువురు తెలంగాణ వాసు లు అక్కడ చిక్కుకున్నారు. వారికి సహాయం అందించేందుకు రాష్ట్ర ప్రభు త్వం దిల్లీలోని తెలంగాణ భవ న్‌లో సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చే సింది. ముగ్గురు అధికారుల బృందా నికి బాధ్యతలు అప్పగించింది.

మిగతా 2లో..

## పిడుగుపాటుకు 8 మంది మృతి

### అందరూ వ్యవసాయ కూలీలే...

జోగులాంబ గద్వాల ముగ్గురు, నిర్మల్‌లో ముగ్గురు, ఖమ్మంలో ఇద్దరు మృతి

**నిర్మల్,గద్వాల్,ఖమ్మం(జనంసాక్షి):** తెలంగాణలో తీవ్ర విషాదం చోటుచే సుకుంది. ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు, పిడుగుపాటుతో ఒకే రోజు వేర్వేరు ప్రాంతాల్లో మొత్తం 8 మంది వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. నిర్మల్ జిల్లా పెంబి మండలం గుమ్మేన ఏంగ్లాపూర్ గ్రామానికి చెందిన అలకుంట ఎల్లయ్య, ఎల్లవ్వ అనే ఇద్దరు భార్య భర్తలతో పాటు బండారు వెంకటి అనే వ్యక్తి పిగుడు పాటుతో మృతి చెందారు. వీరందూ గ్రామ సమీపంలోని వ్యవసాయ పనులకు వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా పిడుగు పడటంతో మృతి చెందారు. జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండలం భూంపురం గ్రామానికి చెందిన పార్వతమ్మ (22), సర్వేశ్ (20), సౌభాగ్యమ్మ అనే రైతులు పొలంలో పత్తి తీస్తుండగా ఒక్కసారిగా పిగుడు పడింది. ఈ ప్రమాదంలో పార్వతమ్మ, సౌభాగ్యమ్మతో పాటు సర్వేశ్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు.

మిగతా 2లో..



ఓ వైపు చర్చలంటూనే..

## ట్రంప్ ద్వంద్వ వైఖరి

### భారత్, చైనాలపై 100 శాతం సుంకం విధించాలి

- చమురు కొనుగోళ్లు ఆపేస్తామనే వరకు ఈ టారీఫ్‌లను కొనసాగించండి
- ఈయూకు సూచించిన ట్రంప్

**వాషింగ్టన్(జనంసాక్షి):** ఉక్రెయిన్ యుద్ధం ముగించే అంశంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. అందులోభాగంగా భారత్ , చైనాల పై సుంకాల భారాన్ని పెంచి రష్యాపై ఒత్తిడి తీసుకురావాలని యోచిస్తున్నారు. ఆయా దేశాల దిగుమతులపై 100 శాతం సుంకాలు విధించాలని ట్రంప్ యూరోపియన్ యూనియన్ (ఈయూ)ను కోరినట్లు తెలుస్తోంది. ఈమేరకు ఫైనాన్షియల్ టైమ్స్ పేర్కొన్నట్లు పలు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. రష్యాపై ఆంక్షలు విధించే అంశంపై సీనియర్ అమె రికన్, ఈయూ అధికారులు వాషింగ్టన్‌లో సమావేశమ య్యారు. ఈసందర్భంగా ఈయూ అధికారులతో ట్రంప్ కాన్ఫరెన్స్ కాల్‌లో మాట్లాడారు. రష్యాపై ఆర్థికఒత్తిడి తీసుకువచ్చేందుకు భారత్, చైనాలపై 100 శాతం సుంకం విధించాలని సూచించినట్లు తెలుస్తోంది. చమురు కొనుగోలు చేయడం ఆపేస్తామనే వరకు ఈ టారిఫ్‌లను కొనసాగించాలన్నారు.

మిగతా 2లో..



### గ్రీన్‌కార్డ్ ఇక కలేనా..?

నిలిచిన ఆ వీసాల జారీ

**వాషింగ్టన్(జనంసాక్షి):** అమెరికాలో ట్రంప్ సర్కారు వచ్చిన తర్వాత గ్రీన్‌కార్డులు, వీసాల జారీ, వల సపోవడం కష్టతరంగా మారిన సంగతి తెలిసిందే. ఈ తరుణంలో గ్రీన్‌కార్డ్ పొందడానికి అవకాశం ఉన్న మరో మార్గం కూడా

మిగతా 2లో..

## దేశవ్యాప్తంగా ‘ఎస్ఐఆర్’

### చేపట్టేందుకు ఈసీ సన్నాహాలు

అక్టోబర్ నుంచి ప్రారంభమయ్యే అవకాశం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ అక్టో బర్ నుంచి ప్రారంభమయ్యే అవకా శం ఉంది. స్పెషల్ ఇంటెన్సివ్ రివి జన్ పక్రియపై ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన ఓ సమావేశంలో ఇందుకు సంబంధిం చిన సన్నాహాలను చర్చించారు. అన్ని రాష్ట్రాలు ,కేంద్రపాలిత ప్రాం తాల ప్రధాన ఎన్నికల అధికారు (సిఈఓ)లు ఈ సమావేశంలో పా ల్గొన్నారు. ఈ ప్రతిపాదనకు వారి ఆమోదం లభించింది. ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో బీహార్

మిగతా 2లో..






## గణపతి చందా ఇవ్వలేదని..

### నాలుగు దళిత కుటుంబాలు బహిష్కరణ

- జగిత్యాల జిల్లాలోని కల్లెడ గ్రామంలో అమానవీయ ఘటన
- ఎవరైనా మాట్లాడితే రూ.25 వేల జరిమానా విధిస్తామని బెదిరింపులు

**జగిత్యాల బ్యూరో (జనంసాక్షి):** జగిత్యాల రూరల్ మండలం కల్లెడ గ్రా మంలో సభ్య సమాజం తలదించుకునే ఘటన చోటుచేసుకుంది. ఇటీవల నిర్వహించిన వినాయక నవరాత్రుల సందర్భంగా గణపతి చందా ఇవ్వలేదని గ్రామానికి చెందిన నాలుగు కుటుంబాలను కుల బహిష్కరణ చేశారు. అంతటితో ఆగకుండా ఆ కుటుంబాలతో గ్రామంలోని వారు ఎవరూ మాట్లాడకూడదని దండోరా కూడా వేయించారు. వెలివేసిన కుటుంబాలతో ఎవరైనా మాట్లాడినట్లు తెలిస్తే వారికి రూ.25 వేల జరిమానా విధిస్తామని హుకుం జారీ చేసినట్లు బాధితులు తెలిపారు. ఆ కుటుంబాలతో కులానికి చెందిన ఎవరైనా మా ట్లాడినట్లు సమాచారం అందించిన వారికి రూ. 5 వేల నజరానా కూడా ప్రకటించారు. దీంతో చేసేదేమి లేక

మిగతా 2లో..

## జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ అభ్యర్థిగా సునీత..

### ఉపఎన్నికలో భారీ మెజార్టీతో పార్టీని గెలిపించడమే గోపీనాథ్‌కు సరైన నివాళి : కేటీఆర్




**హైదరాబాద్(జనంసాక్షి):** అక్టోబర్ చివరి వారం లేదా నవంబర్ మొదటి వారంలో జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ఉంటుందని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్య క్షుడు కేటీఆర్ అన్నారు. జూబ్లీహిల్స్ నుంచి భారత రాష్ట్ర సమితి జైత్రయాత్ర మళ్లీ ప్రారంభం కావాలని కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో జూబ్లీహిల్స్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి గంగుల కమలాకర్, దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సతీమణి సునీత పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీ–ఆర్ మాట్లాడుతూ.. మాగంటి సునీత కు అందరి ఆశీస్సులు ఉంటాయని ఆశిస్తున్నామ న్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో భారీ మెజార్టీతో పార్టీ ని గెలిపించడమే గోపీనాథ్‌కు సరైన నివాళి అని పేర్కొన్నారు. ఓటు–కు రూ.5 వేలు పంచితే గెలుస్తామ ని కాంగ్రెస్ నేతలు అనుకుంటు–న్నారని ఎద్దేవా చేశారు. ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదని విమర్శించారు. సీఎం సోదరుడు చెరువులో ఇళ్లు కట్టినా హైడ్రా వెళ్లదని.. కానీ పేదల బస్తీలకు వెళ్లి ఇళ్లు కూలగొడతారని విమర్శించారు. ఉపఎన్నిక కోసం సర్వేలు చేయిస్తు న్నాం.. నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి బాగుంది. కొన్ని బస్తీల్లో వెనకంజలో ఉన్నాం. అందరూ కలిసిక ట్టు–గా పనిచేసి పార్టీ గెలుపు కోసం కృషి చేయాలి. ఓటర్ల జాబితాలో దొంగ ఓట్లు– ఉంటే తొలగించాలి.. లేనివారివి చేర్చాలి. ఓటు– వేయకపోతే సంక్షేమ పథకాలు బంద్ చేస్తామని..

మిగతా 2లో..

## మన రాజ్యాంగాన్ని చూసి గర్వపడాలి

### పొరుగు దేశాల్లో పరిస్థితి చూడండి

నేపాల్‌లో పరిస్థితులనుద్దేశించి సీజేఐ వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** నేపాల్‌లో యువత నిరస నలు హింసాత్మకంగా మారా యి. దీంతో అక్కడ రాజకీయ సంక్షోభం ఏర్పడింది. కొన్ని నెలల క్రితం బంగ్లాదేశ్‌లోనూ ఇదే పరిస్థితి. ప్రధాని పదవికి రాజీనామా చేసిన షేక్ హసీనా.. దేశాన్ని వీడి భారత్‌లో తలదా చుకుంటున్నారు. ఈ పరిణామాల నడుమ ఓ కేసు విచారణ సమయంలో భారత సర్వోన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. నేపాల్, బంగ్లాదేశ్‌లోని పరిస్థితులను ఉటం కిస్తూ.. మన రాజ్యాంగం పట్ల గర్వపడుతున్నట్లు పేర్కొంది. రాష్ట్రాల బిల్లుల ఆమోదంలో న్యాయస్థానం తనకు గడువు నిర్దేశించడంపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము కోరిన అభిప్రాయం అంశమై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ముందు బుధవారం వాదనలు కొనసాగాయి. సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్ నేతృత్వంలోని ఈ ధర్మాసనంలో జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ పి.ఎస్.నర సింహ, జస్టిస్ ఎ.ఎస్.చందూర్కర్ సభ్యులుగా ఉన్నారు. ఈక్రమంలోనే రాజ్యాంగాన్ని ప్రస్తావించిన

మిగతా 9లో..

## ప్రభుత్వాసుపత్రుల్లో అవయవ మార్పిడి

- చికిత్సలను ప్రోత్సహించేందుకు చర్యలు చేపట్టాలి
- ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో ఆర్గాన్ రిట్రైవల్ సెంటర్లు
- ఎంజీఎం, రిమ్స్‌లో ట్రాన్స్‌ప్లాంట్ సర్జరీలు
- కార్పొరేట్ ఆస్పత్రులను నిరంతర నిఘా: మంత్రి రాజనర్సింహ



**హైదరాబాద్(జనంసాక్షి):** ప్రభుత్వ హాస్పిట ల్స్‌లో అవయవ మార్పిడి సర్జరీలను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకోవాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. ఈ మేరకు జీవన్‌దాన్ పనితీరు, ప్రభుత్వ దవాఖాన్లలో అవయవ మార్పిడి చికిత్సలను ప్రోత్సహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై జూబ్లిహిల్స్‌లోని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో అధికారులతో మంత్రి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నిమ్స్, గాంధీ, ఉస్మానియాతో పాటు ఆదిలాబాద్ రిమ్స్, వరంగల్ ఎంజీఎంలోనూ అవయవమార్పిడి సర్జరీలు జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.అన్ని ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో ఆర్గాన్ రిట్రైవల్ సెంటర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించాలన్నారు.

మిగతా 2లో..

## ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయను

- కిషన్ రెడ్డి రాజీనామా చేస్తే.. నేనూ చేస్తాను.
- ఆయన వల్లే రాష్ట్రంలో బీజేపీ నాశనమైంది
- ప్రస్తుత అధ్యక్షుడు రామచందర్ రావు రబ్బర్ స్టాంప్‌గా మారారు
- రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్ (జనంసాక్షి):** గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశా రు. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసే ప్రసక్తే లేదని.. ఏం చేసుకుం టారో చేసుకోండి అని బీజేపీ నాయ కత్వానికి రాజాసింగ్ తేల్చిచెప్పారు. ఇవాళ రాజాసింగ్ మీడియాతో మా ట్లాడారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి రాజాసింగ్ సవాల్ విసిరారు. నేను ఎమ్మెల్యే

మిగతా 2లో..

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
11.09.2025

# ట్రంప్ ద్వంద వైఖరి

'మేము ఇలా చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. కానీ, యూరోపియన్ భాగస్వాములతో కలిసి ముందుకువస్తేనే దీన్ని అమలుచేద్దాం' అని యూఎస్ అధికారి ఒకరు తెలిపారు. అమెరికా సూచనలు అమలుచేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఈసందర్భంగా ఈయూ అధికారులు పేర్కొన్నట్లు సమాచారం. ఉక్రెయిన్‌లో త్వరగా శాంతి నెలకొల్పాలని ఈయూ కూడా భావిస్తుంది. ఈ క్రమంలో రష్యాపై ఒత్తిడి తెస్తేనే అది సాధ్యమవుతుందని ట్రంప్ పేర్కొన్నారు. దీంతో యూరోపియన్ నేతలు కూడా ఆ దిశగా ఆలోచన మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. అయితే భారత్, చైనా వంటి దేశాలపై ద్వితీయ ఆంక్షలు విధిస్తే నెలకొనే పరిణామాలపై వారు చర్చలు జరుపుతున్నారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తుండటంపై భారత్, చైనాలపై ట్రంప్ కొన్ని రోజులుగా గుర్రుగా ఉన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో భారత్‌పై 50 శాతం సుంకాలు విధించారు. ఇటీవల ఎస్సీవో సమ్మిట్‌కు భారత ప్రధాని మోదీ చైనాలో పర్యటించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా అధినేత పుతిన్‌తో భేటీ అయ్యి ద్వైపాక్షిక చర్చలు జరిపారు. దీనిపై కూడా ట్రంప్ తన అక్కసును వెళ్లగక్కారు. మరోవైపు.. భారత్‌తో నెలకొన్న వాణిజ్య అడ్డంకులు తొలగించుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు ట్రంప్ తన ట్రూత్ సోషల్‌లో పోస్టు పెట్టారు. ఈసందర్భంగా ప్రధాని మోదీతో మాట్లాడేందుకు ఎదురుచూస్తున్నట్లు తెలిపారు.

# గ్రీన్‌కార్డ్ ఇక కలేనా..?

తాజాగా నిలిచిపోయింది. ఈబీ-3, ఈడబ్ల్యూ వీసాల జారీని యూఎస్ స్టేట్ డిపార్ట్‌మెంట్ నిలిపివేసింది. 2024-2025 ఆర్థిక సంవత్సరానికి వాటి కోటా పూర్తికావడమే అందుకు కారణం. దాంతో వచ్చే ఆర్థిక సంవత్సరం వరకు అమెరికా దౌత్య కార్యాలయాలు ఈ వీసాలు జారీ చేయవు. అక్టోబర్ 1 తర్వాతే కొత్త కోటాపై నిర్ణయం వెలువడనుంది. అమెరికాలో ఆర్థిక సంవత్సరం అక్టోబర్ 1తో మొదలై సెప్టెంబర్ 30తో ముగుస్తుంది.నైపుణ్యం కలిగిన, నైపుణ్యం లేని కార్మికులు, నిపుణులు, పెట్టుబడిదారులు అందరికీ అవకాశం కల్పించేలా గ్రీన్‌కార్డ్ కోసం దరఖాస్తు చేసుకునేవారిని కొన్ని గ్రూపులుగా విభజించారు. అందులో ఈబీ-3 విభాగాన్ని నైపుణ్యం కలిగిన కార్మికులు, నిపుణులు, ఇతర అర్హత పొందిన కార్మికులకు (ఈడబ్ల్యూ) కేటాయించారు. వార్షిక ఉపాధి ఆధారిత ఇమిగ్రేషన్ వీసాలలో 26.6 శాతం దీనికింద జారీ అవుతుంటాయి. ఈబీ-3లోని 'ఇతర కార్మికులు (ఈడబ్ల్యూ)' ఉప విభాగం కింద రెండు సంవత్సరాలలోపు శిక్షణ లేక అనుభవం ఉన్న కార్మికులను పరిగణిస్తారు. దీనికింద ఏడాది కాలానికి 10వేల వీసాలు ఇస్తుంటారు. దీంతో ఈబీ-3 వీసాలకు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. ఈబీ-3, ఈడబ్ల్యూ కేటగిరీల కింద భారత నిపుణులు ప్రియారిటీ డేట్లను పొందడంలో జాప్యాన్ని ఎదుర్కొంటున్నారు. ఇప్పుడు వచ్చే ఆర్థిక సంవత్సరం వరకు ఈబీ-3 కేటగిరీ అందుబాటులో లేనందున.. కొత్త అప్లికేషన్లు ఏవీ ప్రాసెస్ చేయడానికి వీలు ఉండదు. అమెరికాలో గ్రీన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకొన్న భారతీయులు.. ప్రాసెసింగ్‌లో తీవ్ర జాప్యాన్ని ఎదుర్కొంటున్నారు. సెప్టెంబర్‌లో విడుదలైన వీసా బులెటిన్ ప్రకారం.. భారత దరఖాస్తుదారులకు తుది ప్రాధాన్యం తేదీల్లో ఏ పురోగతి లేదు. పరిమిత స్థాయిలో వీసాల లభ్యత, బ్యాక్‌లాగ్ సమస్యను ఇది వెల్లడి చేస్తోంది. ఇదిలాఉంటే.. వార్షిక పరిమితి దాటడంతో ఈబీ-1, ఈబీ-2 వీసాల జారీని కూడా సెప్టెంబర్ 30 వరకు అమెరికా ఇప్పటికే నిలిపివేసింది. సైన్స్, కళలు, విద్య, వ్యాపార, క్రీడలు వంటివాటిలో అసాధారణ సామర్థ్యం కలిగినవారిని ఈబీ-1 కింద పరిగణిస్తారు. అమెరికా వ్యాపారాలకు సంబంధించిన ఉద్యోగాలు చేస్తూ అత్యున్నత డిగ్రీలు కలిగినవారిని ఈబీ-2 కేటగిరీ కింద పరిగణిస్తారు. తాజాగా వీసాల జారీ నిలిపివేత ఈ విభాగాల్లో బ్యాక్‌లాగ్‌లను మరింత పెంచింది.

## ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయను..

పదవికి రాజీనామా చేయను. కిషన్ రెడ్డి రాజీనామా చేస్తే.. నేనూ చేస్తాను. కిషన్ రెడ్డి రాజీనామా చేస్తే ఇద్దరం కలిసి ఇండిపెండెంట్లుగా ఎన్నికలకు వెళ్దాం. అప్పుడు ఎవరు గెలుస్తారో తెలుస్తుంది. కిషన్ రెడ్డి వల్లే రాష్ట్రంలో బీజేపీ నాశనమైంది. ప్రస్తుత అధ్యక్షుడు రామచందర్ రావు రబ్బర్ స్టాంప్‌గా మారారని రాజాసింగ్ ఆరోపించారు. గత మూడు ఎన్నికల్లోనూ నన్ను గోషామహల్ ప్రజలే నన్ను గెలిపించారు. బీజేపీ నాకు ఎలాంటి సహకారాలు అందించలేదు. పార్టీలో నేను ఎలాంటి పదవి ఆశించలేదు. ఇప్పుడున్న కమిటీతో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రాదు. ఈ కమిటీతో అధికారంలోకి వస్తే రాజకీయ సన్యాసం చేస్తా. పార్టీని సర్వనాశనం చేస్తున్నదెవరో మరోసారి చెప్తాను. ఢిల్లీ పెద్దలు నాకు తరచూ ఫోన్ చేసి మాట్లాడుతారు. నాకు ఎప్పట్నుంచో కేంద్రం పెద్దల ఆశీర్వాదం ఉంది. నేను ఎప్పటికీ బీజేపీ నేతనే.. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలో చేరను. పదవీ భయంతోనే కొందరు మాట్లాడడం లేదు అని రాజాసింగ్ పేర్కొన్నారు.

## జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ అభ్యర్థిగా సునీత

ఇళ్లు కూలుస్తామని అంటారు. పేదలకు ఇవ్వడానికి డబ్బులు లేవు కానీ మూసీ ప్రాజెక్టుకు డబ్బులు ఉన్నాయట. కేసీఆర్ మళ్లీ సీఎం కావాలంటే జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో సత్తా చూపాలి. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒక్క మైనార్టీ మంత్రి కూడా లేరు. మాగంటి గోపీనాథ్‌లాగే తనకూ అండగా నిలవాలని కార్యకర్తలను ఆయన సతీమణి సునీత కోరారు. గోపీనాథ్ ఆశయాలను నెరవేర్చేందుకు అందరమూ కలిసి పనిచేద్దామన్నారు. భారత రాష్ట్ర సమితిలో కష్టపడే కార్యకర్తలకు గుర్తింపు ఉందని మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో పార్టీని భారీ మెజార్టీతో గెలిపిస్తామని చెప్పారు.

ఇందిరమ్మ రాజ్యమంటే ఇండ్లు కూలగొట్టడమేనా..? : కేటీఆర్

ఓటు తమకు వేయకపోతే సంక్షేమ పథకాలు ఆపేస్తామంటూ కాంగ్రెస్ పార్టీ ప్రజలను బెదిరిస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు ఆరోపించారు. హైడ్రా పేరుతో బిల్డర్ల దగ్గర దోచుకున్న అవినీతి సొమ్మును ఉపఎన్నికలో పంచి గెలవడానికి రేవంత్ రెడ్డి కుట్ర చేస్తున్నారని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన 22 నెలల్లో ప్రజలకు ఒక్క మంచి పని కూడా చేయని రేవంత్, జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో ఎలాగైనా గెలిచేందుకు అడ్డదారులు తొక్కుతున్నారని మండిపడ్డారు.బుధవారం ఉదయం తెలంగాణ భవన్‌లో జరిగిన జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని రహ్మత్ నగర్ డివిజన్ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. ఇచ్చిన హామీలను అమలుచేయకుండా తమ అసమర్థతను అప్పులపై నెట్టి తప్పించుకోవాలని చూస్తున్న కాంగ్రెస్‌ను ప్రజలు తీవ్రంగా ద్వేషిస్తున్నారన్నారు. ఇటీవల గణేష్ నిమజ్జనానికి వెళ్లిన సీఎం రేవంత్‌ను ప్రజలు ఏ మాత్రం పట్టించుకోలేదన్న కేటీఆర్.. ప్రభుత్వంతో ప్రజలు డిస్‌కనెక్ట్ అయ్యారనడానికి అదే నిదర్శనమని చెప్పారు. ఇందిరమ్మ రాజ్యం అంటే ఇండ్లు కూలగొట్టడమేనా..? అని కేటీఆర్ ప్రశ్నించారు. కాంగ్రెస్‌లో చేరలేదన్న అక్కసుతో బీఆర్ఎస్ కార్యకర్త సర్దార్ ఇంటిని కూల్చివేస్తే ఆయన ఆత్మహత్య చేసుకున్నాడని ఆవేదన వ్యక్తంచేశారు. హైడ్రా తన ఇల్లు కూలగొడుతుందన్న భయంతో కూకట్‌పల్లిలో బుచ్చమ్మ అనే మహిళ ప్రాణాలు తీసుకుందని గుర్తుచేశారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో పొరపాటున కాంగ్రెస్‌కు ఓటేస్తే, తమ ఇండ్లను కూలగొట్టేందుకు ప్రభుత్వానికి లైసెన్స్ ఇచ్చినట్టే అని హెచ్చరించారు. డబ్బున్న పెద్దల జోలికి హైడ్రా పోదన్న కేటీఆర్.. దుర్గంచెరువులో అక్రమంగా ఇల్లు కట్టుకున్న రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి ఇంటిని కూల్చే దమ్ముందా..? అని ప్రశ్నించారు.అధికారం ఉందన్న అహంకారంతో పేదలను కాంగ్రెస్ ప్రభుత్వం దోచుకుంటుందని విమర్శించారు. కారు గర్తుకు ఓటేసి కాంగ్రెస్, రేవంత్ రెడ్డి అహంకారాన్ని బొందపెట్టాలని జూబ్లిహిల్స్ ప్రజలకు కేటీఆర్ పిలుపునిచ్చారు. ప్రధాని మోదీని పెద్దన్నలా భావించి ఆయన మార్గదర్శనంలో నడుస్తున్న బీజేపీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనే సత్యాన్ని మైనార్టీలు ఇప్పటికైనా గుర్తించాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. రాహుల్‌గాంధీ తీవ్రంగా వ్యతిరేకించే బీజేపీ, మోదీ, సీబీఐ లాంటి అంశాల్లో కాంగ్రెస్ భావజాలానికి వ్యతిరేకంగా రేవంత్ పనిచేస్తున్నారని విమర్శించారు.



# గాంధీ సరోవర్‌కు రక్షణ భూమలు బదలాయించండి

ఆరు లేన్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి 83 ఎకరాల రక్షణ శాఖ భూమి అవసరమని తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తి అయితే ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గుతుందని వివరించారు. వీటితో పాటు-, తెలంగాణలో సైనిక్ స్కూల్ ఏర్పాటుపైనా ఈ సమావేశంలో చర్చ జరిగినట్లు- సమాచారం.లంగర్‌హౌజ్ వద్ద గాంధీ సరోవర్ ప్రాజెక్టు కోసం 98.20 ఎకరాల రక్షణశాఖ భూములు తెలంగాణ ప్రభుత్వానికి బదలాయించాలని కోరారు. మూసీ, ఈసీ నదుల సంగమం సమీపంలో 'గాంధీ సర్కిల్ ఆఫ్ యూనిటీ-' నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. జాతీయ సమైక్యత, గాంధేయ విలువలకు సంకేతంగా గాంధీ సరోవర్ ప్రాజెక్టు నిలుస్తుందని పేర్కొన్నారు. గాంధీ సిద్ధాంతాలను ప్రచారం చేసే నాలెడ్జ్ హబ్, ధ్యాన గ్రామం నిర్మిస్తామన్నారు. చేనేత ప్రచార కేంద్రం, ప్రజా వినోద స్థలాలు, ఘాట్లు-, శాంతి విగ్రహం, మ్యూజియం ఏర్పాటు చేస్తామని రాజ్‌నాథ్ సింగ్‌కు సిఎం తెలిపారు. సీఎం వెంట పలువురు తెలంగాణ ఎంపీలు కూడా ఈ భేటీలో పాల్గొన్నారు. రాజ్ నాథ్ సింగ్‌తో జరిగిన ఈ సమావేశం రాష్ట్ర అభివృద్ధి ప్రాజెక్టులకు ఊతమిస్తుందని భావిస్తున్నారు.

# అణచివేత, దమనకాండపై ధిక్కార పతాకాన్ని ఎగురవేసిన ధీర వనిత

## చాకలి ఐలమ్మకు రేవంత్ నివాళి

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** అణచివేత, దమనకాండపై చాకలి ఐలమ్మ ధిక్కార పతాకాన్ని ఎగురవేశారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. తెలంగాణ గడ్డపై దొరల అహంకారానికి, నిరంకుశత్వానికి వ్యతిరేకంగా 80 ఏళ్ల క్రితమే జంగ్ సైరన్ ఊదిన యోధురాలు అని తెలిపారు. సమ్మక్క, సారలమ్మ, చాకలి ఐలమ్మ స్ఫూర్తితోనే తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందించినట్లు గుర్తుచేశారు.

# సాదాబైనామా క్రమబద్ధీకరణకు మార్గం సుగమం

సాదాబైనామా కొనుగోళ్లను.. 2016లో నాటి ప్రభుత్వం తొలిసారిగా క్రమబద్ధీకరించింది. అప్పట్లో 12.64 లక్షల దరఖాస్తులు రాగా.. పరిశీలన అనంతరం 6.18 లక్షల మేర క్రమబద్ధీకరించారు. రెండోసారి 2020లో క్రమబద్ధీకరణకు అవకాశమిస్తూ ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానించింది. కానీ ఆర్వోఆర్-1971ను సవరించి తెచ్చిన ఆర్వోఆర్-2020 చట్టంలో క్రమబద్ధీకరణకు సెక్షన్లు చేర్చలేదు. పైగా 2020 చట్టం అమలులోకి రావడానికి ముందు, ఆ తరువాత దరఖాస్తులను స్వీకరించడం న్యాయ వివాదానికి దారితీసింది. 1971 నాటి చట్టం అమల్లో ఉన్నప్పుడు తీసుకున్న దరఖాస్తులనే పరిగణనలోకి తీసుకోవాలని కోర్టు ఆదేశాలిచ్చింది. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకురావాలనుకున్నా ఈ ప్రక్రియ మొత్తం నిలిచిపో యింది. అప్పుడు వచ్చిన దరఖాస్తులు 9,00,894 పెండింగులో ఉన్నాయి.

**భూ భారతిలో సెక్షన్లు**

ఆర్వోఆర్-2020 స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్వోఆర్-2025 భూభారతి చట్టాన్ని తీసుకొచ్చింది. ఈ చట్టంలోని సెక్షన్-6 ద్వారా సాదాబైనామాల క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించారు. విచారణాధికారిగా ఆర్డీవోకు బాధ్యతలు అప్పగించారు. క్రమబద్ధీకరణ పూర్తయితే రైతులకు కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు జారీ కావడంతోపాటు ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్లు- మ్యుటేషన్ల ద్వారా పెద్ద ఎత్తున రాబడి కూడా రానుంది.

## ప్రభుత్వాసుపత్రుల్లో అవయవమార్పిడి చికిత్సలు

సీనియర్ డాక్టర్లతో డెడికేటెడ్ టీమ్స్ ఏర్పాటు చేయాలని, ఒక్కో ఆర్గాన్‌కు ఒక్కో టీమ్ ఉండాలని హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తుకు మంత్రి సూచించారు.ప్రభుత్వ హాస్పిటల్స్‌లో అవయవమార్పిడి సర్జరీలను ప్రోత్సహించే విధంగా ఈ బృందాలు పనిచేయాలన్నారు.ఇటీవల కేంద్ర చట్టాన్ని అడాప్ట్ చేసుకున్నందున ఇందుకు అనుగుణంగా కొత్త నిబంధనల రూపకల్పనపై సమావేశంలో చర్చించారు.ఈ చట్టం ప్రకారం సొంత కుటుంబ సభ్యులతో పాటు, గ్రాండ్ పేరెంట్స్ కూడా అవయవాలు డొనేట్ చేసేందుకు, స్వీకరించేందుకు అర్హులేనని ఈ నిబంధనను అమలు చేస్తున్నామని అధికారులు తెలిపారు.తోట యాక్ట్ ప్రకారం ఆర్గాన్ స్వాపింగ్‌కు కూడా అవకాశం ఇవ్వాలని అధికారులకు మంత్రి సూచించారు. ఈ యాక్ట్ ప్రకారం ఇరువురు పేషెంట్ల కుటుంబ సభ్యులు ఒకరికొకరు ఆర్గాన్స్ డొనేట్ చేసుకునే వెసులుబాటు ఉంటుంది.స్వాపింగ్ విషయంలో ఇతర రాష్ట్రాలు అవలంభిస్తున్న నిబంధనలను పరిశీలించి, బాధితులను ఆదుకునే విధంగా రూల్స్ ఫ్రేమ్ చేయాలని ఆదేశించారు. అవయవదానంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జీవన్‌దాన్ కోఆర్డినేటర్, డాక్టర్ భూషన్‌రాజుకు మంత్రి సూచించారు. దీనికోసం ప్రజా ప్రతినిధులు, ప్రముఖుల సహకారం తీసుకోవాలన్నారు.ఆర్గాన్ డోనర్ల కుటుంబ సభ్యులకు అండగా నిలవాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా మంత్రి వ్యాఖ్యానించారు.బ్రెయిన్ డెత్ అయిన వారి అవయవాలను ఇతరులకు డొనేట్ చేసి ఆదర్శంగా నిలుస్తున్న కుటుంబాలను అందరూ అభినందించాలన్నారు.ఆర్గాన్ డోనర్ల దహన సంస్కారాలకు ఆర్థిక సాయం అందించడంతో పాటు, వారి కుటుంబాలకు అండగా ఉండేందుకు అవసరమైన ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రైవేటు, కార్పొరేట్ హాస్పిటళ్లలో జరుగుతున్న అవయవమార్పిడి సర్జరీలపై నిరంతరం నిఘా పెట్టాలని ఉన్నతాధికారులను మంత్రి ఆదేశించారు.

## మన రాజ్యాంగాన్ని చూసి గర్వపడాలి

సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్.. ప్రజాప్రాముఖ్యం కలిగిన లేదా ప్రజలను ప్రభావితం చేసే ఏదైనా చట్టంపై సుప్రీం కోర్టు సలహా కోరే హక్కు రాష్ట్రపతికి ఉందన్నారు. "మన రాజ్యాంగం చూసి గర్విస్తున్నాం. పొరుగుదేశాల్లో ఏం జరుగుతుందో చూడండి. నేపాల్‌లో పరిస్థితి గమనించండి" అని వ్యాఖ్యానించారు. "అవును.. బంగ్లాదేశ్‌లోనూ" అంటూ జస్టిస్ విక్రమ్‌నాథ్ స్పందించారు. బిల్లులను నెల రోజులకు పైగా రిజర్వ్ చేసే విషయంలో గవర్నర్ల అధికారాలను సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సమర్థించారు. అటువంటి కేసులు తక్కువే ఉన్నాయన్నారు. రాష్ట్రప్రభుత్వం ఆమోదించిన అన్ని బిల్లుల్లో 90 శాతం బిల్లులకు గవర్నర్ నెలలోపే సమ్మతి తెలుపుతారని చెప్పారు. 1970 నుంచి 2025 వరకు తమిళనాడుకు చెందిన ఏడు బిల్లులు సహా కేవలం 20 బిల్లులు మాత్రమే రిజర్వ్‌లో ఉన్నట్లు ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు.

## దేశవ్యాప్తంగా 'ఎస్ఐఆర్'

అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా ఇలాంటి ఓటర్ల జాబితా సవరణ నిర్వహించింది.ఇదే పక్రియను అన్ని రాష్ట్రాల్రు, కేంద్రపాలిత ప్రాంతాలకు విస్తరించాలని ఎన్నికల కమిషన్ నిర్ణయించింది.బీహార్ లో అసెంబ్లీ ఎన్నికలు ముగిసే లోగానే స్పెషల్ ఇం-టె-న్సివ్ రివిజన్ పై ప్రకటన రావచ్చునని ఎన్నికల కమిషన్ వర్గాలు తెలిపాయి. ఈ సమావేశం కాన్ఫరెన్స్ - కమ్- వర్క్ షాప్ మాదిరి సాగింది. ఈ సందర్భంగా ఎప్పటిలోగా ఈ పక్రియ చేపట్టే అవకాశం ఉందని సిఈఓల అభిప్రాయాలను తెలుసుకున్నారు. చాలా మంది అక్టోబర్ నుంచి సర్ చేపట్టేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. ఈ నెలలో అందుకు అవసరమైన సన్నాహాలు పూర్తి చేస్తామని కూడా కమిషన్ కు తెలిపారు.ఈ సమావేశంలో ప్రధానంగా స్పెషల్ ఇం-టె-న్సివ్ రివిజన్ కోసంచేయాల్సిన సన్నాహాలపై దృష్టి పెట్టారు. సవరణ సమయంలో ఓటర్లను ధృవీకరించేందుకు అవసరమైన పత్రాల జాబితా సిద్ధం చేయాలని సూచించింది

## గణపతి చందా ఇవ్వలేదని..

బాధిత కుటుంబాలు జగిత్యాల రూరల్ పోలీసులను ఆశ్రయించారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.జరిగిన ఘటనపై బాధితులను అడగగా తమ కులం పేరుతో ప్రతిసారి గణపతి వేడుకలు నిర్వహిస్తారని, ఈసారి చందాలను మర్యాదపూర్వకంగా అడగకుండా వాట్సాప్ గ్రూప్లో పరుషపదజాలం ఉపయోగించారని వాపోయారు. ఈ గ్రూపులో 52 మంది ఉన్నట్లు చెప్పారు. ఇలా ఎందుకు మాట్లాడుతున్నారని అడిగినందుకు అంతా ఒక్కటై తమపై కక్షపూరితంగా పంచాయితీకి పిలిచారన్నారు. అంతే కాకుండా అన్యాయంగా తమపై పోలీస్ స్టేషన్లో పిటిషన్ ఇచ్చారని వాపోయారు. ఇలా చేయడంతో తాము కూడా పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు. దుబాయ్లో ఉన్న వ్యక్తిని కూడా కుల బహిష్కరణ చేశారని అన్నారు. అతను ఏ వాట్సాప్ గ్రూప్లో ఉన్నా తీసేస్తున్నారని చెప్పారు.

ఒకే కమ్యూనిటి మధ్య మనస్పర్థాలు

ఈ కుల బహిష్కరణ ఘటనపై జగిత్యాల రూరల్ సీఐ సుధాకర్ వివరాలు తెలిపారు. రూరల్ మండలంలో కల్లెడ గ్రామంలో ఒకే కమ్యూనిటి మధ్య మనస్పర్థాలు వచ్చినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అందులో చూస్తే కొన్ని కుటుంబాలను గ్రామం నుంచి వెలివేసినట్లు తెలిసిందని సీఐ అన్నారు. దీంతో వెంటనే స్పందించి ఇరు వర్గాలను పోలీస్ స్టేషన్ పిలిచినట్లు వివరించారు. కౌన్సిలింగ్ ఇచ్చి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

## పిడుగుపాటుకు 8 మంది మృతి

మరో ఇద్దరు కూళీలు తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు గాయపడిన వారికి స్థానిక హాస్పిటల్‌కు తరలించారు.ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలంలో ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడే క్రమంలో పిడుగుపాటుకు గురై మృతి చెందాడు. సత్యనారాయణపురం గ్రామానికి చెందిన ధారావత్ మహేష్ (35)అనే వ్యక్తి పశువులను మేపేందుకు బయటకు వెళ్లగా వర్షం కురుస్తుందని చెట్టు వద్దకు వెళ్ళాడు. అకస్మాత్తుగా పిడుగు పడటంతో పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. అలాగే మదిర మండలం మడుపల్లి గ్రామంలో పొలంలో వ్యవసాయ పనులు చేస్తుండగా పిడుగు పడి గడిపూడి వీరభద్ర రావు అనే రైతు మృతి చెందాడు.

# నేపాల్‌లో పాలన ఆర్మీచేతుల్లోకి..



**ఖాట్మండ్(జనంసాక్షి):** హిమాలయ హిందూ దేశం ఆర్మీ చేతుల్లోకి వెళ్లింది. ఆర్మీ కంట్రోల్ చేసేందుకు అధికారాన్ని తన చేతుల్లోకి తీసుకుంది. జెన్-జడ్ ఆగ్రహంతో అల్లకల్లోలమైన నేపాల్‌లో పరిస్థితులను అదుపులోకి తీసుకువచ్చేందుకు ఆ దేశ ఆర్మీ రంగంలోకి దిగింది. కర్ఫ్యూ ప్రకటించింది. మరోవైపు, నేపాల్ అధ్యక్షుడు రామచంద్ర పౌడెల్ని రసన కారుల బృందంతో సమావేశం కాను న్నారు. ఈ నేపథ్యంలో యువ ఆందో ళనకారులు తమ డిమాండ్లను వెల్లడించారు. రాజ్యాంగాన్ని తిరిగిరాయాలని డిమాండ్ చేశారు. ఈ యువతరంగం నేపాల్ పాలనలో సమూల మార్పులు ఆశిస్తోంది. దానికి తగ్గట్టుగా కొన్ని డిమాండ్లను ముందుంచింది. ఈ ఉద్యమం ఒక పార్టీ, ఒక వ్యక్తి కోసం కాదు. మొత్తం ఒక జనరేషన్, దేశ భవిష్యత్తు కోసం. కొత్త రాజకీయ వ్యవస్థ ఆధారంగానే శాంతి నెలకొంటుంది. అధ్యక్షుడు, నేపాల్ సైన్యం మా ప్రతిపాదనలను సానుకూలంగా అమలుచేస్తుందని భావిస్తున్నామని ఓ ప్రకటనలో వారు పేర్కొన్నారు. ప్రస్తుత రాజ్యాంగాన్ని తిరిగి రాయాలని, మూడు దశాబ్దాలుగా రాజకీయ పార్టీలు సాగించిన అవినీతిపై దర్యాప్తు జరపాలని కోరుతున్నారు. అలాగే ఈ ఆందోళనల్లో ప్రాణాలు కోల్పోయిన వారిని అమరులుగా ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నారు. నిరుద్యోగాన్ని పారదోలేందుకు, వలసలు అరికట్టేందుకు, సామాజిక అన్యాయాన్ని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. వీరి బృందం ఆర్మీ ప్రతినిధులతో కలిసి అధ్యక్షుడిని కలవనుంది. ఈ పరిణామాలను నిశితంగా గమనిస్తోన్న భారత్.. సరిహద్దుల వద్ద భద్రతను కట్టుదిట్టం చేసింది. సామాజిక మాధ్యమాలపై నేపాల్ ప్రభుత్వం నిషేధం విధించడంతో ఒక్కసారిగా పెల్లుబికిన ఆందోళనల తీవ్రతకు కేపీ శర్మ ఓలీ ప్రధాని పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. దాంతో తదుపరి ప్రభుత్వం ఏర్పాటయ్యేవరకు పరిస్థితులను చక్కదిద్దేందుకు ఆర్మీ బాధ్యతలు తీసుకుంది. ఈ క్రమంలో సైనికులు రాజధాని కాఠ్‌మాండూ వీధుల్లో పహారా కాస్తున్నారు. ప్రజలంతా ఇళ్లల్లోనే ఉండాలని కోరారు. నిరసనకారులు చర్చలకు రావాలని చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ జనరల్ అశోక్ రాజ్ సిగ్డెల్ పిలుపునిచ్చారు. ఈ కర్ఫ్యూ వేళ.. విధ్వంసం, దోపిడీ, దాడులు వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. నేపాల్ ను ఆనుకొని ఉన్న సరిహద్దు ప్రాంతాల్లో మన దేశం భద్రతను పెంచింది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని సరిహద్దు జిల్లాల్లో మార్కెట్లు- మూగబోయాయి. తమ రోజువారీ జీవనానికి ఆటంకం ఏర్పడటంతో స్థానికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

మాజీ ప్రధాని ఓలి అదృశ్యం

జెన్-జెడ్ ఉద్యమానికి తలొగ్గి నేపాల్ ప్రధాని కేపీ శర్మ ఓలి రాజీనామా చేశాక, 24 గంటలు గడుస్తున్నా ఓలి ఆచూకీ మాత్రం ఇప్పటి వరకు లభించలేదు. ఆయనను లక్ష్యంగా చేసుకుని నిరసనకారులు ఏమైనా దాడి చేశారా, లేదంటే దుబాయ్‌కి పారిపోయారా? అన్నది ఇంకా తెలియలేదు. దీనిపై సైన్యం కూడా స్పష్టత ఇవ్వలేదు. ఓలి సమాచారం తమకు కూడా తెలియదని సైన్యం వెల్లడించింది. దీంతో ఆయన ఎక్కడ ఉన్నారన్న దానిపై సందిగ్ధం నెలకొంది. క్షేమంగానే ఉన్నారా? లేదంటే దుబాయ్ వెళ్లిపోయారా అన్న చర్చ నడుస్తోంది. అయితే ఓలి రాజీనామా చేశాక అజ్ఞాతంలోకి వెళ్లారని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే భద్రతా కారణాల దృష్ట్యా నేపాల్ సైన్యం ఓలిని తన ప్రధాన కార్యాలయానికి తీసుకువచ్చిందని ఖాట్మండు నుంచి నివేదికలు అందాయి. కానీ ఆయన ఎక్కడున్నారన్న విషయం మాత్రం వెల్లడించలేదు. అయితే ఓలి మయన్మార్ రాజధాని నేపిడాకు పారిపోయినట్లు మరిన్ని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే ఇవన్నీ పుకార్లేనని సైన్యం కొట్టిపారేస్తోంది. సైన్యం ఇంకా అధికారింగా నిర్ధారించలేదు. కేపీ శర్మ ఓలి ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేపట్టిన ఉద్యమం రణరంగంగా మారింది. సోమ, మంగళవారాల్లో జరిగిన విధ్వంసానికి నేపాల్ రాజధాని ఖాట్మండు అతలాకుతలం అయిపోయింది. ప్రభుత్వ భవనాలు, కార్లు, ఆస్తులను నిరసనకారులు ధ్వంసం చేశారు. ఇక మాజీ ప్రధాని ఇంటికి నిప్పుపెట్టడంతో మాజీ ప్రధాని ఝలనాథ్ ఖనాల్ భార్య రాజ్యలక్ష్మీ చిత్రాకార్ సజీవ దహనం అయ్యారు.

## నేపాల్‌లో చిక్కుకున్న తెలంగాణ వాసుల కోసం రాష్ట్రప్రభుత్వం అండ

ఇప్ప టివరకు అందిన సమాచారం మేరకు నేపాల్‌లో తెలంగాణ పౌరు లెవరికీ ఎలాంటి ఇబ్బందులు లేవని ప్రభుత్వం స్పష్టం చేసింది. విదేశీ వ్యవ హారాల మంత్రిత్వ శాఖ, కాఠ్‌మాం డూలోని భారత రాయబార కార్యాల యంతో రాష్ట్ర ప్రభుత్వం సమన్వయం చేసుకుంటూ ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటోంది. తెలంగాణ పౌరులు, వారి కుటుంబ సభ్యులు అధికారిక సమాచారాన్ని మాత్రమే నమ్మాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. తప్పుడు ప్రచారాన్ని పట్టించుకోవద్దని సూచించింది. నేపాల్‌లో ఎవరైనా తెలంగాణ వాసులు చిక్కుకుంటే వారి కుటుంబ సభ్యులు దిల్లీలోని తెలంగాణ భవన్ అధికారులను ఈ కింది నంబర్ల ద్వారా సంప్రదించవచ్చు. వందన, రెసిడెంట్ కమిషనర్ ప్రైవేట్ సెక్రెటరీ, లైజన్ హెడ్ 091 9871999044, జి.రక్షిత్ నాయక్, లైజన్ ఆఫీసర్ 091 9643723157, సీహెచ్ చక్రవర్తి, ప్రజా సంబంధాల అధికారి 091 994935127

## ప్రజాస్వామ్యం పట్ల మోడీ, అమిత్‌షాలకు గౌరవం లేదు ఖర్గే విమర్శలు

**గాంధీనగర్(జనంసాక్షి):** భారత రాజ్యాంగాన్ని గానీ, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలనే ఉద్దేశం మోడీ, అమిత్‌షాలకు లేదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాలపై ఖర్గే తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బుధవారం ఖర్గే గుజరాత్‌లోని జునాగఢ్‌కి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'ప్రతిపక్షాల ప్రధాన లక్ష్యం ప్రజాస్వామ్యం, రాజ్యాంగాన్ని కాపాడడటమే. ప్రజాస్వామ్యంలో పోరాడటం సర్వసాధారణమే. కానీ రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడడమే మా లక్ష్యం. మహాత్మాగాంధీ, సర్దార్‌వల్లభారుపటేల్ వంటి గొప్ప వ్యక్తులు జన్మించిన భూమి ఇది. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిపెట్టిన ఈ ఇద్దరు మనకు అత్యంత గౌరవనీయులు. వారివల్లే దేశం ఐక్యం ఉంది. కానీ మరో ఇద్దరు వ్యక్తులు మోడీ, అమిత్‌షా మాత్రం రాజ్యాంగం సురక్షితంగా ఉండాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కానీ కోరుకోవడం లేదు' అని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి ఎన్నిలపై ఆయన స్పందించారు. 'మాకు మెజారిటీ- లేదు. అయినప్పటికీ మాకు ఉన్నన్ని ఓట్లు- వచ్చాయి' అని ఖర్గే అన్నారు.

## 12న ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ పదవీ ప్రమాణం

**రాష్ట్రపతి భవన్‌లో ప్రమాణం చేయించనున్న ముర్ము**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఘన విజయం సాధించిన సీపీ రాధాకృష్ణన్ బాధ్యతలు చేపట్టేందుకు ముహూర్తం ఖరారు అయిందని తెలుస్తోంది. ఈనెల 12వ తేదీన సీపీ రాధాకృష్ణన్ 15వ భారత ఉపరాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఉపరాష్ట్రపతి చేత భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. అందుకోసం రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాట్లు- చురుగ్గా కొనసాగుతున్నాయి. భారత ఉపరాష్ట్రపతి పదవికి జగదీప్ దన్‌ఖడ్ రాజీనామా చేశారు. దీంతో ఉపరాష్ట్రపతి ఎన్నిక అనివార్యమైంది. ఆ క్రమంలో ఎన్డీయే భాగస్వామ్య పక్షాల అభ్యర్థిగా మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను రంగంలోకి దింపారు. అలాగే ప్రతిపక్ష ఇండి కూటమి అభ్యర్థిగా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి బి.సుదర్శన్ రెడ్డిని బరిలో దింపారు. సెప్టెంబర్ 9వ తేదీన జరిగిన ఈ ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ 148 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. రాధాకృష్ణన్‌కు 452 ఓట్లు- రాగా.. జస్టిస్ సుదర్శన్ రెడ్డికి 300 ఓట్లు- పోలయ్యాయి. ఇక బీఆర్ఎస్, బీజేడీ, ఎస్ఎల్‌డీలు ఈ ఎన్నికలకు దూరంగా ఉన్నాయి. మరోవైపు మహారాష్ట్ర గవర్నర్ పదవికి సీపీ రాధాకృష్ణన్ రాజీనామా చేయనున్నట్లు- తెలుస్తోంది.

# మేడారం మాస్టర్ ప్లాన్ ఇంకా ఫైనలైజ్ కాలేదు

**మంత్రి సీతక్క**



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఆదివాసీ ఆత్మగౌరవానికి ప్రతీకగా, సమక్క-సారలమ్మ తల్లుల త్యాగాల స్ఫూర్తిని ప్రతిబింబించే మేడారం మాస్టర్ ప్లాన్ డీపీఆర్ ఇంకా తుది రూపం దాల్చలేదని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా-శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క స్పష్టం చేశారు. దీనిపై అనవరసర రాద్ధాంతం చేయడం తగదని హెచ్చరించారు. ఆదివాసీ సంస్కృతి, సమ్మక్క సారాలమ్మ పూజారుల విశ్వాసాలు, లక్షలాది భక్తుల మనోభావాలను పరిగణనలోకి తీసుకుని మాత్రమే డీపీఆర్‌ను ఫైనల్ చేస్తామని ఆమె స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి మేడారం పర్యటన అనంతరం మాస్టర్ ప్లాన్‌పై తుది నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. సమక్క-సారలమ్మల త్యాగాలు, ఆదివాసీల అచంచలమైన తెగువ, వారి పోరాట స్ఫూర్తి ప్రతిఫలించేలా మేడారం మాస్టర్ ప్లాన్ రూపుదిద్దుకుంటుందని తెలిపారు. ఈ ప్రక్రియలో సమ్మక్క సారలమ్మ తల్లుల పూజారుల సూచనలు, రోజురోజుకూ పెరుగుతున్న భక్తుల రద్దీని మాత్రమే పరిగణనలోకి తీసుకుంటామని, ఎట్టి పరిస్థితుల్లోనూ బయటివారి ప్రమేయం ఉండదని ఆమె స్పష్టం చేశారు. ఆదివాసీల సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలకు ఎలాంటి భంగం కలగకుండా, వారి సంప్రదింపులు, మార్గదర్శకాల ఆధారంగానే మాస్టర్ ప్లాన్‌ను ఆమోదిస్తామని సీతక్క స్పష్టం చేశారు. మేడారం మాస్టర్ ప్లాన్ కు రాజకీయాలు ఆపాదించడం సరి కాదన్నారు మంత్రి సీతక్క. మేడారం మాస్టర్ ప్లాన్ పూర్తిగా ఆదివాసీల విశ్వాసం, సంప్రదాయం, భక్తి భావం ఆధారంగా ముందుకు సాగుతుందని, రాజకీయ లబ్ధి కోసం దానిని ఉపయోగించుకోవడం తగదని సూచించారు.

# ప్రతి పేదకు ఇందిరమ్మ ఇల్లు అందిస్తా

- విడతలవారీగా అర్హులందరికీ ఇండ్లు ఇస్తాం..
- రాష్ట్ర మంత్రి కొండా సురేఖ హామీ
- వరంగల్ ఈస్ట్ లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్లు సాంక్షన్ పత్రాలు అందజేత



**వరంగల్ ప్రతినిధి, సెప్టెంబర్ 10(జనంసాక్షి):** ప్రతి పేద ఇంటికి... ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని... విడతలవారీగా అర్హులందరికీ ఇండ్లు ఇస్తామని రాష్ట్ర మంత్రి కొండా సురేఖ హామీనిచ్చారు. బుధవారం వరంగల్ పర్యటనలో ఉన్న మంత్రి సురేఖ వరంగల్ ఈస్ట్ లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్లు సాంక్షన్ పత్రాలు అందజేశారు. అనంతరం రాష్ట్ర మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్న లబ్ధిదారుడికి ఐదు లక్షలు రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తుందని వివరించారు. గత ఎన్నికలకు ముందు ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీలతో పాటు నూతన హామీలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. పేదవారి ఆశయాన్ని నెరవేర్చడం కోసం రాష్ట్రం ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను చేపడుతుందన్నారు. ఎన్నికల ముందు నియోజకవర్గ అభివృద్ధి కోసం ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా నెరవేరుస్తామని మంత్రి సురేఖ తెలిపారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో అత్యంత నిరుపేద అర్హులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరయ్యేలా ప్రభుత్వం పారదర్శకంగా పోర్టల్ ద్వారా మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. మంజూరి పత్రాలు స్వీకరించిన లబ్ధిదారులు త్వరగా ఇళ్ళను నిర్మించుకోవాలని కోరారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ. 500 రూపాయలకే సబ్సిడీపై గ్యాస్ సిలిండర్, 200 యూనిట్స్ వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో పేదల సమస్యలు మానవత దృక్పథంతో అధికారులు పరిశీలించి త్వరితంగా పరిష్కరించాలన్నారు. నిరుపేదలు గుడిసెలలో, అద్దెకు ఉంటూ సుదీర్ఘ కాలంగా ఇండ్ల నిర్మాణాలకు వేచి చూస్తున్నారన్నారు. అటువంటి పేద వారి కలలను రాష్ట్ర ప్రభుత్వం నిజం చేస్తున్నదని అన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన మాటకు కట్టుబడి మహిళల కోసం అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు తీసుకువచ్చారని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కార్యక్రమం నిరంతరమని, ఇల్లు రాని నిరుపేదలు నిరుత్సాహపడవలసిన అవసరం లేదని, అర్హులైన ప్రతినిరుపేదకు తప్పనిసరిగా ఇల్లు మంజూరు చేస్తామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో అభివృద్ధి, సంక్షేమం జోడొద్దుల్లా ముందుకు తీసుకెళుతున్నారని మంత్రి సురేఖ తెలిపారు.

## ఆసుపత్రి, మెడికల్ కాలేజ్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల ప్రతినిధి సెప్టెంబర్ 10 (జనంసాక్షి) :** ప్రభుత్వం జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో చేపట్టిన ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం, హాజీపూర్ మండలం గుడిపేట లో చేపట్టిన ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణ పనులను మరింత వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం మంచిర్యాల పట్టణంలోని కాలేజ్ రోడ్డులో గల ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణ పనులు, హాజీపూర్ మండలం గుడిపేటలో నిర్మితమవుతున్న ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రజలకు మరింత వేగవంతమైన వైద్య సేవలను అందించేందుకు జిల్లా కేంద్రంలో ప్రభుత్వాసుపత్రి నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం ఆధునిక వైద్య పరికరాలు ఏర్పాటు చేసి జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం కోసం ఆసుపత్రి నిర్మాణం చేపట్టడం జరిగిందని తెలిపారు. వైద్యులు, సిబ్బంది సంఖ్యను పెంపొందించేందుకు ప్రభుత్వ ఆసుపత్రి, ప్రభుత్వ వైద్య కళాశాలను ఏర్పాటు చేసేందుకు 216 కోట్ల రూపాయల నిధులతో నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రోడ్డు భవనాల శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అనూష, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వివాదాలకు నిలయంగా టీజీపీఎస్సీ

- నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్న రాష్ట్ర ప్రభుత్వం
- ఎస్ఎఫ్ఐ డివైఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీలు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** గ్రూప్ వన్ పరీక్షల అవకతవకలపై రాష్ట్ర ప్రభుత్వం విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని, వివాదాలకు నిలయంగా ఉన్న టీజీపీఎస్సీని ప్రక్షాళన చేయాలని ఎస్ఎఫ్ఐ డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్. రజనీకాంత్,టీ. నాగరాజు, కోట రమేష్, ఆనగంటి వెంకటేష్‌లు అన్నారు. భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ)భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) తెలంగాణ రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో సుందరయ్య పార్క్ వద్ద నిరసన ర్యాలీ చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రూప్ వన్ పరీక్ష గతంలోనే టీజీపీఎస్సీ చేసిన తప్పిదాల వల్ల రెండుసార్లు ప్రిలిమ్స్ రద్దు కావడం జరిగిందన్నారు . మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వంలో టీజీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్ 1 మెయిన్స్ పరీక్ష హాల్ టికెట్ల దగ్గర నుండి పరీక్ష పూర్తయి మూల్యాంకనం వరకు వరుస వివాదాలతో టీజీపీఎస్సీ కేంద్ర బిందువు అయిందన్నారు. నిరుద్యోగ యువత లక్షలాది రూపాయలు కోచింగ్ సెంటర్లలో వేచించి ప్రిపేర్ అయ్యి పరీక్షలకు హాజరవుతుంటే పారదర్శకంగా నియమాకాలు చేపట్టాల్సిన టిజిపిఎస్సి దానికి బదులు వివాదాలకు సృష్టించే విధంగా వ్యవహరిస్తూ రాష్ట్రంలోని నిరుద్యోగులు జీవితాలతో చెలగాటమాడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గత ప్రభుత్వం చేసిన తప్పులు చేయకుండా టీజీపీఎస్సీని యుపిఎస్సి తరహాలో తీర్చిదిద్దుతామని చెప్పి ప్రగల్బాలు పలికి వరుస తప్పిదాలతో పారదర్శకంగా నియమాకాలు చేపట్టకుండా లక్షలాదిమంది నిరుద్యోగ యువత ను మోసం చేస్తుందన్నారు. పరీక్ష నిర్వహించినప్పటి నుండి అనేకమైన అనుమానాలకు తావిచ్చిన టీజీపీఎస్సీపై రాష్ట్ర ప్రభుత్వం సమీక్ష నిర్వహించలేదు. పరీక్ష పత్రాలని నిపుణులైన ప్రొఫెసర్లతో మూల్యాంకనం చేయించాలని, తెలుగు మీడియం పేపర్లను తెలుగు మీడియం వారితోనే చేయించాలని ఇంగ్లీష్ మీడియం పేపర్లను ఇంగ్లీష్ మీడియం సంబంధించిన నిపుణులతో మూల్యాంకనం చేయించాలని నిబంధనలు ఉన్న నిబంధనలను పాతరేస్తూ టీజీపీఎస్సీ వ్యవహరించిందన్నారు. గ్రూప్ వన్ పరీక్షల్లో అవకతవకలపై ప్రభుత్వం విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని, సబ్జెక్టు నిపుణులతోనే జవాబు పత్రాల మూల్యాంకనం చేపట్టాలని గ్రూప్ వన్ పోస్టుల భర్తీకి అడ్డంకులు లేకుండా పారదర్శకంగా నియామకాలు చేపట్టే విధంగా మళ్లీ పరీక్షను నిర్వహించాలని, టీజీపీఎస్సీని ప్రక్షాళన చేసి టీజీపీఎస్సీలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని రాష్ట్రంలో అత్యున్నత స్థాయి కమిషన్ గా ఉన్న టీజీపీఎస్సీ పై నమ్మకం ఉండే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు న్యాయం జరిగేంతవరకు పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివైఎఫ్ఐ రాష్ట్ర నాయకులు డి కిరణ్ కే.అశోక్ రెడ్డి, ఎండి జావీద్, శంకర్,మమత ప్రశాంత్, శంకర్, రమేష్,రాజయ్య,విజయ్ కుమార్ లెనిన్ స్టాలిన్ శ్రీకాంత్,రంజిత్, సహన,నాగేందర్, రమ్య తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నేతలపై ఎన్నికల సంఘం తప్పుడు ఆరోపణలు

**కాంగ్రెస్ పార్టీ సీనియర్ లీడర్ అభిషేక్ సింగ్వీ**



**న్యూఢిల్లీ (జనంసాక్షి) :** ఎన్నికల సంఘం కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు పవన్ ఖేరా, తెలంగాణ కాంగ్రెస్ నేత డాక్టర్ కోట నీలిమపై తప్పుడు ఆరోపణలు చేసి బహిరంగ నోటీసులు జారీ చేయడాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండించింది. 2017లోనే వీరు ఓటరు ఐడీ షిఫ్టింగ్ కోసం ఫారమ్-6 సమర్పించినప్పటికీ, ఎన్నికల సంఘం ప్రాసెస్ చేయకపోవడం వల్లే ఈ సమస్య తలెత్తిందని పార్టీ స్పష్టం చేసింది. తాము అన్ని నిబంధనలు పాటించినప్పటికీ, తప్పుడు ఆరోపణలు చేసి నాయకుల ప్రతిష్టను దెబ్బతీయాలని ప్రయత్నించిందని కాంగ్రెస్ ఆక్షేపించింది. ఢిల్లీలో జరిగిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో సీనియర్ సుప్రీంకోర్టు న్యాయవాది డాక్టర్ అభిషేక్ మను సింఘ్వీ మాట్లాడుతూ "పవన్ ఖేరా, డాక్టర్ కోట నీలిమలకు నోటీసులు జారీ చేసే విధానం, వ్యక్తిగత వివరాలను బహిర్గతం చేయడం పూర్తిగా చట్ట విరుద్ధం. కనీస జాగ్రత్తలు తీసుకొని.. ఎన్నికల కమిషన్ తన విధులు తను నిర్వర్తించి ఉంటే ఈ పరిస్థితి రాకపోయేది" అన్నారు.

# రాష్ట్రానికి సరిపడా యూరియా అందించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలం

- యూరియా కొరతపై కేంద్ర మంత్రులు నిర్లక్ష్యం చేయడం శోచనీయం
- తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి ధ్వజం



**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రానికి సరిపడా యూరియాను సకాలంలో అందించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. రాష్ట్ర వ్యాప్తంగా యూరియా కొరత వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతూ ఆందోళనలు చేస్తున్న ప్రస్తుత కష్టకాలంలో రైతులకు భరోసా ఇస్తూ బాధ్యత వహించాల్సిన రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు జి.కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్ లు తమకేం పట్టదనట్లుగా మౌనంగా ఉంటూ నిమ్మకు నీరెత్తినట్లుగా ఉంటూ నిర్లక్ష్యం చేయడం శోచనీయమన్నారు. వ్యవసాయ అవసరాలకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి సరిపడా యూరియాను సకాలంలో సరఫరా చేయకపోవడంతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. తెలంగాణకు యూరియా సరఫరాపై కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందనీ, తెలంగాణకు రావాల్సిన యూరియా వాటాను కేంద్రం తక్షణమే విడుదల చేయాలని శేర్ నర్సారెడ్డి డిమాండ్ చేశారు. వ్యవసాయ పంటలకు సరైన సమయంలో యూరియా వేయకపోతే పంటల దిగుబడి తగ్గి ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు దెబ్బతినే ప్రమాదం ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల వ్యవసాయ పంటల అవసరాలను దృష్టిలో ఉంచుకొని తక్షణమే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావులు వెంటనే కేంద్ర ప్రభుత్వంపై మరింతగా ఒత్తిడిని పెంచి రాష్ట్రంలో యూరియా కొరత లేకుండా తగు చర్యలు తీసుకొని రైతాంగాన్ని ఆదుకోవాలని తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి విజ్ఞప్తి చేశారు.

# ఇళ్ల స్థలాల కొనుగోలుకు అనుమతులిప్పించండి

- మంత్రి తుమ్మలకు వినతి



**హైదరాబాద్, సెప్టెంబర్ 10 (జనంసాక్షి) :** జర్నలిస్టుల ఇళ్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ది జర్నలిస్టు కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ పాలకవర్గం - వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావుకు వినతి పత్రం అందించింది. సొసైటీ అధ్యక్షుడు బ్రహ్మాండభేరి గోపరాజు నాయకత్వంలో ఉపాధ్యక్షుడు ఎం. లక్ష్మి నారాయణ, ప్రధాన కార్యదర్శి రవీంద్ర బాబు, కోశాధికారి భీమగాని మహేశ్వర్ గౌడ్, డైరెక్టర్ కమలాకరా చార్య బుధవారం వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలసి జర్నలిస్టుల ఇండ్ల స్థలాలు - తాజా సుప్రింకోర్టు తీర్పు- ప్రస్తుత పరిస్థితులను విన్నవించారు. 1964 ఏర్పడిన జేసీహెచ్ఎస్ఎల్ ఇప్పటివరకూ మూడు కాలనీలను ఏర్పాటు చేసుకొని వందలామంది జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు అందించిందని, మరో కాలనీ ఏర్పాటు కోసం 30 ఏళ్లుగా జర్నలిస్టులు ఎదురుచూస్తున్నారని మంత్రికి వివరించారు. అయితే ది జర్నలిస్టు కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలో ఉన్న వెయ్యి మంది నాన్ అలాటిస్ జర్నలిస్టులకు ఇళ్ల నిర్మాణం కోసం స్థలం కొనుగోలు చెయ్యడానికి జనరల్ బాడీ సమావేశంలో తీర్మానం చేశామని చెప్పారు. ప్రస్తుతం కొంత సొసైటీ నిధులు, సభ్యుల నుంచి కూడా కొంత నిధులు సేకరించి స్థలం కోనుగోలు చేయాలన్న జనరల్ బాడీ తీర్మానించిన విషయాన్ని మంత్రి దృష్టికి అధ్యక్షుడు గోపరాజు తీసుకువచ్చారు. ఈ మేరకు సొసైటీ అధికారులకు దరఖాస్తు కూడా పెట్టుకున్నామన్నారు. వెయ్యిమంది నాన్ అలాటిస్ కోసం స్థలం కొనుగోలు చేసేందుకు సంబంధిత అధికారుల నుంచి అనుమతి ఇప్పించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. హౌసింగ్ సొసైటీ లో ఉన్న వెయ్యి మంది జర్నలిస్టులకు న్యాయం చెయ్యాలని కోరారు. హౌసింగ్ సొసైటీలకు, జర్నలిస్టులకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందని, స్థలం కొనుగోలుకు సంబంధించి ఆధికారులకు ఆదేశాలు జారీ చేస్తానని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మరోవైపు గోపనపల్లి, జూబిలీహిల్స్ లో ఉన్న జర్నలిస్టు కాలనీల్లో సొసైటీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి కూడా మంత్రికి వివరించారు. గోపనపల్లి జర్నలిస్టు కాలని ఫేజ్ త్రీ లో మంచినీటి, డ్రైనేజి కొత్త వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు ఇటీవల మేనేజింగ్ కమిటీలో తీర్మానం చేసిన విషయాన్ని కూడా మంత్రి దృష్టికి తీసుకుని వెళ్ళారు. కో ఆపరేటివ్ నియమ నిబంధనల ప్రకారమే సొసైటీ పాలకమండలి ముందుకువెళ్తోందని మేనేజింగ్ కమిటీ తెలిపింది.

# చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి మరువలేం

- నివాళి అర్పించిన బిఆర్ఎస్ నేత కెటిఆర్



**హైదరాబాద్, సెప్టెంబర్ 10 (జనంసాక్షి) :** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో కీలక పాత్ర పోషించిన చాకలి ఐలమ్మ తెలంగాణ పోరాట స్ఫూర్తికి నిదర్శనమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కొనియాడారు. తొలి భూ పోరాటానికి నాంది పలికిన విప్లవ నిప్పుకణిక ఐలమ్మ, భూమి కోసం, భుక్తి కోసం తిరుగుబాటు- చేసి ప్రజా వ్యతిరేక పాలనపై దండెత్తిందని గుర్తుచేశారు. చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమెను కేటీ-ఆర్ స్మరించుకున్నారు. చాకలి ఐలమ్మ పోరాటాలను, త్యాగాలను భావితరాలకు అందించాలనే ఉద్దేశంతోనే కేసీఆర్ ప్రభుత్వం చాకలి ఐలమ్మ జయంతిని ప్రతి సంవత్సరం అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించిందని కేటీ-ఆర్ తెలిపారు. బహుజన చైతన్యానికి, మహిళా ధీరత్వానికి ప్రతీకగా నిలిచిన చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించారు. వీరనారి చాకలి ఐలమ్మకు జోహార్లు తెలిపారు.

# అర్ధరాత్రి నుంచే క్యూ లైన్లు

- మిరుదొడ్డలో ఆందోళనకు దిగిన రైతులు



**సిద్దిపేట, సెప్టెంబర్ 10 (జనంసాక్షి) :** యూరియా కష్టాలు తప్పడం లేదు. రైతులు నానా అగచాట్లు పడుతున్నారు. క్యూలో నిల్చోవడానికి రాత్రిళ్లు జాగారం చేస్తున్నారు. సిద్దిపేట జిల్లాలోని మిరుదొడ్డి రైతువేదిక ఎదుట యూరియా కోసం మంగళవారం అర్ధరాత్రి నుంచే రైతులు బారులు తీరారు. బుధవారం ఉదయం టోకెన్ల కోసం వరుసకట్టిన నేపథ్యంలో వారి మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. అసహనానికి గురైన రైతులు వేదికలోకి చొరబడి సామగ్రిని ధ్వంసం చేశారు. కేవలం 1120 యూరియా బస్తాలు మాత్రమే అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ అధికారులు తెలిపారు. అన్నదాతలు మాత్రం వేల సంఖ్యలో బారులు తీరారు. ఘర్షణ వాతావరణం ఏర్పడటంతో దుబ్బాక సీఐ శ్రీనివాస్, ఎస్సై కీర్తి కుమార్, మిరుదొడ్డి ఎస్సై సమతలు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. పోలీసుల సమక్షంలో భారీ బందోబస్తు మధ్య యూరియాను రైతులకు పంపిణీ చేశారు. 3 వేల మంది టోకెన్లు దొరకక నిరాశతో వెనుతిరిగారు. మెదక్ జిల్లా శివ్వంపేట సహకార సంఘం వద్ద రైతులు యూరియా కోసం మంగళవారం రాత్రి అక్కడే పడుకొని వేచిచూశారు. బుధవారం ఉదయం టోకెన్ల కోసం బారులు తీరారు. సూర్యాపేట జిల్లాలోని నూతనకల్‌లో యూరియా కోసం రాత్రి నుంచి క్యూలో నిరీక్షించారు.

## పేట్‌బషీరాబాద్‌లో గొలుసు దొంగలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 10 (జనంసాక్షి) :** పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు చోట్ల చైన్ స్నాచింగ్ జరిగింది. బైక్ పై వచ్చిన ఇద్దరు దుండగులు కెవి రెడ్డి నగర్ లో వాకింగ్ చేస్తున్న బాలమణి మేడలో నుంచి ఐదు తులాల చైన్ లాక్కొని పారిపోయారు. మరో ఘటనలో ఎన్ సి ఎల్ కాలనీలో బస్సు కోసం బస్ స్టాప్ లో వేచి ఉన్న ఓ యువతీ మెడలో చైన్ స్నాచింగ్ కు యత్నించారు. గొలుసు తెగిపోవడంతో అక్కడి నుంచి స్నాచర్ పారిపోయాడు. గంట వ్యవధిలో ఒకే పోలీస్ స్టేషన్ పరిధిలో స్నాచర్లు హల్ చల్ చేయడంతో పోలీసులు అలెర్టయ్యారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# మారుతున్న ప్రపంచంలో భారత్!?




21వ శతాబ్దంలో ప్రపంచ వ్యవస్థ భూకంపిక మార్పులకు గురవుతోంది. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత ఏర్పడిన లిబరల్ ఆర్డర్ క్షీణిస్తుండగా, మల్టిపోలార్ వరల్డ్ ఆవిర్భవిస్తోంది. చైనా ఉదయం, అమెరికా ఆధిపత్య బలహీనత, రష్యా లాంటి శక్తుల పునరుద్ధరణ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) అలాగే క్లైమేట్ చేంజ్ వంటి సమస్యలు ఈ మార్పులకు కారణాలు. ఈ నేపథ్యంలో భారతదేశం తన స్థానాన్ని పటిష్ఠం చేసుకోవడానికి ప్రయత్నిస్తోంది. ప్రస్తుతం భారత దేశం ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక శక్తి. కానీ, భవిష్యత్తులో దాని పాత్రను అంచనా వేసి చూస్తే, అవకాశాలతో పాటు అనేక సవాళ్ళు కూడా ఎదురవుతాయి. ఈ వ్యాసం భారత్ యొక్క ప్రస్తుత స్థితి నుండి భవిష్యత్ పాత్రను వివిధ రంగాల్లో, విమర్శనాత్మక దృక్పథంతో విశ్లేషణచేస్తుంది. ప్రపంచ వ్యవస్థలో భారత్ ప్రస్తుత స్థితి ఆశాజనకంగా ఉంది. 2025 నాటికి భారత్ జీడీపీ సుమారు 3.91 ట్రిలియన్ డాలర్లు, ప్రపంచంలో ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉంది. డెమోగ్రాఫిక్ డివిడెండ్, యువ జనాభా (65 శాతం మంది 35 ఏళ్ల లోపు వారు.) డిజిటల్ రెవల్యూషన్ (యూపీఐ, ఆధార్) దీనికి బలం. డిప్లమాటిక్‌గా, భారత్ (ఆస్ట్రేలియా, జపాన్, యూఎస్‌తో కలిసి ) క్వాడ్ ఇండో-పసిఫిక్ రీజియన్‌లో కీలక పాత్ర పోషిస్తోంది. జీ-20 సమ్మిట్ హోస్టింగ్ అలాగే ఆఫ్రికన్ యూనియన్‌ను జీ-20లో చేర్చడం ద్వారా గ్లోబల్ సౌత్ లీడర్‌గా ఎదుగుతోంది. మిలిటరీగా, భారత్ ప్రపంచంలోనే నాలుగవ అతిపెద్ద సైన్యం కలిగి ఉంది. డిఫెన్స్ రంగంలో ఎక్స్‌పోర్ట్స్ పెరుగుతున్నాయి.

భవిష్యత్తులో ఆర్థిక రంగంలో భారత్ పాత్ర అసాధారణంగా ఉండనుంది. పీడబ్ల్యూసీ ప్రొజెక్షన్స్ ప్రకారం, 2050 నాటికి భారత్ ప్రపంచంలో రెండవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతుంది. చైనా తర్వాత. 2030 నాటికి 6 ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్లు లక్ష్యంగా పెట్టుకుంది. ఇది సాధ్యమవుతుంది కూడా. ఎందుకంటే భారత్ జీడీపీ గ్రోత్ రేట్ 6-8 శాతం మధ్య ఉంటుందని ఐఎంఎఫ్ అంచనా వేసింది. మన్యుఫాక్చరింగ్ సెక్టర్‌లో (పీఎల్ఐ) స్కీమ్ ద్వారా స్మార్ట్‌ఫోన్స్, సెమికండక్టర్స్ ఎక్స్‌పోర్ట్ పెరుగుతోంది. ఫిన్‌టెక్ రెవల్యూషన్ మరియు మిడిల్ క్లాస్ విస్తరణ (2030 నాటికి 75 మిలియన్ మిడిల్-ఇన్‌కమ్ హౌస్‌హోల్డ్స్) ఆర్థిక వృద్ధికి ఊతమిస్తాయి. అయితే, ఇది విమర్శనాత్మకంగా పరిశీలించి చూస్తే, భారత్ ఇంకా లోయర్ మిడిల్ ఇన్‌కమ్ కంట్రీగా ఉంది. అసమానతలు (జినీ కోఎఫీషియంట్ పెరుగుతోంది) ఇవి సవాలుగా మారాయి. జాబ్ క్రియేషన్ లో 90 మిలియన్ జాబ్స్ అవసరం 2030 నాటికి ఉంటుంది. కానీ అన్‌ఎంప్లాయ్ మెంట్ రేట్ 7-8 శాతం మధ్యన ఉంది.

టెక్నాలజీ, స్పేస్ రంగాల్లో భారత్ భవిష్యత్ పాత్ర ఆశావహంగా ఉంది. 2025లో సాటిలైట్ డాకింగ్ సక్సెస్ ద్వారా భారత్ స్పేస్ టెక్నాలజీలో నాలుగవ దేశంగా మారింది. చంద్రయాన్-3 వంటి మిషన్లు, ఇస్రో యొక్క లో-కాస్ట్ మోడల్ ప్రపంచానికి ఆకర్షణీయంగా ఉంది. (ఏఐ)లో భారత్ పెట్టుబడులు పెద్ద ఎత్తున పెరుగుతున్నాయి. 2025లో డిఫెన్స్ మోడర్నైజేషన్ ప్లాన్ ఏఐ, హైపర్‌సానిక్ టెక్నాలజీలపై ఫోకస్ చేసింది. స్టార్టప్స్ (ఐ.డీ.ఈ.ఎక్స్.) ద్వారా డిఫెన్స్ ఇన్నోవేషన్స్ పెరుగుతున్నాయి. భవిష్యత్తులో భారత్ ఏఐ కోపైలట్స్, ఫ్యూజన్ ఎనర్జీ, బ్రెయిన్-కంప్యూటర్ ఇంటర్‌ఫేసెస్‌లో లీడ్ చేయవచ్చు. కానీ విమర్శనాత్మకంగా చూస్తే రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ (ఆర్ అండ్ డీ )ఇన్వెస్ట్‌మెంట్ మాత్రం 0.7 శాతం జీడీపీ, చైనా 2.5 శాతంతో పోలిస్తే తక్కువ. టాలెంట్ మైగ్రేషన్ (బ్రెయిన్ డ్రెయిన్) మరియు సైబర్ సెక్యూరిటీ రిస్కులు సవాళ్లు ఎక్కువగా . కనిపిస్తున్నాయి.

డిఫెన్స్ మరియు స్ట్రాటెజిక్ రంగాల్లో భారత్ భవిష్యత్ పాత్ర మల్టిపోలార్ వరల్డ్‌లో బ్యాలెన్సర్‌గా ఉండనుంది. ఆ సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. 15-ఇయర్ డిఫెన్స్ ప్లాన్ న్యూక్లియర్ ప్రొపల్షన్, నెక్స్ట్-జెన్ వార్‌ఫేర్‌పై దృష్టి సారించింది. ఇండియన్ ఓషన్ రీజియన్‌లో భారత్ రీజినల్ మల్టిలాటరలిజం బిల్డ్ చేస్తోంది. కానీ చైనా బార్డర్ టెన్షన్స్ (ఎల్ఏసీ మిలిటరైజేషన్) దానితో పాటు పాకిస్తాన్ ఇష్యూస్ సవాళ్లు ఎదురవుతున్నాయి. ఫారిన్ పాలసీలో స్ట్రాటెజిక్ ఆటానమీ కీలకం. 2025లో యూఎస్ టారిఫ్స్ టెన్షన్స్ మధ్య చైనా-రష్యాతో రీబ్యాలెన్సింగ్ జరుగుతోంది. (ఎస్.సీ.ఓ.) సమ్మిట్‌లో మోడీ-జీ-పుతిన్ మీటింగ్స్ ఇందుకు ఉదాహరణ. అయితే, ఇది విమర్శనీయం ఎందుకంటే యూ.ఎస్. తో అలయన్స్ స్ట్రెంగ్త్ తగ్గవచ్చు. చైనాతో రాప్రోచ్‌మెంట్ లిమిటెడ్. రష్యా ఆయుధాలపై డిపెండెన్సీ (70 శాతం) యుక్రెయిన్ వార్ మధ్య రిస్కీ ఉంటుంది.

క్లైమేట్ మరియు సస్టైనబుల్ డెవలప్‌మెంట్ రంగాల్లో భారత్ పాత్ర గ్లోబల్ లీడర్‌గా ఎదగాలి. పారిస్ అగ్రిమెంట్ కమిట్‌మెంట్, రెన్యూవబుల్ ఎనర్జీ (సోలార్ అలయన్స్)లో అభివృద్ధి కనపడుతుంది. భవిష్యత్తులో భారత్ క్లైమేట్ ఫైనాన్స్‌లో డిమాండ్ చేస్తుంది. కానీ, విమర్శ ఏమిటంటే భారత్ ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఎమిషన్స్ ఎమిటర్, మరియు పొల్యూషన్ (ఢిల్లీ ఎయిర్ క్వాలిటీ) సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉంది. విమెన్ పార్టిసిపేషన్ లో ల్యాగ్ (లేబర్ ఫోర్స్‌లో 25 శాతం మాత్రమే ఉంది) సూపర్ పవర్ అంబిషన్స్‌కు ఇది అడ్డంకిగా మారింది.

మొత్తంగా చూస్తే, భారత్ సూపర్ పవర్‌గా మారడానికి అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. కానీ, కొన్ని సవాళ్లు ఎదురవుతున్నాయి. బ్యూరోక్రసీ, కరప్షన్, ఎడ్యుకేషన్ రీఫార్మ్స్ చాలా అవసరం. రెడ్ టేపిజం మరియు లంచాలు వల్ల ప్రాజెక్టులు డిలే అవుతున్నాయి. ఎన్విరాన్‌మెంటల్ డ్యామేజ్ మరియు రిచ్-పూర్ గ్యాప్ సోషల్ స్టెబిలిటీని దెబ్బతీస్తాయి. జియోపాలిటికల్ టెన్షన్స్ (చైనా బార్డర్) మరియు ఇంటర్నల్ ఇష్యూస్ (కాశ్మీర్, ఫార్మర్ ప్రొటెస్ట్స్) సవాళ్లు. భారత్ తన సాంస్కృతిక వారసత్వాన్ని (సహనశీలత) ఉపయోగించి, ప్రాగ్మాటిక్ స్ట్రాటెజీలతో ముందుకు సాగాలి. ఇది సాధ్యమైతే, 21వ శతాబ్దంలో భారత్ గ్లోబల్ ఆర్డర్‌లో కీలక ఆర్కిటెక్ట్‌గా మారుతుంది, కానీ నిర్లక్ష్యం చేస్తే, మిడిల్ పవర్‌గానే మిగిలిపోతుంది.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.




# ఎందుకింత వివక్ష?

మన దేశ రాజ్యాంగం పౌరులందరికి సమాన హక్కులు కల్పించినప్పటికీ, కుల ఆధారిత వివక్ష ఇంకా కొన్ని ప్రాంతాల్లో తగ్గకపోవడం విచారకరం. తరాలు మారుతున్నాయి, విద్యా స్థాయి పెరుగుతోంది, సాంకేతికత అభివృద్ధి చెందుతోంది. అయినప్పటికీ, మనసుల్లోని కుల భావజాలం మాత్రం మారడం లేదు. ఇటీవల ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలంలోని చిన్న బెండారంలో చోటుచేసుకున్న సంఘటన ఈ వాస్తవాన్ని మరోసారి బహిర్గతం చేసింది. అక్కడ ఒక అంగన్వాడీ టీచర్ బదిలీపై చేరుకున్నాక, ఆమె దళితురాలు అనే కారణంతో కొంతమంది తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్వాడీకి పంపడం మానేశారు. ఇది కేవలం ఒక ఉద్యోగిని అవమానపరచడమే కాకుండా, చిన్నారుల విద్యా హక్కును కూడా హరించడమే.

రాజ్యాంగం ఈ తరహా అన్యాయాన్ని స్పష్టంగా నిషేధించింది. ఆర్టికల్ 14 సమానత్వాన్ని హామీ ఇస్తుంది. ఆర్టికల్ 17 అస్పృశ్యతను నిషేధిస్తుంది. ఆర్టికల్ 21A పిల్లలందరికీ ఉచిత, తప్పనిసరి విద్యను హామీ ఇస్తుంది. కానీ ఈ విలువలు గ్రామీణ స్థాయిలో ఇంకా పూర్తిగా ఆచరణలోకి రాలేదు. దళితులు, ఆదివాసీలపై అన్యాయం జరగకుండా కాపాడటానికి SC/ST (Prevention of Atrocities) Act, 1989 అమల్లోకి వచ్చింది. ఈ చట్టంలోని Section 3(1)(s) ప్రకారం కులపరంగా అవమానిస్తే శిక్ష తప్పదు. Section 3(1)(za)(D) ప్రకారం, విద్యాసంస్థలు లేదా సామాజిక కార్యక్రమాల్లో ప్రవేశం అడ్డుకోవడమూ నేరమే. శిక్షలు కూడా కఠినంగా ఉన్నాయి – ఆరు నెలల నుంచి ఐదేళ్ల వరకు జైలు శిక్ష, జరిమానా. కానీ సమస్య ఏమిటంటే, ఈ చట్టం ఉన్నా కూడా అమలు సరిగా జరగడం లేదు. బాధితులు న్యాయం కోసం దీర్ఘకాలం పోరాడాల్సిన పరిస్థితి వస్తోంది. సమాజం ఇంతవరకు ఎందుకు మారలేకపోయిందో మనం ఆలోచించాలి. కుల వ్యవస్థ అనే విష వృక్షం శతాబ్దాలుగా మన సామాజిక నిర్మాణంలో బలంగా వేర్లను పరుచుకొని ఉంది. దీనివల్ల కొందరు ఉన్నత స్థితికి చేరుకోగా, మరికొందరు అణగారిపోయారు. రాజ్యాంగం స్పష్టంగా కుల వివక్షను నిషేధించినప్పటికీ, మతపరమైన అహంకారం, సామాజిక మూఢ నమ్మకాలు ఇంకా కొందరిలో మార్పు రానీయకుండా అడ్డుపడుతున్నాయి.

అంగన్వాడీ టీచర్ పరిస్థితి దీనికి ఒక ఉదాహరణ. ఒక మహిళ, తన కృషితో పిల్లలకు విద్య అందించాలనుకుంటోంది. కానీ ఆమె కులం కారణంగా ఐదేళ్లుగా ఆ గ్రామంలోని చాలా మంది తల్లిదండ్రులు పిల్లలను పంపడంలేదని ఆమె చెబుతున్నారు. దీనివల్ల ఆ టీచర్ మనస్తాపం చెందడమే కాకుండా, చిన్నారులు విద్య అనే ప్రాథమిక హక్కు కోల్పోతున్నారు. వివక్ష ఎవరికి మేలు చేయదు. సమాజంలోని ఏ వర్గాన్ని దూరంగా పెట్టిన మొత్తం సమాజం అభివృద్ధి చెందదు. సమానత్వం, సోదరభావం, న్యాయం అనే విలువలు కేవలం పుస్తకాల్లోనే మిగిలిపోతాయి. గ్రామీణ స్థాయిలో ఇటువంటి సంఘటనలు ఎక్కువగా చోటుచేసుకోవడం మన దేశ అభివృద్ధికి పెద్ద అడ్డంకి.

మరి పరిష్కారం ఏమిటి? మొదటగా భారత రాజ్యాంగంపై ప్రజలకు అవగాహన అవసరం. పిల్లలకే చిన్న వయసులో సమానత్వం, సోదరత్వం విలువలు నేర్పాలి. విద్య ద్వారా మాత్రమే మనస్తత్వంలో మార్పు వస్తుంది. ప్రభుత్వ అధికారులు ఇటువంటి సంఘటనలకు వ్యతిరేకంగా కఠిన చర్యలు తీసుకుని, బాధితురాలికి న్యాయం చేయాలి. గ్రామస్థాయి నాయకులు, సంఘాలు ముందుకు వచ్చి ప్రజల్లో చైతన్యం కల్పించాలి. కుల వివక్షను కొనసాగించడం అనేది ఒక మనిషి గౌరవాన్ని కించపరచడమే కాకుండా, మన రాజ్యాంగానికి విరుద్ధం. మారుతున్న కాలానికి తగినట్లుగా మన ఆలోచనలూ మారాలి. ప్రతి మనిషిని ఒక మనిషిగా గౌరవించే మనస్తత్వం పెరిగితేనే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది. తరాలు మారినా, సాంకేతికత పెరిగినా, కుల వివక్ష అనే పాత భావజాలం ఇంకా కొందరిని విడిచిపెట్టడం లేదు. "ఎందుకింత వివక్ష?" అనే ప్రశ్నకు సమాధానం ఒక్కటే – మనసులు మారాలి, మన దృష్టికోణం మారాలి. సమానత్వమే నిజమైన మానవత్వం, అదే సమాజానికి శాశ్వత శ్రేయస్సు.

-మహేష్ కుర్మ
జస్టిస్ మూవ్మెంట్ ఆఫ్ ఇండియా, 6305325021

# రైతు చెమటలో సుగంధం: దువ్వూరి రామిరెడ్డి కవిత్వం




తెలుగు సాహిత్య చరిత్రలో 20వ శతాబ్దం విప్లవాత్మకమైన కాలం. ఈ కాలంలో కవిత్వం సాంప్రదాయ అలంకారాల నుంచి విముక్తి పొంది, సమాజ వాస్తవాల వైపు సాగింది. ఈ దిశలో గ్రామీణ జీవన వాస్తవాలను కవిత్వంలో ప్రతిబింబించడంలో దువ్వూరి రామిరెడ్డి పేరు చిరస్థాయిగా నిలిచింది. రైతు జీవితంలోని చెమట, కన్నీరు, ఆశలు, నిరాశలు, భూమి తల్లితో అనుబంధాన్ని ఆయన కవిత్వం స్వర సౌందర్యంతో అల్లి, తెలుగు సాహిత్యంలో "రైతు కవి", "కవి కోకిల"గా గౌరవం పొందారు.

1895 నవంబర్ 9న శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా గూడూరులో సుబ్బరామిరెడ్డి, రంగమ్మ దంపతులకు జన్మించిన దువ్వూరి, చిన్నతనం నుంచే సాహిత్యాసక్తితో పెరిగారు. మెట్రిక్యులేషన్ వరకు చదివిన ఆయన, స్వయంగా సంస్కృతం, ఆంగ్లం, ప్రాకృతం భాషలలో ప్రవీణత సాధించారు. పల్లెటూరి వాతావరణం, పొలాల్లో రైతు శ్రమ, ప్రకృతి సౌందర్యం ఆయన కవిత్వానికి ప్రేరణగా నిలిచాయి. వ్యవసాయాన్ని జీవనాధారంగా, కవిత్వాన్ని హృదయాధారంగా స్వీకరించిన ఆయన, 1925లో వెలువడిన "కృషీవలుడు" కావ్యంతో రైతు జీవనాన్ని వాస్తవికంగా, భావోద్వేగంతో చిత్రించి అపూర్వ ఖ్యాతి పొందారు. ఈ కావ్యం గ్రామీణ జీవన సౌందర్యం, రైతు శ్రమ విలువ, భూమి పట్ల ఆరాధనను ప్రతిఫలించింది. 1927లో ఒమర్ ఖయ్యామ్ పర్షియన్ కవిత్వాన్ని "పానశాల"గా అనువదించి, క్షణికానందం, జీవన తాత్పర్యం, మానవ జీవిత అనిశ్చితిని సున్నితంగా ఆవిష్కరించారు. "వనకుమారి", "జలదాంగన", "అహల్య", "మధుసంచయం", "కృష్ణవేణి", "కార్షకులు", "కరుణ", "మల్లెపూలు" వంటి రచనలు ప్రేమ, ప్రకృతి, పురాణ కథనాలతో గ్రామీణ జీవనాన్ని కవిత్వరూపంలో చిత్రించాయి. ఆయన కవిత్వం సౌలభ్యం, మాధుర్యం, భావ పరిపూర్ణతతో నిండి, పల్లెటూరి వాసనలా సహజంగా ఉంటుంది. ఈ సౌందర్యం కారణంగానే నెల్లూరు సనాతన ధర్మ కళాశాల ఆయనకు "కవి కోకిల" బిరుదు ప్రదానం చేసింది.

దువ్వూరి సాహిత్య సేవలకు ఆంధ్ర విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్‌తో సత్కరించగా, జ్ఞానపీఠ అవార్డుకు సిఫార్సు చేయబడ్డారు. ఆయన కీర్తి తెలుగు రాష్ట్రాలకు మాత్రమే పరిమితం కాక, భారత సాహిత్య వేదికలపై ప్రతిధ్వనించింది. 1947 సెప్టెంబర్ 11న ఆయన కన్నుమూసినప్పటికీ, ఆయన కవిత్వం రైతు పాటలా, భూమి తల్లి పరిమళంలా నీడలా నిలిచింది. రైతు సమస్యలు, గ్రామీణ వాస్తవాల చర్చల్లో ఆయన కవిత్వం ఎల్లప్పుడూ ప్రస్తావనకు వస్తుంది. దువ్వూరి రామిరెడ్డి కవిత్వం రైతు జీవితాన్ని స్తుతించిన స్వరమై, తెలుగు సాహిత్యానికి కొత్త దృక్పథాన్ని అందించింది. ఆయన రచనలు జీవనాన్ని చూసే కొత్త కళ్ళను, రైతు జీవితాన్ని అర్థం చేసుకునే కొత్త మనసును అందిస్తాయి. అందుకే ఆయన సాహిత్య వారసత్వం నిత్యనూతనంగా తెలుగు సాహిత్యంలో జీవిస్తుంది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్

# రైతుల కష్టాలకు బాధ్యత ఎవరిది?

తెలంగాణలో ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలో కీలకమైనది యూరియా లభ్యత. అవసరమైన మేరకు యూరియా ఎరువులు దొరకక రైతులు నానా అవస్తలు పడుతున్నారు. విచిత్రం ఏమిటంటే రైతుల అవసరాల మేరకు యూరియాను కేంద్రప్రభుత్వం సరఫరాచేయటంలేదని తెలంగాణ ప్రభుత్వం తీవ్రంగా మండిపడుతోంది. ఇదేసమయంలో రాష్ట్రంలో అవసరాలకు మించే కేంద్రప్రభుత్వం యూరియాను సరఫరా చేసిందని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు నారపరాజు రామచంద్రరావు ప్రత్యారోపణలు గుప్పిస్తున్నారు. ఇద్దరిలో ఎవరు చెప్పేది నిజమో తెలీటంలేదుకాని యూరియా మార్కెట్లో అవసరమైనంత దొరకని కారణంగా రైతులు ఇబ్బందులు పడుతున్నది మాత్రం వాస్తవం.ఇదిలాగుంటే యూరియా అవసరమైన మేరకు దొరక్కపోగా అవసరంలేని ఎరువులను రైతులు కొనాల్సొస్తోంది. ఎందుకు కొనుగోలు చేయాల్సొస్తోందంటే యూరియా కావాలంటే పలానా ఎరువులను కొనాల్సిందే అని ప్రైవేటు డీలర్లు కండీషన్లు పెడుతున్నారు. దాంతో ఏమిచేయాలో దిక్కుతోచని రైతులు వేరేదారిలేక యూరియా కోసమని అవసరం లేని ఎరువులను కొనుగోలు చేయాల్సొస్తోంది. ఏప్రిల్-జూలై మధ్యలో సుమారు రాష్ట్రవ్యాప్తంగా 6 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం. అయితే కేంద్రం పంపించింది కేవలం 4 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే అని వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు మండిపడుతున్నారు. దీనికి రామచంద్రరావు బదులిస్తు తెలంగాణకు మొత్తంమీద 9 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమైతే కేంద్రం 12 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను పంపించింది అని పదేపదే చెబుతున్నారు. అవసరమైనంత యూరియాను కేంద్రం పంపిస్తున్నా మంత్రి తుమ్మల అవస్తవాలు చెబుతున్నారంటు రామచంద్రరావు ఎదురు ఆరోపణలు గుప్పిస్తున్నారు.

ఇక్కడ గమనించాల్సింది ఏమిటంటే తుమ్మల చెబుతున్నదేమో ఈ సంవత్సరం ఏప్రిల్-జూలై మధ్య అవసరాలు, సరఫరా విషయాన్ని. బీజేపీ అధ్యక్షుడు చెబుతున్నదేమో పోయిన సంవత్సరం లెక్కలు. యూరియాను రైతులు ఎక్కువగా పత్తి, వరి, వేరుశెనగ పంటల్లో వాడుతుంటారు. రాష్ట్రవ్యాప్తంగా ఇపుడు పంటల సీజన్ నడుస్తోంది. ఇప్పటికే పత్తి, ఇతర ఆరుతడి పంటలకు కలుపు తీసే సమయంలో ఎరువులు వేయాల్సుంటుంది. అందుకనే యూరి యాను ఎక్కువగా కొంటారు. ఇక వరి రైతులు అయితే నాట్లువేసే సమయం లోనే యూరియాను ఉపయోగిస్తారు. అంటే రైతులకు రెండురకాలుగాను యూరియా వినియోగం చాలా ఎక్కువగా ఉంటుందని అర్థమవుతోంది.

కొరత కారణంగానే సింగిల్ విండో, ఆగ్రోస్ లో రైతుకు కేవలం రెండు బస్తాల యూరియాను మాత్రమే ప్రభుత్వం రేషన్ పద్దతిలో అందిస్తోంది. మహబూబ్ నగర్, గద్వాల, నారాయణపేట, వనపర్తి, నాగర్ కర్నూలుతో పాటు నల్గొండ, ఖమ్మం జిల్లాల్లోని చాలాచోట్ల ఇదే పద్దతిని ప్రభుత్వం అమలుచేస్తోంది. యూరియాను ప్రైవేటు డీలర్ల ద్వారా కూడా ప్రభుత్వం సరఫరా చేయిస్తోంది. ప్రభుత్వం ఇస్తున్న 2 బస్తాల యూరియా రైతులకు ఏమూలకు సరిపోవటంలేదు. అందుకనే యూరియా సరఫరాపై తెలంగాణ ప్రభుత్వం పదేపదే కేంద్రప్రభుత్వానికి లేఖలు రాస్తోంది. అయినా ఎలాంటి ఉపయోగం కనబడటంలేదు. కొరతను అవకాశంగా తీసుకుంటున్న ప్రైవేటు డీలర్లు రైతులను దోచుకునేస్తున్నారు. ఎలాగంటే తమ దగ్గర ఉన్న ఇతర ఎరువులను కొంటేనే తాము యూరియా బస్తా అమ్ముతామని రైతులకు కండీషన్ పెడుతున్నారు.

ప్రైవేటు డీలర్ల దోపిడీపై రైతులు ప్రభుత్వానికి ఫిర్యాదులు చేస్తున్నా పెద్దగా ఉపయోగం కనబడటంలేదు. ఒక్కో యూరియా 40 కిలోల బస్తా ధర 267 రూపాయలుంది. సింగిల్ విండోలు, ఆగ్రోస్ లో రైతుల కు ఇదే ధరకు అమ్ముతున్నా ప్రైవేటు డీలర్లు మాత్రం సుమారు 70 రూపాయల అధిక ధరలకు అంటకడుతున్నారు. అంతేకాకుండా తమదగ్గర ఉన్న ఇతర ఎరువులను కొంటేనే యూరియా బస్తాను అమ్ముతామని కండీషన్ పెడుతున్నారు. దాంతో యూరియా కావాలంటే అధిక ధరకు కొనుగోలుచేయటమే కాకుండా అవసరంలేని మరో ఎరువును కూడా రైతులు కొనాల్సొస్తోంది. ఈ విధంగా రెండు రకాలుగా రైతులు మునిగిపోతున్నారు.

యూరియా కోసం రోడ్డెక్కిన పలు జిల్లాల్లో వారికి తప్పని తిప్పలు బస్తా యూరియా ఎలా సరిపోతుందంటూ ఆగ్రహం వేసి రాష్ట్రంలోని పలు జిల్లాల్లో యూరియా కష్టాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. యూరియా దొరక్కపోవడంతో అన్నదాతలు రోడ్డె క్కుతున్నారు. టోకెన్లు ఇచ్చి నెలరోజులు కావస్తున్నా యూరియా ఇవ్వడం లేదన, వచ్చినా సకాలంలో పంపిణీ చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ కుమురంభీం, జిల్లా చెబ్బిన మండల కేంద్రంలో రైతులు రోడ్డెక్కారు. సోమవారం రెబ్బెన పీఏసీఎస్ కార్యాలయానికి 140 బస్తాలతో ఒక లారీ లోడ్ వచ్చింది. అప్పటికే వివిధ గ్రామాలకు చెందిన సుమారు 200 మంది అక్కడ పడి. గోపులు కాస్తున్నారు. ఉదయం 11 గంటలు దాటినా సంఘం ఇన్చార్జి సీఈవో శేషారావు రాకపోవడంతో లోడ్ పంచలేదు దీంతో ఆగ్రహించిన రైతులు జాతీయ రహ దారితోపాటు ఇరువైపులా ఉన్న సర్వీసు రోడ్లనూ దిగ్బంధం చేశారు. కొందరు వైతులు బస్సు కింద పడుకొని విరసన తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో రైతులు ప్రధానంగా ఎదుర్కొంటున్న సమస్యలలో మొట్టమొదటిది యూరియా కొరత. యూరియా కొరతను నివారించడానికి రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వర్షాకాలం వ్యవసాయ పంటలు వేసుకొని మూడు నాలుగు నెలలు గడుస్తున్నా రైతులకు కావలసిన ఎరువులు అందించడంలో ప్రభుత్వం ముందుచూపుతో ప్రణాళిక బద్ధంగా వ్యవహరించకపోవడం వల్ల అంతేకాకుండా వ్యవసాయంలో సాగు శాతం పెరగడం వల్ల యూరియా కొత్త ఏర్పడింది. డి సెంట్రలైజ్డ్ గా యూరియాను అమ్మే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉండే. కేవలం సొసైటీల ద్వారా యూరియా సరఫరా చేసే విధానాన్ని ప్రభుత్వం విరమించుకోవాలి. డీలర్లకు, ఎరువుల విక్రయదారులకు నేరుగా యూరియా ప్రభుత్వం సరఫరా చేస్తే రైతుకు ఎక్కడ అవసరం ఉంటే అక్కడ కొనుగోలు చేస్తారు. సొసైటీల ద్వారా రేషన్ కార్డు, ఆధార్ కార్డుల ఆధారంగా యూరియా సరఫరా చేయడం మంచి పద్ధతి కాదు. రైతుకు ఎప్పుడో అవసరమైతే అప్పుడు యూరియాను ఇతర కాంప్లెక్స్ ఎరువులను అందించే విధంగా ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంటుంది. మే జూన్ లో ప్రారంభమయ్యే వర్షాకాల వ్యవసాయ విధానం అప్పటి వరకే ఒక ప్రణాళిక బద్ధంగా వ్యవసాయ భూమి సాగు ఎంత రైతుల ఎంత మంది కావలసిన ఎరువులు ఎంతవరకు అవసరం ఉంటుంది అన్నదానిపై వ్యవసాయ శాఖ ఒక నిర్దిష్టమైన ప్రణాళిక రూపొందించి ఎందుకు కావలసిన వ్యవసాయ మంత్రిత్వ శాఖ ద్వారా ఎరువులను నిలువ చేసుకోవలసిన అవసరం ఉంటుంది. అయితే ప్రభుత్వ వ్యవసాయ అధికారులు ఎందుకు కావలసిన దీర్ఘకాలిక ప్రణాళిక రూపొందించడంలో వెనకబడ్డారని చెప్పవచ్చు. రోజు రైతు తన పొలంలో వ్యవసాయం చేసుకోవాల్సిన సమయంలో గంటల తరబడి రోజుల తరబడి ఒక బస్తా యూరియా కోసం లైన్ లో నిలబడి తెచ్చుకోవలసిన పరిస్థితులు దాపురించాయి. దీనిని ప్రతిపక్ష ం ఆసరాగా చేసుకొని మా పరిపాలన కాలంలో యూరియా కొరత లేదు ప్రతి రైతుకు ప్రభుత్వమే యూరియాను సరఫరా చేసినట్టు ప్రకటించుకోవడం గమనించదగ్గ విషయం.





అయితే గతంలో కేంద్ర వ్యవసాయానికి కావలసిన యూరియా ఇతర కాంప్లెక్స్ ఎరువులను మన పక్క దేశమైన చైనా నుండి దిగుమతి చేసుకునేది. కానీ చైనా నుండి రావలసిన యూరియా ఇతర కాంప్లెక్స్ ఎరువులు రాకపోవడం వల్ల భారతదేశంలో యూరియా కొరత ప్రధానంగా ఏర్పడిందని చెప్పాలి. ఒక రైతుకు వ్యవసాయం చేయడానికి సారవంతమైన భూమి నీరు కావలసిన ఎరువులు, నాణ్యమైన విత్తనాలు అవసరం ఉంటుంది. వీటన్నింటిని రైతుకు అందించవలసిన బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పైనే ఉంటుంది. రాష్ట్రం కేంద్రం పై ఆధారపడి సరియైన ప్రణాళికతో ముందుకు పోకపోవడంతో వ్యవసాయంలో పెరిగిన సాగుభూమికి కావలసిన యూరియాను రైతులకు అందించలేకపోతుందన్న విమర్శలు ఉన్నాయి. వ్యవసాయ శాఖ రూపొందించిన ప్రణాళిక సరిగ్గా లేదన్న విషయం స్పష్టమవుతుంది. తడిచినంకనే గుడిసె కప్పుకున్నట్లు యూరియా కొరత ఏర్పడిన తర్వాత రైతులు ఆందోళనలు ధర్నాలు రాస్తారోకాలు చేసిన తర్వాత రాష్ట్రానికి కావలసిన యూరియా గురించి ప్రభుత్వం ఆలోచన చేయడం ప్రభుత్వం పైన తీవ్రమైన వ్యతిరేకత విధానం వచ్చింది.

రైతులు రైతు కుటుంబాలు యూరియా కోసమే రోజుల తరబడి సొసైటీల చుట్టూ తిరగడం వల్ల వ్యవసాయం పూర్తిగా దెబ్బతింటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా తెలంగాణలో రైతులకు యూరియా సరఫరా చేయడం ప్రభుత్వం ప్రధానమైన బాధ్యత. యూరియాను ఎక్కువగా వాడడం వల్ల పంటలకు నష్టం కలుగుతుందని ఒకపక్క ప్రభుత్వం ప్రసారం చేస్తున్నప్పటికీ యూరియాకు బదులు నానో యూరియాను వాడాలని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్న మాటలు రైతులు వినడం లేదు. తనకు యూరియా బస్తాలు ప్రభుత్వం ఇస్తదా లేదా అన్న ఆలోచన విధానంతో రోజుల తరబడి ఒక బస్తా యూరియా కోసం క్యూ లైన్ లో నిలబడి పోరాడి సాధించుకోవాల్సిన పరిస్థితులు ఉన్నాయంటున్నారు.

## యూరియా కొరత ప్రభుత్వంపై ప్రభావం:

తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయ రంగానికి కావలసిన యూరియా ప్రభుత్వం అందించక లేకపోవడంతో దీని యొక్క ప్రభావం వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో తీవ్రమైన ప్రభావం చూపుతుందని రాజకీయ విశ్లేషకులు అంటున్న మాటలు. గతంలో యూరియా ఓపెన్ మార్కెట్లో దొరికే కాబట్టి రైతులు ఎప్పుడు అవసరం ఉంటే అప్పుడు ఎరువులు కొనుక్కొని వ్యవసాయం చేసుకొని ఉండేవారు. కానీ నేడు యూరియా బస్తాలను ప్రభుత్వం ఆధార్ కార్డు ఆధారంగా సరఫరా చేయడం ఎండలో వానలో క్యూ లైన్ లో నిలబడి సోమశిల పోతున్న రైతులు ప్రభుత్వం పైన వ్యతిరేకతను పెంచుకుంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతుల యొక్క బాధను అర్థం చేసుకొని కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి మరింత యూరియా కాంప్లెక్స్ ఎరువులను తెప్పించి ఓపెన్ మార్కెట్లో ఎరువులు దొరికే విధంగా ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉంది. ఇందుకు కావలసిన ప్రణాళికలు రూపొందించుకోవాల్సిన అవసరం కూడా ప్రభుత్వం పైనే ఉందని చెప్పాలి. కేంద్ర ప్రభుత్వం యూరియా ఇతర దేశాల నుంచి ముఖ్యంగా రష్యా, యుక్రేన్ దేశాల నుండి దిగుమతి చేసుకుంటుంది. అయితే పక్క దేశమైన చైనా నుండి దిగుమతి చేసుకునే భారతదేశం నేడు చైనా యూరియా భారతదేశానికి ఎగుమతి చేయడం విరమించుకోవడం వల్ల ఇతర ప్రాంతాల నుండి ముఖ్యంగా దూరప్రాంతాల నుండి యూరియా కొనుగోలు చేసి తీసుకురావడం వల్ల ఎక్కువ మొత్తంలో విదేశీ మార్గం చెల్లించవలసి ఉంటుంది. ఇది ఆర్థికంగా భారతదేశానికి అదన భారం పడుతుంది. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు దేశంలోని రైతులకు సరిపోను యూరియా అందించడంలో ప్రణాళికలు రూపొందించుకోవాలి. కేంద్ర ప్రభుత్వాన్ని రాష్ట్ర ప్రభుత్వాన్ని నిర్మించడానికి రైతు వెనకాడడు. ఎందుకంటే తాను కోరుకొని తెచ్చుకున్న ప్రభుత్వాలు తమ సమస్యలను పరిష్కరించడం లేదన్న ఆవేదన రైతులకు ఉన్నది. కాబట్టి రైతు సమస్యను గ్రామీణ ప్రాంత సమస్యలను పరిష్కరించడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎప్పుడు ముందు ఉండాలి. లేకపోతే ప్రజల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుంది.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

# విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదే..

- ప్రభుత్వ చిప్ విప్ పట్నం మహేందర్ రెడ్డి..

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 10 (జనంసాక్షి) :** విద్యార్థులకు మెరుగైన విద్యను అందించి భావి భారత పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనని చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు బుధవారం రంగారెడ్డి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయ భవనంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమానికి శాసన మండలి చీఫ్ వీప్ పట్నం మహేందర్ రెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొని సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించి , జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యాయుడుగా జీవితాన్ని ప్రారంభించి దేశ అత్యున్నత స్థానమైన రాష్ట్రపతి పదవిని అలంకరించారని, రాధాకృష్ణన్ ఆంధ్రా, బెనారస్ విశ్వవిద్యాలయాలకు వైస్ చాన్సలర్ గా కూడా పని చేశారని, సర్వేపల్లి రాధాకృష్ణన్ గారిని గౌరవించి వారి జన్మదినాన్ని జాతీయ ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. గ్రామీణ పేద విద్యార్థులను ఉన్నత శిఖరాలకు తీసుకువచ్చే బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనని అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో పేద విద్యార్థులకు మెరుగైన విద్యను అందించి, పై చదువులకు ప్రోత్సహిస్తూ తల్లి తండ్రుల తర్వాత ఉపాద్యాయులదే బాద్యత తీసుకుంటున్నారని అన్నారు. ఇబ్రహీంపట్నం శాసన సభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఉత్తమ ఉపద్యాయులుగా 207 మందికి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల



ఇవ్వడం,అభినందనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పెద్ద పీట వేసిందన్నారు. సమాజంలో మార్పుకు ఉపాధ్యాయులే ముఖ్యమని, ఈ సందర్భంగా అందరికి అభినందనలు తెలిపారు. తల్లిదండ్రుల తరువాత స్థానం గురువులదే నని, అందరికీ మార్గదర్శకులు గురువులు అన్నారు.ఏ దేశ భవిష్యత్తు అయినా తరగతి గదిలోనే ఉంటుందన్నారు. ఒక ఇంజనీర్ ప్రాజెక్టులు నిర్మిస్తాడు, సైంటిస్ట్ రాకెట్లు తయారు చేస్తాడు, డాక్టర్ వైద్యం చేస్తాడు. కానీ వీరందరినీ తయారు చేసేది ఉపాధ్యాయులే అన్నారు.సమాజానికి ఉపయోగపడే విధంగా విద్యార్థులను తయారు చేసేది ఉపాధ్యాయులని, గురువుకు సమాజంలో అత్యుత్తమ స్థానం ఇవ్వడం జరిగిందని, సమాజ నిర్మాతలు, మార్గదర్శకులు ఉపాధ్యాయులేనని, విద్యార్థి జీవితాన్ని మలుపు తిప్పేది ఉపాధ్యాయులేనని అన్నారు. చేవెళ్ళ శాసన సభ్యులు కాలే యాదయ్య మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ ఉపాధ్యాయ వృత్తి నుండి రాష్ట్రపతి స్థాయి వరకు ఎదగడంలో ప్రత్యేకమైన స్థానం ఉపాధ్యాయులదేనని, మాడల్ స్కూల్స్ మరియు గురుకుల పాటశాలలు ప్రభుత్వం ఏర్పాటు చేయడము జరిగిందన్నారు. ప్రజా పాలన వచ్చిన తర్వాత ఉపాధ్యాయులకు ప్రమోషన్లు ఇవ్వడం జరిగిందన్నారు. అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) శ్రీనివాస్ మాట్లాడుతూ ఆదర్శవంతమైన సమాజాన్ని అందించేది కేవలం ఉపాధ్యాయులేనని, ఎదుటి వారిని గౌరవించే ప్రవర్తనను విద్యార్థులకు నేర్పించేది విద్యను బోధించే ఉపాధ్యాయులేనని, సమాజంలో పెరుగుతున్న చెడు రుగ్మతలను పారద్రోలాడనికి ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రా రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి చాలా ఉత్తమమైనదని, విద్యార్థి జీవితంలో ఉపాధ్యాయుని పాత్ర చాలా ముఖ్యమైనదని, విద్యార్థులు జీవితంలో ఉన్నతస్థానానికి ఎదగడానికి ఉపాధ్యాయుని బోధనలు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. అందరమూ కూడా ఒకనాడు విద్యార్థులమేనని, మనకు చిన్నప్పుడు విద్య నేర్పిన గురువులు వలనే మనందరికీ జ్ఞానం, విలువలు అబ్బినవని, మెరుగైన సమాజం ఉండాలంటే నాణ్యమైన విద్య ఉండాలని, విద్య వచ్చిన వారికి సమాజంలో మంచి గౌరవం ఉంటుందని, విద్యావేత్తలకే ఎక్కువ గౌరవం ఉంటుందని, అలాంటి విద్యావేత్తలను తయారు చేసేది గురువులేనని శాసన మండలి సభ్యులు ఏవీఎన్ రెడ్డి, దయానంద్ గుప్తా అన్నారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక అయిన 207 మంది ఉపాధ్యాయులకు శాలువా, జ్ఞాపిక, మరియు ప్రశంసా పత్రం అందజేసి సన్మానించారు ఈ కార్యక్రమములో అదనపు కలెక్టర్ లు చంద్రారెడ్డి, శ్రీనివాస్, జిల్లా పరిషత్ సిఈఓ కృష్ణారెడ్డి, జిల్లా విద్యా శాఖ అధికారి సుశీందర్ రావు, మండల విద్యాధికారులు, ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# యూరియా సరఫరా చేయడంలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు వైఫల్యం

- మాజీ రాష్ట్ర బీసీ కమిష్ సభ్యులు శుభప్రద్ పటేల్
- యురియా కోసం క్యూ లైన్‌లో నిల్చున్న రైతులకు పండ్లు పంపిణీ



**తాండూరు, సెప్టెంబర్ 10 (జనంసాక్షి) :** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యంతో తెలంగాణ రాష్ట్రంలో రైతులు రోడ్లపైకి వచ్చి కన్నీళ్లు పెట్టుకునే పరిస్థితి ఏర్పడిందని రాష్ట్ర మాజీ బిసి కమిషన్ సభ్యులు శుభప్రద్ పటేల్ అన్నారు.బుధవారం తాండూర్ పట్టణంలోని ఎల్మకన్నే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద యురియా కోసం క్యూలైన్లో నిల్చోని పడి కాపులు కాస్తున్న రైతులను రాష్ట్ర మాజీ బీసీ కమిషన్ సభ్యులు శుభప్రద్ పటేల్ పండ్లను పంపిణీ చేశారు. పస్తులు తో వచ్చిన రైతుకు పండ్లు పంపిణీ చేయడం పై రైతులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శుభప్రద్ పటేల్ రైతులకు ఇస్తున్న యూరియా బస్తాలు వాటి నిలువల పై సహకార సంఘం అధికారులతో ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.సీఎం రేవంత్ రెడ్డి సొంత జిల్లాలో రైతుల కష్టాలు చూస్తుంటే గుండె తరుక్కుపో తుందని అన్నారు. అన్నం పెట్టే రైతన్న పస్తులతో యూరియా కోసం ఎండలో నిల్చోవడం కంటతడి పెడుతున్నదని అన్నారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సరిపడే యూరియాను వెంటనే పూర్తిస్థాయిలో పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే మరో ఉద్యమం తప్పదని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు భాను, అబిద్ చావుస్, సాయి కుమార్, మల్లేశం, శ్రీధర్, మనోహర్ తదితరులు ఉన్నారు.

# స్థానిక సంస్థలు అధికార పార్టీకి గుణపాఠం చెప్పాలి

- మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్



**మర్పల్లి, సెప్టెంబర్ 10 (జనంసాక్షి) :** గత కొంతకాలంగా రైతులు యూరియా కోసం పడుతున్న కష్టాలు అధికార కాంగ్రెస్ పార్టీకి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కు కనబడడం లేదా అని బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ అన్నారు. బుధవారం మర్పల్లి మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం ఎదురుగా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మండలంలోని బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెతుకు ఆనంద్ మాట్లాడుతూ హైదరాబాదులోని బి ఆర్ ఎస్ పార్టీ కార్యాలయం రాష్ట్ర స్థాయి జనతా గ్యారేజ్ గా మారిందని, మర్పల్లి మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం కూడా ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు జనతా గ్యారేజ్‌లా పనిచేస్తుందని అన్నారు. అధికార కాంగ్రెస్ పాలనలో ప్రజలు ప్రతి ఒక్కరూ ఇబ్బందులు పడుతున్నారని, రైతులు యూరియా కోసం కష్టపడుతుంటే నాయకులు వెళ్లి పరామర్శిస్తే వారిపై కేసులు పెడుతున్నారని, ఇలాంటి కేసులకు భయపడే ప్రసక్తే లేదన్నారు. మండల ప్రజలు ప్రతి ఒక్కరు గతంలో కెసిఆర్ పాలనలో ఎమ్మెల్యేగా సేవలందించినప్పుడు ఉన్న సంక్షేమ పథకాలు.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పాలలలో తేడాను గమనించి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు అధికార కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. పార్టీ కార్యాలయంలో ప్రతిరోజు ఉదయం నుండి సాయంత్రం వరకు అందుబాటులో ఉండి ఉచితంగా ఆన్లైన్ సేవలను అందించబోతున్న మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి మధుకర్, మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ మోహన్ రెడ్డి, మండల పార్టీ యూత్ ప్రెసిడెంట్ మధుకర్, బంటు రమేష్, పార్టీ వైస్ ప్రెసిడెంట్ రాచన్న, అశోక్, నీలి శ్రీకాంత్, మాజీ సర్పంచ్ జైపాల్ రెడ్డి, గోపాల్ రెడ్డి, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆ విద్యుత్ కాంట్రాక్టర్ రూటే సపరేటు

- అధికారుల ఆదేశాలు అంటే లెక్కే లేదు
- ప్రజా అవసరాలు... జవాబు దారి తనం అంటే అసలు గిట్టదు...

**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 10 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో ఆయన ప్రైవేట్ కాంట్రాక్టర్. విద్యుత్ విభాగంలో ఆయన కాంట్రాక్టర్ గా కొనసాగుతుంటాడు. అయితే సర్కిల్ పరిధిలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలలో భాగస్వామిగా ఉంటూ హితోధికంగా నాలుగు రాళ్లు వెనకేసుకోవడం ఆయన నిర్వహించే బాధ్యత లక్ష్యం. అయితే ఈ కాంట్రాక్టర్ మాత్రం తన రూటే సపరేట్ అంటూ రూల్స్ గీల్స్ జాన్తా నై అన్న ధోరణిలో పనిచేయడం ఈయన నైజం. శేరిలింగంపల్లి జోన్ పరిధి శేరిలింగంపల్లి సర్కిల్, చందానగర్ సర్కిల్ తోపాటు కూకట్పల్లి జోన్ పరిధి మూసాపేట్ సర్కిల్ పరిధిలో సైతం సదరు కాంట్రాక్టర్ విద్యుత్ దీపాల సంబంధ వ్యవహారాలను చూస్తుంటాడు.

## చెప్పేదొకటి... చేసేదొకటి..!

శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో గత కొన్నేళ్లుగా విద్యుత్ విభాగంలో కాంట్రాక్టర్ గా పని చేస్తున్న సదరు వ్యక్తి ఆయన చేస్తున్న పనికి, సర్కిల్ పరిధిలో ఆయన నిర్వహిస్తున్న పాత్రకు ఏమాత్రం పొంతన లేకుండా ఇష్టానుసారంగా వ్యవహరించడం ఆయన క్యారెక్టర్ కున్న అదనపు హెూదా. సర్కిల్ పరిధిలోని ప్రధాన ప్రాంతాలలో విద్యుత్ సంబంధ సమస్యలు తలెత్తినా... పొరపాటున వీధి దీపాలు పాడైపోయినా ఆ సమస్యలను ఓ పట్టాన పట్టించుకోని పూర్తి చేయకపోవడం ఆ కాంట్రాక్టర్ ప్రత్యేక లక్షణం. ప్రజల నుండి, ఇతర మార్గాలలో ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అంది ఏకంగా డిఇ స్థాయి విద్యుత్ ఇంజనీరింగ్ అధికారులు కాంట్రాక్టర్ తాలూకా వ్యక్తికి ఫోన్ చేసి సమస్యల పరిష్కారానికి ఆదేశాలు జారీచేసినా ఈయన నుండి పెద్దగా స్పందన ఉండకపోవడం



విడ్డూరంగా కనిపిస్తుంది. కాంట్రాక్టర్ నిర్లక్ష్య వైఖరికి నిదర్శనంగా నిలిచే ఘటన ఈ మధ్యకాలంలో శేరిలింగంపల్లి డివిజన్ పరిధి తారా నగర్ సాయిబాబా కమాన్ వద్ద విద్యుత్ దీపాల ఏర్పాటు విషయంలో సైతం స్పష్టంగా బట్టబయలైంది. దాదాపుగా 6 నెలల నుండి ఇక్కడ వీధిదీపాలు పాడైపోవడంతో ఎన్నో సందర్భాలలో అధికారుల ద్వారా సదరు కాంట్రాక్టర్ కు సమాచారం అందినప్పటికీ కనీసం ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించే తీరిక సైతం లేకపోవడం అతని అహంకార ధోరణికి నిలువెత్తు నిదర్శమని తారా నగర్ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ మధ్యనే ముగిసిన వినాయక చవితి పండుగ, గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని పురస్కరించుకొని స్థానికులు శేరిలింగంపల్లి సర్కిల్ ఎలక్ట్రికల్ విభాగం డిఇ ద్వారా కాంట్రాక్టర్ తాలూకా గణేష్ కు వీధి దీపాలను ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకతను తెలియజేసినప్పటికీ ఆయన స్పందించకపోగా సమస్య ఎక్కడుందో సైతం తెలియని దయనీయ స్థితిలో కాంట్రాక్టర్ గా కొనసాగుతూ ఉండడం శేరిలింగంపల్లి వాసుల దౌర్భాగ్యంగా పలువురు అభివర్ణిస్తున్నారు. కాంట్రాక్టర్ గా సర్కిల్ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల విషయంలో ఎంతో అప్రమత్తంగా ఉండాల్సింది పోయి కేవలం ధనార్జననే ధ్యేయంగా ముందుకు సాగుతూ ప్రజల అవసరాలను సైతం పట్టించుకోకుండా బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం ఆయన నిర్లక్ష్య ధోరణికి పరాకాష్టగా భావించాల్సిన అవసరం ఉందని, జంట సర్కిల్లో అధిక శాతం లో వీధి దీపాలు వెలిగకపోవడం అతని నిర్లక్ష్యానికి నిదర్శనం అని ప్రజలు పేర్కొన్నారు. కాంట్రాక్టర్ ను అధికారులు బలవంతంగా తమ భుజాలపై మోయకుండా బ్లాక్లిస్టులో పెట్టి బాధ్యతతో పని చేసే మరో కాంట్రాక్టర్ కు విధులను అప్పగిస్తే మేలని స్థానికులు స్పష్టం చేస్తున్నారు.

# తాండూర్ దౌల్తాబాద్ మండలాల్లో పోలింగ్ బూతుల మార్పు

**వికారాబాద్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 10 (జనం సాక్షి) :** జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ వికారాబాద్ జిల్లా ఆమోదం మేరకు, జడ్పిటిసి సంబంధిత తుది ఓటర్ల జాబితా పోలింగ్ కేంద్రాల జాబితా (అనుబంధం 5, 7)లను జిల్లా పరిషత్ కార్యాలయం, వికారాబాద్ లో బుధవారం ప్రచురించారు.అదే విధంగా అన్ని మండల కేంద్రాలు, గ్రామ పంచాయతీలు, జిల్లా కలెక్టర్ కార్యాలయం ఆర్డీవో కార్యాలయం, వికారాబాద్‌లో ప్రజల సమాచారం కోసం కూడా ప్రచురించారు.వికారాబాద్ జిల్లాలోని అన్ని మండల స్థాయిలలో ఎంపీడీఓలు తమ మండల పరిధిలో జడ్పీటీసీ/ఎంపీటీసీ ఫైనల్ ఓటర్ల జాబితా మరియు పోలింగ్ కేంద్రాల జాబితాను పబ్లిష్ చేశారు. తాండూర్ మండలం లో ఈనెల 8వ తేదీన జరిగిన మండల స్థాయి రాజకీయ పార్టీ ప్రతినిధుల సమావేశంలో లేవనెత్తిన అభ్యంతరాలను పరిశీలించి, రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం క్రింది మార్పుల ను ఆమోదించారు. మైసమ్మ తండా (గుండ్లమడుగు గ్రామపంచాయతీ ) నందు333 మంది ఓటర్లు ఉన్నందున, 3 కి.మీ దూరం ప్రయాణం చేయవలసి రావడంతో, రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం కొత్త పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేశారు. కరణ్‌కోట్ ఎంపీటీసీ పిఎస్ నంబర్లు 38, 39, 40, 41, 42). మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (బాలుర) నుండి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, కరణ్‌కోట్ (అదే ప్రాంగణం)కు మార్చారు. కరణ్‌కోట్ ఎంపీటీసీ పిఎస్ నంబర్లు 43, 44, 45, 46) గది నం. 6, 7, 8, 9 నుండి గది నం. 1, 2, 3, 6కు మార్పు చేశారు. కరణ్‌కోట్ ఎంపీటీసీ పిఎస్ నంబర్లు 47, 48, 49) గది నం. 10, 11, 12 నుండి గది నం. 7, 8, 9కు మార్పు చేశారు. దౌల్తాబాద్ మండలం మండల స్థాయి సమావేశంలో లేవనెత్తిన 7 అభ్యంతరాలను మండలం ప్రస్తుత పోలింగ్ స్టేషన్ ప్రతిపాదిత మార్పు చేశారు.



# తుమ్మలపల్లి విద్యుత్ లైన్‌మెన్‌పై సస్పెన్షన్ వేటు

- కిక్కులో విద్యుత్ అధికారి అంటూ పత్రిక కథనాలు
- స్పందించిన విద్యుత్ ఉన్నతాధికారులులి
- సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన డిఈ శామ్ సుందర్ రెడ్డి

**కొందుర్గు, సెప్టెంబర్ 10 (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లాలో ఉమ్మడి కొందుర్గు మండలం తుమ్మలపల్లి సబ్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న లైన్ మెన్ ప్రభాకర్ రెడ్డిపై ఉన్నత అధికారులు సస్పెన్షన్ వేటు వేశారు.మద్యం సేవించి విధులు నిర్వహిస్తూ వీరంగం సృష్టించాడనే ఆరోపణలు రావడంతో ప్రచురించింది. స్పందించిన ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేస్తూ ఆదేశాలు జారీ చేశారు. విధుల్లో ఉంటూ శాఖకు చెడ్డపేరు తెచ్చే విధంగా పని చేసే ఎవరినైనా శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని డిఈ శామ్ సుందర్ రెడ్డి తెలిపారు.




# విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికారాన్ని అందజేయాలి

- పాఠశాలలు అంగన్వాడి కేంద్రాలు ఆసుపత్రి తనిఖీ
- రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి



**వికారాబాద్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 10 (జనం సాక్షి) :** విద్యార్థులకు నాణ్యమైన పౌష్టిక ఆహారాన్ని అందజేయాలనితెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమీషన్ చైర్మన్ గోలే శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ తో పాటు మూల కుంట భారతి, రంగినేని శారద, ఓరు గంటి ఆనంద్ మెంబర్లు పాల్గొన్నారు. అంతకుముందు వికారాబాద్ జిల్లా ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్.డి ఆర్ డి ఓ శ్రీనివాస్, ఆర్ డి ఓ వాసు చంద్ర, డి ఎస్ ఓ సుదర్శన్, డి ఇ ఓ రేణుకా దేవి, డియం అండ్ ఎచ్ఓ లలితా దేవి, డి డబ్ల్యూ ఓ కృష్ణ వేణి, డి టి డి ఓ కమలాకర్ రెడ్డి,డీలర్ అసోసియేషన్ సభ్యులు మర్యాద పూర్వక కంగా పూల మొక్కలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం కమిషన్ కోట్ పల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జిల్లా పరిషత్ పాఠశాల, అంగన్వాడి, చౌక ధర దుకాణాలను కమిషన్ సభ్యులు భారతి, శారద , ఆనంద్ లతో కలిసి రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలు, అంగన్వాడీలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు ప్రణాళిక బద్ధంగా మెనూ ను రూపొందించిందని, దానికి అనుగుణంగా మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. ప్రజల, విద్యార్థుల సమస్యలను తెలిపేందుకు పాఠశాల, చౌక ధర దుకాణాల ఆవరణలో అధికారుల ఫోన్ నెంబర్లతో కూడిన ఫిర్యాదు పట్టికను అమర్చాలని అధికారులకు సూచించారు. అంగన్వాడీలలో పిల్లలతో పాటు గర్భిణీ స్త్రీలకు పోషకాహారాన్ని అందించాలని చైర్మన్ సూచించారు. ఎప్పటికప్పుడు రేషన్ నిల్వలను రిజిస్టర్లలో నమోదు చేయాలని అదేవిధంగా సరుకులపై గడువు తేదీని పరిశీలించాలని ఆయన తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. మాతా శిశు సంరక్షణ కార్డులో నమోదు చేసిన వివరాలను పరిశీలించిన కమిషన్ సభ్యులు సిబ్బందిని ప్రశంసించారు.ఈ సందర్భంగా ఆసుపత్రికి వచ్చిన ప్రజలు మండల కేంద్రంలో 24 గంటలపాటు వైద్య సేవలు ఉండాలని అదేవిధంగా అంబులెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు.కమిషన్ చైర్మన్ పర్యటనలో డిఆర్డిఏ శ్రీనివాస్, డిఇఓ రేణుకా దేవి, డీఎంహెచ్ఓ లలితా దేవి, డిడబ్ల్యుఓ కృష్ణవేణి, జిల్లా పౌరసరఫరాల అధికారి సుదర్శన్, జిల్లా మేనేజర్ మోహన్ కృష్ణ, ఫుడ్ సెక్యూరిటీ అధికారి జగన్నాథ్, తహసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో డానియల్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# చంద్రవంచలో పరస్పర దాడులు

- దాడుల్లో ఇరువురికి గాయాలు
- గ్రామంలో అర్ధరాత్రి ఇరువర్గాల ఘర్షణ
- విధి నిర్వహణలో ఉన్న కానిస్టేబుల్‌కు గాయాలు
- 15 మందిపై హత్యాయత్నం అట్రాసిటీ కేసుల నమోదు

**వికారాబాద్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 10 (జనం సాక్షి) :** దేశం అన్ని రంగాల్లో సాంకేతికంగా అభివృద్ధి చెందుతున్న పల్లెల్లో ఇంకా వివక్ష వీడలేదు. చదువుకున్న యువత సైతం పరిజ్ఞానాన్ని పక్కన పెట్టి మూర?ంగా వ్యవహరిస్తూ ఇంకా వివక్ష కొనసాగిస్తున్నారు. ఫలితంగా ప్రత్యేక పర్వదినాల్లో వివక్షతో పరస్పర దాడులకు దిగుతున్నారు. పచ్చని పల్లెల్లో ప్రజల మధ్య వైరాన్ని పెంచుతున్నారు. తాజాగా వికారాబాద్ జిల్లా తాండూరు మండలం చంద్రవంచ గ్రామంలో ఇలాంటి సంఘటన జరిగింది. దీంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. దాడులకు ప్రతి దాడలకు పాల్పడిన వారిపై అట్రాసిటీ హత్యాయత్నం కేసులు నమోదయ్యాయి. వినాయక నిమజ్జనం రోజున చిన్న గొడవ ఇరువర్గాల మధ్య చిచ్చు రగిలించింది. రెండు వర్గాలు అర్ధరాత్రి వేళ ఇండ్లల్లోకి చొరబడి పరస్పర దాడులు చేసుకున్నారు. విషయం తెలుసుకుని అడ్డుకునేందుకు వెళ్లిన పోలీస్ కానిస్టేబుల్ గాయాలపాలయ్యాడు. తాండూరు రూరల్ సీఐ నగేష్, కరణ్ కోట్ ఎస్ఐ రాథోడ్ వినోద్ తెలిపిన వివరాల ప్రకారం.. చంద్రవంచ గ్రామంలో ఈనెల 6న వినాయక నిమజ్జన ఊరేగింపు నిర్వహించారు. ఉత్సవ కమిటి సభ్యులు వినాయక విగ్రహాలను ట్రాక్టర్లలో ఉంచి నిమజ్జనానికి తరలించారు. గ్రామంలోని ఒక గుడి సమీపంలోకి రాగానే గ్రామానికి చెందిన దళితుల మరో వర్గానికి చెందిన ట్రాక్టర్లు ఎదురుపడ్డాయి. ఇందులో ఓ వర్గం వారు తమకు దారి వదిలితే ముందుకు వెళతామని కోరారు. ఇందుకు మరో వర్గం వారు అంగీకరించలేదు. దీంతో ఇరు వర్గాల మధ్య మాటా మాటా పెరిగి దాడులకు దారితీసింది. అక్కడ ఉన్న గ్రామ పెద్దలు ఇరువర్గాలను నచ్చ చెప్పారు. మరుసటి రోజు ఆదివారం నాడు గ్రామ పెద్దలు ఇరువర్గాల మధ్య గొడవలు లేకుండా రాజీ కుదిర్చారు. అయితే సోమవారం రాత్రి ఇరువర్గాల మధ్య మళ్లీ గొడవ మొదలైంది. పరస్పరం దాడులకు పాల్పడ్డారు. అర్ధరాత్రి ఇండ్లల్లోకి చొరబడి ఇరువురు దాడులు చేసుకోవడంతో అరుపులు కేకలతో ప్రజలు భయాందోళకు గురి అయ్యారు. పరస్పర దాడుల విషయాన్ని గ్రామానికి చెందిన ఓ వ్యక్తి డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. కరణ్ కోట్ పోలీస్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేళ్లు బస్వరాజ్, శేఖర్‌లు ఈ విషయమై తెలుసుకుని గ్రామానికి వెళ్లారు.అప్పటికే ఇరువర్గాల వారు పరస్పర దాడులు చేసుకుంటున్నారు. వారిని అడ్డుకునేందుకు వెళ్లిన కానిస్టేబుల్ బస్వరాజ్ తీవ్రంగా గాయపడ్డాడు. తలకు బలమైన గాయాలయ్యాయి. ఇదే దాడిలో గ్రామానికి చెందిన దస్తప్ప, మరికొందరు గాయాలపాలయ్యారు. తీవ్రంగా గాయపడిన కానిస్టేబుల్‌తో పాటు క్షేత్రగత్రులను 108 సాయంతో చికిత్స నిమిత్తం తాండూరులోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. కానిస్టేబుల్ బస్వరాజ్ తలకు బలమైన గాయాలు కావడంతో వైద్యులు కుట్లు వేశారు. అదేవిధంగా




దస్తప్ప అనే వ్యక్తికి తీవ్ర రక్తస్రావం కావడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు రిఫర్ చేశారు. అయితే కుటుంబీకులు తాండూరు పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కాగా పరస్పర దాడులు సీసీ కెమరాలో రికార్డు అయ్యాయి. దాడులను ఆపేందుకు వచ్చిన ఇద్దరు కానిస్టేబుళ్లలలో శేఖర్ అనే కానిస్టేబుల్ కూడా దాడిని వీడియో తీశారు. తాండూరు రూరల్ సీఐ నగేష్ సీఐ ఆదేశాలతో కరణ్ కోట్ ఎస్ఐ రాథోడ్ వినోద్ మంగళవారం చంద్రవంచ గ్రామాన్ని సందర్శించారు. పరస్పర దాడులకు గల కారణాలు, కారుకుల గురించి ఆరా తీశారు. సీసీ కెమెరాల ఆధారంగా దాడికి పాల్పడిన వారిని గుర్తించేందుకు చర్యలు తీసుకున్నారు. అర్ధరాత్రి దాడికి దిగిన ఇరువర్గాలలో సుమారు 15 మందిపై కేసులు నమోదు చేసినట్లు రూరల్ సీఐ నగేష్ వెల్లడించారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారు ఎంతటి వారైన ఉపేక్షించేది లేదని, చర్యలు తప్పవని హెచ్చరించారు. మరోవైపు ఇరువర్గాల దాడుల నేపథ్యంలో కరణ్ కోట్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

# నర్వలో రైతు సమస్యలపై బీజేపీ నాయకుల మహా ధర్నా




**నర్వ, సెప్టెంబర్ 10 (జనంసాక్షి) :** నర్వ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా దగ్గర బిజెపి నాయకులు మహాధర్నా నిర్వహించారు,బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ఆరు గ్యారంటీలు అంటూ,ప్రజా పాలన అంటూ అధికారంలోకి వచ్చి రైతుల ఆశలపై నీళ్లుచల్లి సన్నలకు ఐదువందల బోనస్ ఇస్తామని ఇంకా ఇవ్వకపోగా వానాకాలం పంటలకు సరిపోయేంత యూరియా ఇవ్వకుండా రైతులను రోజులతరబడి వరుసలో నిలబెట్టి వ్యవసాయ భూమి పట్టాఉంటే బుక్కి ఒకటి రెండు ఇస్తామని చెప్పడం ఏంటని ప్రశ్నించారు,గతంలో నర్వ మండలంలోనీ రైతులకు రెండు వేల మెట్రిక్ టన్నులే సరిపోతుండే అలాంటిది అధికారిక లెక్కల ప్రకారం వాన కాలంలో ఇప్పటికే నాలుగువేల మెట్రిక్ టన్నుల యూరియా మన నర్వ మండలంకు కేటాయించిన ఇంకా రైతులకు యూరియా కొరత ఎందుకు వేధిస్తుంది అని రాష్ట్ర ప్రభుత్వంను ప్రశ్నించారు,సన్నవడ్లకు ఐదు వందల రూపాయల బోనస్ పైసలు ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించారు ఇందిరమ్మ ఇళ్లు అంటూ ప్రొసీడింగ్స్ ఇచ్చి చేతులు దులుపుకోవడం కాదు మండలంలో ఎన్ని ఇల్లుకు బిల్లులు చెల్లించారో ఎన్ని ఇళ్లకు ఉచిత ఇసుక ఇచ్చారో ఎన్ని ఇళ్లకు సీకు సిమెంటు ఎంత తక్కువ ధరకు అందించారో లెక్కలు చెప్పాలని నిలదీశారు.రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో రైతులు మీకు సరైన బుద్ధి చెప్తారని బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి హెచ్చరించారు.ప్రభుత్వ అధికారులకు రేషన్ డీలర్లకు బీజేపీ మండల అధ్యక్షులు మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయంలో అధికార పార్టీ నాయకుల మాటలు వింటూ ఏకపక్షంగా వ్యవహరించడం సరికాదని ప్రభుత్వం పథకాలు హర్హులైన పేదలకు అందించాలని లేకుంటే మీపై జిల్లా స్థాయి అధికారులకు పిర్యాదు చేస్తామని హెచ్చరించారు.నర్వ మండలంలోని రేషన్ డీలర్లు మీ షాపులలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడి ఫోటో తప్పనిసరిగా పెట్టాలని కేంద్ర ప్రభుత్వ ఆదేశాలు రేషన్ డీలర్లు పాటించాలని సూచించారు. ఆరు కిలోల బియ్యం కోటలో కేంద్ర ప్రభుత్వ వాటా ఐదు కిలోలు ఇస్తున్నందున ప్రజలకు ఈ విషయం చేరవేయాలని కార్యకర్తలకు సూచించారు.ఇట్టి కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పసుల నీరజ్ కుమార్,మాజీ సర్పంచ్ సంధ్య ఆంజనేయులు మాజీ సర్పంచ్ వేంకటేశ్వర్ రావు,అమరచింత మండల అధ్యక్షురాలు మంగ లావణ్య అమరచింత మండల ప్రధాన కార్యదర్శి మల్ రెడ్డి మరికల్ మండల ప్రధాన కార్యదర్శి సురేందర్, గంగాధర్,చిత్తనుర్ భాస్కర్ రెడ్డి ఉందేకోడ్ రాజేందర్ కుమార్ నర్వ మండల ప్రధాన కార్యదర్శి విజయ్ రామ్,నర్వ మండల కోశాధికారి నాగన్నగారి యాదవ రెడ్డి,నర్వ మండల మాజీ ప్రధాన కార్యదర్శి రాంపూర్ నరసింహ మరియు వివిధ గ్రామాల బూత్ అధ్యక్షులు మోర్చాల అధ్యక్షులు బీజేవైఎం నాయకులు బీజేపీ సీనియర్ నాయకులు బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ జీవితం స్ఫూర్తిదాయకం




**భూత్పూర్, సెప్టెంబర్ 10 (జనంసాక్షి) :** మున్సిపాలిటీ పరిధిలోని అమిస్తాపూర్ చౌరస్తాలో రజక సహకార సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బిజెపి నాయకుడు శ్రీనివాస్ మాట్లాడుతూ, భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడి తెలంగాణ ప్రజల తెగువను, పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన వీర వనిత చాకలి ఐలమ్మ అని అన్నారు.నాటి తెలంగాణ సాయుధ పోరాట కాలంలో ఆ యోధురాలు ప్రదర్శించిన ధైర్య సాహసాలు, చైతన్యం నేటి తరానికీ ఎంతో స్ఫూర్తి అని చెప్పారు.ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## స్మార్ట్ షాపింగ్ మాల్ ప్రారంభించిన మైనంపల్లి



**తూప్రాన్, సెప్టెంబర్ 10 (జనం సాక్షి) :** వేగంగా అభివృద్ధి చెందుతున్న తూప్రాన్ పట్టణ, పరిసర గ్రామాల ప్రజలకు స్మార్ట్ షాపింగ్ మాల్‌ల ఏర్పాటుతో అతి తక్కువ ధరతో వస్త్రాలు అందుబాటులోకి వస్తాయని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు.బుధవారం తూప్రాన్ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన మూడవ స్మార్ట్ షాపింగ్ మాల్ ను నాయకులు రాష్ట్ర సర్పంచ్ల ఫోరంమాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ చిట్కుల మహిపాల్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్‌లతో కలిసి ప్రారంభించారు. అనంతరం షాప్ ప్రారంభ ఆఫర్ గా 99 రూపాయలకు చీరను ప్రారంభించారు స్మార్ట్ షాపింగ్ మాల్ మరిన్ని బ్రాంచులు ఏర్పాటు చేయాలని కోరుతున్నట్లు ఆయన తెలిపారు. మైనంపల్లి వెళ్లిన అనంతరం ఆఫర్ చీరల కోసం మహిళలు ఒక్కసారిగా షాప్ కు పరుగులు పెట్టారు.భారీగా మహిళలు ఆఫర్ చీరల కొనుగోలుకు వచ్చారు. బట్టల కొనుగోలుకు వచ్చిన మహిళలను నియంత్రించడానికి షాప్ సిబ్బంది నానా తంటాలు పడ్డారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సర్పంచ్లు మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహిపాల్ రెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ కాంగ్రెస్ నాయకులు వెంకటరెడ్డి కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ట్రాన్స్‌జెండర్స్‌ను సమాజం గౌరవించాలి

- సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షులు
- పలుస శంకర్ గౌడ్




**వనపర్తి టౌన్, సెప్టెంబర్ 10 (జనంసాక్షి) :** ట్రాన్జెడర్స్ ను సమాజం గౌరవించాలని, సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ అన్నారు.బుధవారం వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రి అద్వర్యంలో ట్రాంజెడర్స్‌కు ఆటల పోటీని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్ పాల్గొని ఆటల పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా శంకర్ గౌడ్ మాట్లాడుతు ట్రాంజెడర్స్ ను సొసైటీ గౌరవించాలన్నారు. సమాజంలో వారు కూడా మనలో ఒకరిగా గుర్తించాలన్నారు.విద్యా వైద్యం వంటి అన్నీ రంగాల్లో వారిని ప్రోత్సహించాలి అన్నారు. రాజ్యాంగం కుడా వారికీ సముచితమైన హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు.అనంతరం పోటీలలో గెలుపొందిన విజేతలను నిర్వాహకులు ప్రకటించారు. ఆసుపత్రి సిబ్బంది బండారు శ్రీనివాస్,రవీందర్ రెడ్డి, ఉదయ్‌కుమార్, ఇబ్రహీం,ట్రాంజర్స్ అధ్యక్షురాలు రమ్యరెడ్డి, పద్మమ్మ, భాగ్యలక్ష్మి, కవిత, కల్పన, పాల్గొన్నారు.పరుగు పందెంలో మొదటి స్థానంలో జోయా, రెండవ స్థానంలో లక్కీ గెలుపొందారు.ఈనాటి కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది బండారు శ్రీనివాస్,రవీందర్ రెడ్డి, ఉదయ్‌కుమార్, ఇబ్రహీం,ట్రాంజర్స్ అధ్యక్షురాలు రమ్యరెడ్డి, పద్మమ్మ, భాగ్యలక్ష్మి, కవిత, కల్పన తదితరులు పాల్గొన్నారు.

# వీరనారి చాకలి ఐలమ్మ జీవితం స్ఫూర్తిదాయకం

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**మెదక్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 10 (జనం సాక్షి) :** సమాజంలో అన్యాయం, అణచివేతలకు వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ స్ఫూర్తిదాయక జీవితం నేటి తరాలకు మార్గదర్శకమని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. మెదక్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ 40 వ వర్ధంతి కార్యక్రమాన్ని జిల్లా బిసి అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. చిట్యాల చాకలి ఐలమ్మ 40 వ వర్ధంతి పురస్కరించుకుని ఆమె చిత్ర పటానికి కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ నగేష్ కలక్టరేట్ యూనస్ రజక సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీ సంగుస్వామి, బి.సి. సంఘం జిల్లా అధ్యక్షుడు మెట్టు గంగారాం, సహాయ వెనుక బడిన తరగతుల అభివృద్ధి అధికారి గంగా కిషన్, కార్యాలయ సిబ్బందితో కలిసి కలెక్టర్ ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ సాయుధ ఉద్యమ సమయంలో ఐలమ్మ చూపిన ధైర్య సాహసాలు ఎనలేనివి అన్నారు. ఆమె స్ఫూర్తి తో సబ్బండ వర్గాల సంక్షేమం, మహిళా అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. చాకలి ఐలమ్మ సామాజిక సమానత్వం కోసం, అణచివేతకు వ్యతిరేకంగా తన జీవితాన్ని త్యాగం చేసారని అన్నారు. ఐలమ్మ పోరాటం కేవలం ఒక వర్గానికే కాకుండా మొత్తం సమాజానికి స్ఫూర్తిదాయకమని, నేటి యువత ఐలమ్మ ధైర్యసాహసాలను ఆదర్శంగా తీసుకొని సమాజంలో న్యాయం, సమానత్వం నెలకొల్పడానికి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి కార్యాలయ సిబ్బంది, రజక సంఘాల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థి దశలో క్రమశిక్షణ చాలా ముఖ్యం

- వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్



**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 10 (జనంసాక్షి) :** బాలలకు తరగతి గదిలోనే ఉజ్వలమైన భవిష్యత్తు ఉందని,విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ కష్టపడి చదవి, ఉన్నతస్థాయికి ఎదగి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, మాతృభూమికి మంచి పేరు తీసుకరావాలని, జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు.వనపర్తి జిల్లా చిట్యాల గ్రామ శివారులోని మహాత్మ జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలలో వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించి అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ బాలలకు తరగతి గదిలోనే ఉజ్వలమైన భవిష్యత్తు ఉంది అన్నారు. ప్రజలకు చట్టాలు, శిక్షలు సప్రవర్తన పై అవగాహన కల్పిస్తున్నాం అని తెలిపినారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ కష్టపడి చదవాలి, ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు. తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, మాతృభూమికి మంచి పేరు తేవాలి, ప్రజలకు సేవలు అందించే విధంగా ఎదగాలి అన్నారు.చాలా సంత్సరాల క్రితం చదువుకోవడానికి సరియైన వసతులు లేవు ఇప్పుడు పరిస్తితి మారినది ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో అన్ని మౌలిక వసతులు కల్పించి ఉన్నతమైన నాణ్యమైన సాంకేతిక విద్య అందిస్తుంది అన్నారు.ప్రభుత్వ ఉపాధ్యాయులు ఎన్నో నైపుణ్యాలతో విద్యను బోధిస్తున్నారు అన్నారు. విద్యార్థులు మంచి పుస్తకం, మంచి స్నేహితున్ని ఎంచుకుంటే చాలా సాధించవచ్చు అన్నారు. అనంతరం జిల్లా ఎస్పీ విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.ఈ కార్యక్రమంలో వనపర్తి సీఐ, కృష్ణయ్య, వనపర్తి రూరల్ ఎస్సై జలంధర్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు సుందయ్య, రవి,సురేందర్, స్వామి, విద్యార్థులు పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో గ్రామ పాలన అధికారుల నియామకం

- విధుల్లో చేరిన 10 మంది జీపీఓలు

**న్యాల్‌కల్, సెప్టెంబర్ 10 (జనం సాక్షి) :** జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు న్యాల్ కల్ మండలానికి 15 మంది గ్రామ పాలన అధికారులు నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం మధ్యాహ్నం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో 10 గురు "గ్రామ పాలన అధికారులు".. (జిపిఓ) లు విధుల్లో చేరారు. గతంలో నిర్వహించిన వీఆర్ఏ లు పదోన్నతి పై రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో.. వివిధ ప్రభుత్వ శాఖల్లో జూనియర్ సహాయకులుగా విధులు నిర్వహించారు. తాజాగా ప్రభుత్వం జూనియర్ సహాయకులను "గ్రామ పాలన అధికారులు" (జీపీఓ) గా పదోన్నతి కల్పిస్తూ తాజాగా ఉత్తర్వులను జారీ చేశారు. ఈ మేరకు గ్రామాల వారిగా.. గ్రామ పాలన అధికారుల జాబితాను విడుదల చేశారు. మండల కేంద్రమైన న్యాల్ కల్ గ్రామ పాలన అధికారిగా.. సాయిలు, మిర్జాపూర్ (ఎన్) – ప్రకాష్, మిర్జాపూర్ (బి) – అశోక్, ఇబ్రహీంపూర్ – మమ్మద్ ఘఫూర్, చీకుర్తి – చాకలి గణపతి, చాల్కి – పట్లోళ్ల గోరక్ రావ్, హద్నూర్ – సరస్వతి, రత్నాపూర్ – నహీం, రేజింతల్ – అశోక్, మెటల్ కుంట – బి.గోపాల్, మామిడిగి – జే.రాములు, గుంజేటి – సుజాత, డప్పూర్ – అబ్దుల్ మాలిక్, హుస్సెల్లి – బీరప్ప, కల్ బేమల్ గ్రామానికి విష్ణులు పాలన అధికారులుగా నియమితులయ్యారు.

## నోని తోటల సాగు లాభదాయకం

- మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి



**నంగునూరు, సెప్టెంబరు 10 (జనం సాక్షి) :** సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం ముండ్రాయి గ్రామంలో మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి సాగు చేసిన నోని తోటను బుధవారం వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిధిలోని సిరిసిల్ల బీజేఆర్ వ్యవసాయ కళాశాలలో వ్యవసాయ డిగ్రీని చదువుతున్న విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా నోని పంట సాగు చేస్తున్న రైతు, మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డితో మాట్లాడారు. నోని మొక్కలు మలేషియా కేంద్రంగా ఉన్న డీఎక్స్ఎన్ కంపెనీ ద్వారా రైతులకు అందిస్తున్నారని మాజీ ఎంపీపీ శ్రీకాంత్ రెడ్డి విద్యార్థులకు తెలిపారు. రైతులకు ఇది ఆరోగ్యంతో పాటు ఆదాయానికి కూడా కొత్త దారులను తెరుస్తుందని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, బీజేఆర్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు దాక్షాయని, అర్చన, గాయత్రి, హుమా నజం, కాశిఫా సుమయ్యా, అలేఖ్యా రెడ్డి పాల్గొన్నారు. రైతులు కరుణాకర్ రెడ్డి రజినీకర్ రెడ్డి పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఎన్ఆర్ఐ ఆర్థికసాయం



**చేర్యాల, సెప్టెంబర్ 10 (జనంసాక్షి) :** చేర్యాల మండలంలోని ముస్త్యాల గ్రామానికి చెందిన బంగారు నాగవ్వ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా విషయం తెలుసుకున్న గ్రామ తాజా మాజీ సర్పంచ్ పెడతల ఎల్లారెడ్డి వెంటనే ఎన్నారై బాలమణి-ప్రతాప్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వారి సహకారంతో సామాజిక సేవకుడు బండోజు భాస్కర్ చేతుల మీదుగా బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ. 10వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, వారి కుటుంబ సభ్యులు ఉన్నారు.

# మంగళ వాయిద్యాలు మన సంస్కృతికి ప్రతీకలు

- జిల్లా ఎస్పీ రావుల గిరిధర్
- జిల్లా ఎస్పీని ఘనంగా సన్మానించిన నాయిబ్రాహ్మణులు



**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 10 (జనంసాక్షి) :** మంగళ వాయిద్యాలు మన సంస్కృతికి ప్రతీకలని,వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో వనపర్తి జిల్లాలోని నాయిబ్రాహ్మణ సంఘం సభ్యులు వినాయక ఉత్సవాలు సోదరాభావంతో భక్తిశ్రద్ధలతో సాంస్కృతిక కార్యక్రమాలు, బాజ భజంత్రి, చెక్కభజన, కోలాటం, సంప్రదాయ నృత్యాలతో అందరూ భాజ భజంత్రీలతో గణనాథునికి భక్తిశ్రద్ధలతో వినాయక నిమజ్జనాలు సంస్కృతి సంప్రదాయాలను చాటి చెప్పే విధంగా ముగించడానికి కృషిచేసిన జిల్లా ఎస్పి రావుల గిరిధర్ ని జిల్లా నాయి బ్రాహ్మణ సంఘం సభ్యులు శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు.ఈ సంవత్సరం వినాయక నిమజ్జనంలో సంస్కృతి సంప్రదాయాలు చాటి చెప్పే మంగళ వాయిద్యాలు డోలు సన్నాయిలు, కోలాటాలు, చక్క భజనలు చేస్తూ నిమజ్జనం పూర్తి చేయమని ఎస్పీ రావుల గిరిధర్ ఇచ్చిన పిలుపు మేరకు వనపర్తి జిల్లాలోని వినాయక మండప నిర్వాహకులు ఆపిలుపును స్వాగతిస్తూ సంప్రదాయ వాయిద్యాలు డోలు సన్నాయి వాయిద్య కారును గుర్తించి వారిని ఆహ్వానించి నిమజ్జనం పూర్తి చేసినందుకు తమ వాయిద్య కారులను గుర్తించినందుకు వారికి ఆదరణ కల్పించినందుకు జిల్లా ఎస్పీకి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మన సంస్రకృతికి ప్రతీకలైన మంగళ వాయిధ్యాలను ఆ కళాకారులను మనం గౌరవించి ప్రోత్సహించవలసిన బాధ్యత మనందరిపై ఉందని ఆయన తెలియజేశారు. వనపర్తి జిల్లా వ్యాప్తంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు, శోభాయాత్ర, నిమర్జనం కార్యక్రమాలు అత్యంత ప్రశాంత వాతావరణంలో జరిగాయని అన్నారు. ఉత్సవం ఎలాంటిదైనా అన్ని వర్గాల ప్రజలు సోదరాభావంతో భక్తిశ్రద్ధలతో సాంస్కృతిక కార్యక్రమాలు, బాజ భజంత్రి, చెక్కభజన, కోలాటం, సంప్రదాయ నృత్యాలతో శాస్త్రీయంగా జరుపుకున్నారని అన్నారు, అదేవిధంగా మీలా నాయి బ్రాహ్మణులు ఆర్థికంగా ఉపాధి పొందారని,గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఇదే స్ఫూర్తి భవిష్యత్తులో కూడా చూపాలన్నారు.ఈ సందర్భంగా కోరారు. ఉత్సవం ఏదైనా ప్రజలంతా సంతోషంగా నిర్వహించుకోవాలని జిల్లా పోలీస్ శాఖ తరపున పూర్తి భద్రత రక్షణ ఎల్లప్పుడు కల్పించడం జరుగుతుందని అన్నారు. గణేష్ ఉత్సవాల నిర్వహణలో జిల్లా యంత్రాంగానికి, జిల్లా పోలీస్ లకు సహకరించిన ప్రజలకు, ఉత్సవ కమిటీలకు, భక్తులకు, ముఖ్యంగా సమయ స్ఫూర్తి చూపిన యువతకు ఎస్పీ ఈ సందర్భంగా అభినందనలు, ధన్యవాదాలు తెలిపారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏర్పాట్లు చేసిన అన్ని శాఖల అధికారులకు, బందోబస్తు నిర్వహించిన పోలీసు సిబ్బందికి అందరికి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సీఐ, నరేష్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, అప్పలనాయుడు, శ్రీనివాస్, నాయిబ్రాహ్మణ సభ్యులు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పిడుగుపాటుకు ముగ్గురు మృతి



**గద్వాల నడిగడ్డ, సెప్టెంబర్ 10 (జనం సాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లా ఐజలో బుధవారం సాయంత్రం పిడుగుపాటు ప్రమాదంలో ముగ్గురు మరణించగా, మరో ఇద్దరికీ గాయాలయ్యాయి. ఇందుకు సంబంధించి వివరాలు ఐజ మండలం భూమ్ పురం గ్రామంలో తిమ్మప్ప అనే రైతు పొలంలో సీడ్ పత్తి క్రాసింగ్ పనులకు ఐదు మంది కూలీలు వెళ్లారు. సాయంత్రం వర్షం కురవడంతో కూలీలు అందరూ పొలంలో ఉన్న ఒక చెట్టు కిందకు వెళ్లారు. ఆ సమయంలో ఉరుములు, మెరుపులు రావడంతో చెట్టుపై పిడుగు పడింది. ఈ ఘటనలో భూమ్ పురం గ్రామానికి చెందిన సర్వేష్ (19), పార్వతి (28), పులికల్ గ్రామానికి చెందిన సౌభాగ్యమ్మ (45) అక్కడికక్కడే మృతి చెందారు. ఇదే గ్రామానికి చెందిన భార్యాభర్తలు రాజు, జ్యోతికి గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు హుటాహుటిన క్షతగాత్రులను ఐజలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువచ్చారు. అప్పటికే సర్వేశ్, పార్వతి, సౌభాగ్యమ్మ మృతి చెందగా రాజు, జ్యోతికి వైద్య సేవలకి గద్వాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలుస్తుంది. ప్రమాదం జరిగిన వెంటనే సమాచారం అందుకున్న మృతుల కుటుంబీకులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున ఆస్పత్రికి తరలివచ్చి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్నారు. ఘటన స్థలానికి శాంతినగర్ సీఐ టాటా బాబు వారి సిబ్బంది చేరుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి చర్యలు చేపటారు.

# భవన నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జిల్లాలో అంగన్‌వాడి కేంద్రాలు, గ్రామ పంచాయితి భవనాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. బుధవారం ఐడిఓసి కార్యాలయంలో రెవెన్యూ, పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్, మహిళా సంక్షేమ, డిపిఓ, డిఆర్డీఓ, టీడబ్ల్యూ ఐడిసిలతో అంగన్ వాడి, గ్రామ పంచాయతి భవనాల నిర్మాణ ప్రగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భవన నిర్మాణాల్లో లోపాలు లేకుండా చూడాలని, నాణ్యతతో పాటు వేగం కూడా పెంచాలని సూచించారు. పనుల పురోగతి వివరాలను సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణంలో వేగం పెంచాలని, కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు. భవన నిర్మాణ పనులు పూర్తయ్యేలా కృషి చేయాలని చెప్పారు. పంబాపూర్ ప్రాథమిక పాఠశాల అవరణలో అంగన్ వాడి భవన నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మరుగుదొడ్ల నిర్మాణంలో జాప్యం జరగడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. అంగన్ వాడి, వైద్య, పాఠశాలల్లో మరమ్మతులు చేపట్టేందుకు ఇంజినీరింగ్ అధికారులు ప్రతిపాదనలు ఇవ్వాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, డిఆర్డీఓ బాలకృష్ణ, పీఆర్ ఈఈ వెంకటేశ్వర్లు, మహిళా సంక్షేమ అధికారి మల్లీశ్వరి, డివిజనల్ పంచాయతి అధికారి వీరభద్రయ్య, టిజి డబ్ల్యూఐడిసి డిఈ జీవన్ తదితరులు పాల్గొన్నారు.

# సాయుధ పోరాటానికి విప్లవాగ్నిని రగిలించిన వీరనారి చిట్యాల ఐలమ్మ

- వృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్, టిఆర్వీఎస్ జిల్లా కార్యదర్శి అశోక్, సారయ్య.
- రజక వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో ఐలమ్మ 40వ వర్ధంతి సభ




**తొర్రూరు, సెప్టెంబర్ 10 (జనం సాక్షి) :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి విప్లవాగ్ని తగిలించిన దేశాన్ని వీరనారి చిట్యాల (చాకలి) ఐలమ్మ అని చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ బొల్లం అశోక్, తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం (టిఆర్వీఎస్) జిల్లా కార్యదర్శి పున్నం సారయ్య లు అన్నారు. బుధవారం తొర్రూరు పట్టణ కేంద్రంలోని అమరవీరుల స్థూపం వద్ద చాకలి ఐలమ్మ 40వ వర్ధంతి కార్యక్రమం రజక వృత్తిదారుల సంఘం మండల అధ్యక్షుడు నిమ్మల సోమయ్య అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగ, వృత్తి, ప్రజా, కార్మిక సంఘాల నాయకులు పాల్గొని ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బొల్లం అశోక్, పున్నం సారయ్య లు మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ జీవిత విప్లవ కాంతితో నిండిపోయిందని అన్నారు. 1919లో వరంగల్ జిల్లా రాయపర్తి మండలం కిష్టాపురంలో జన్మించిన ఐలమ్మ, వ్యవసాయం చేస్తూనే దొరల పెత్తనానికి వ్యతిరేకంగా గళమెత్తారని...ఈ భూమి నాది, పంట నాది, దొర ఎవడు తీసుకెళ్లడానికి..? అని దొరలకు ఎదురు తిరిగి రైతాంగానికి స్ఫూర్తినిచ్చిన వీర వనిత ఐలమ్మ అని కొనియాడారు. ఐలమ్మ ఇల్లు పాలకుర్తిలో ఉద్యమ కార్యకలాపాలకు కేంద్రంగా మారిందన్నారు. భర్త, కుమారులు జైలు పాలైనా వెనక్కి తగ్గకుండా కుటుంబాన్ని మొత్తం ఉద్యమానికి అంకితం చేసిన మహనీయురాలు అని అన్నారు. 1985 సెప్టెంబర్ 10న ఆమె మరణించినా పోరాట స్ఫూర్తి, ఆత్మస్థైర్యం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని తెలిపారు. నేటి యువత ఐలమ్మ ఉద్యమ స్ఫూర్తితో వీర తెలంగాణ సాయుధ పోరాటాన్ని వక్రీకరిస్తున్న మతోన్మాద పార్టీ పై ఉద్యమాలకు సిద్ధం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో తొర్రూరు పట్టణ అధ్యక్షుడు చింతల మధు, మండల కార్యదర్శి పొడగంటి శేఖర్, పట్టణ కార్యదర్శి చింతల రాజు, పట్టణ ఉపాధ్యక్షుడు ఓరుగంటి ప్రవీణ్, జిల్లా నాయకులు ఓరుగంటి సైదులు, రాపోలు సుదర్శనం, మచ్చ యాకయ్య, మండల నాయకులు మడిపెద్ది కార్తీక్, ప్రవీణ్, మచ్చ దేవేందర్, ఓరుగంటి సాగర్, శ్రీను, కృష్ణ, నాగరాజు, సుధాకర్, విశ్రాంత ఉద్యోగ నాయకులు బందు నారాయణ, వెంకటాచారి, ప్రజా, వృత్తి, కుల, కార్మిక సంఘాల నాయకులు రాయిశెట్టి ఉపేందర్, వెల్తురు పూర్ణచందర్, కొమ్మనబోయిన యాకయ్య, దొమ్మటి సోమయ్య, డోనక దర్గయ్య, జమ్మల శ్రీను, చిల్లా కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

### సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో..

తెలంగాణ సాయుధ పోరాట వీరనారి చిట్యాల ఐలమ్మ 40వ వర్ధంతి సందర్భంగా స్థానిక పట్టణ కేంద్రంలోని గాంధీ సెంటర్లో సిపిఎం పార్టీ తొర్రూరు మండల కార్యదర్శి ఎండి యాకూబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వర్ధంతి సభలో ఐలమ్మ చిత్రపటానికి వృత్తి ప్రజాసంఘాల నాయకులు పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి జిల్లా కమిటీ సభ్యులు ఎండి యాకూబ్, బొల్లం అశోక్ లు మాట్లాడుతూ భూమి భుక్తి వెట్టి చాకిరీ విముక్తి, బాంచన్ దొర నీ కాల్మొక్త గడీల పాలనకు చరమగీతం పాడిన వీరనారి చిట్యాల ఐలమ్మ పోరాటం నైజాం రాజుల పాలనను అర్థం చేసి తెలంగాణ ఏర్పాటు చేయడంలో ఐలమ్మ చూపిన తెగువతోనే సాధించడం జరిగిందని అన్నారు. రైతాంగ సాయుధ పోరాటం వీర తెలంగాణ పోరాటం కమ్యూనిస్టుల ఆధ్వర్యంలోనే జరిగిందని అన్నారు. ఇది ముమ్మాటికీ కమ్యూనిస్టులు సాధించిన ఘనవిజయమని తెలిపారు. మతతత్వ ఆర్ఎస్ఎస్ బిజెపి పార్టీ నాడు జరిగిన సాయుధ పోరాటం హిందువులకు ముస్లింలకు జరిగిన పోరాటంగా చిత్రీకరిస్తూ ప్రజలను నమ్మించేందుకు పూనుకుందని ఇలాంటి ఘటనలను ఐలమ్మ స్ఫూర్తితో తిప్పి కొట్టి సాయుధ పోరాటం అంటే కమ్యూనిస్టులదేనని ప్రజలకు తెలియజేసే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. సాయుధ పోరాట ఉత్సవాలలో భాగంగా ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ప్రారంభించిన సాయుధ పోరాట వారోత్సవాలు 17 వరకు నిర్వహించడం జరుగుతుందని ఈ సాయిధ పోరాట వారోత్సవాలు ప్రతి గ్రామ గ్రామాన నిర్వహించి సాయుధ పోరాట విషయాలను ప్రజలకు తెలియజేసి మతతత్వ పార్టీలకు బుద్ధి చెప్పాలని అన్నారు.

## పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు

# సొంతింటి కళ సాకారం

- విడుతల వారీగా ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు
- ఇందిరమ్మ ఇండ్ల భూమి పూజ కార్యక్రమం లో మంత్రి ధనసరి అనసూయ సీతక్క



**ములుగు ప్రతినిధి, సెప్టెంబర్ 10(జనంసాక్షి) :** ములుగు మండలం మదనపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల భూమి పూజ క్రమములో పాల్గొని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల ద్వారా ప్రతి నిరుపేద కుటుంబానికి గృహ నిర్మాణానికి రూ 5 లక్షల నిధులను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది. ఆడబిడ్డలు, పేద కుటుంబాల భవిష్యత్తు కోసం ఈ పథకం ప్రారంభించాం, పేదల జీవితాల్లో వెలుగులు నింపేలా ఇంటి కలను సాకారం చేస్తాం అని హామీ ఇచ్చారు. ప్రభుత్వం తీసుకుంటున్న సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలు నమ్మకాన్ని ఉంచాలని సూచించారు. ఇప్పటికే 6 వేల ఇళ్లను మంజూరు చేశామని ఇంకా రాబోయే రోజుల్లో విడుతల వారీగా పేదలకు ఇళ్లు మంజూరు చేస్తామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్, ములుగు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి తో పాటు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జిల్లా బ్లాక్ మండల గ్రామ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కెటిపిపిలో ప్రమాదం



- వాటర్ సంపులో పడి ప్రమాదవశాత్తు ఆర్టిజన్ కార్మికుడు మృతి

**గణపురం, సెప్టెంబర్10 (జనం సాక్షి):** మండలంలోని కాకతీయ థర్మల్ విద్యుత్ కేంద్రం కెటిపిపి లో ప్రమాదం జరిగింది. ప్రమాదంలో భూపాలపల్లి మండలం కొంపెల్లి గ్రామానికి చెందిన తూండ్ల సురేష్ (34) వాటర్ సంపులో పడి మృతి చెందాడు. గణపురం ఎస్ఐ రేఖ అశోక్ కథనం ప్రకారం గత 15 సంవత్సరాలుగా చెల్పూర్ కేటీపిపి లో గ్రేడు ఆర్టిజన్ కార్మికునిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో నైట్ షిఫ్ట్ డ్యూటీ చేయడానికి వెళ్లిన క్రమంలో డ్యూటీలో భాగంగ రాత్రి సమయంలో వాటర్ సంపు లోని వాటర్, బాటం యాష్ లెవెల్ చూస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారీ వాటర్ సంపు లో పడి మృతి చెందడం జరిగిందని. ఎస్ఐ తెలిపారు మృతునికి ఈత రాకపోవడంతో మృతి చెందాడని మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రేఖ అశోక్ తెలిపారు ప్రారంభించారు. సురేష్ కు కుమారుడు కుమార్తె ఉన్నారు.

# మహేష్ మృతిపై చర్యలు తీసుకుంటున్నాం

- జోలెలు పట్టి పైసలు వసూలు చెయ్యడం సిగ్గు చేటు.
- శవ రాజకీయాలకు బ్రాండ్ అంబాసిడర్ బిఆర్ఎస్ పార్టీ
- మైదం మహేష్ కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందించిన మంత్రి సీతక్క.

**ములుగు ప్రతినిధి, సెప్టెంబర్ 10(జనంసాక్షి) :** ములుగు మున్సిపాలిటీ లో శానిటేషన్ వర్కర్ గా పని చేస్తూ ఈ నెల 3న మైదం మహేష్ పురుగుల మందు తాగి మరణించగా పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క మృతుని చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. వారి ముగ్గురి పిల్లల మీద 4 లక్షల రూపాయల ఫిక్స్ డిపాజిట్ లను వారి కుటుంబ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, మైదం మహేష్ మృతిని తమ స్వార్థ రాజకీయాల కోసం వాడుకొని బిఆర్ఎస్ పార్టీ నాయకులు రాజకీయాలు చేయడం సరికాదన్నారు. మహేష్ మృతికి గల కారణాలు తెలుసుకొని మృతికి కారకులైన వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవడం జరిగినదని కావాలని ప్రభుత్వం పై బురద చల్లాలని బిఆర్ఎస్ పార్టీ నాయకులు దందాలు చేసే నాయకులు జోలెలు పట్టుకొని ఆదుకోవడం బాధాకరం అని ఇలాంటి చిల్లర రాజకీయాలు మానుకుంటే మంచిదని శవ రాజకీయాలతో ప్రజలను మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. మీరు చేస్తుంది మహేష్ మీద వారి కుటుంబం మీద ప్రేమ తో కాదని ఓట్ల కోసం నోట్లు వసూలు చేస్తున్నారని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. మృతుని కుటుంబానికి న్యాయం చేస్తామని మంత్రి సీతక్క తెలిపారు. అదే విధంగా ములుగు మండలం మదనపల్లి గ్రామానికి చెందిన దూడపాక మహేందర్ ఇటీవలే మరణించగా వారి చిత్ర పటం వద్ద నివాళులర్పించి వారి కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి తో పాటు ములుగు మున్సిపాలిటీ అధికారులు మరియు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జిల్లా, బ్లాక్, మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా సమస్యలపై కలెక్టర్‌కు వినతి

- భారీ ర్యాలీ నిర్వహించిన బిజెపి నాయకులు



**ములుగు ప్రతినిధి, సెప్టెంబర్ 10(జనంసాక్షి) :** జిల్లా కేంద్రం లోని బీజేపీ అధ్యక్షులు సిరికొండ బలరాం ఆధ్వర్యంలో బుధవారం జిల్లా స్థానిక సమస్యల పరిష్కారానికి కొరకు కలెక్టర్ కి వినతిపత్రం అందజేసి, భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాజీ పార్లమెంటు సభ్యులు అజ్మీరా సీతారాం నాయక్ పాల్గొని ర్యాలీని ఉద్దేశించి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు హామీలు అమలు కాని హామీలతో గద్దెపైకి వచ్చిన ప్రభుత్వమే రేవంత్ రెడ్డి సర్కార్ అని ధ్వజమెత్తారు. ఎన్నడూ లేని విధంగా తక్కువ కాలంలోనే ప్రజా వ్యతిరేకత ఎదుర్కొంటున్న ప్రభుత్వం ఇదేనని విమర్శించారు. ప్రజల సమస్యలు పరిష్కరించ కుండా, హామీలు నెరవేర్చకుండా, ప్రజాధనం వృధా చేస్తూ ఆర్భాటాలు చేస్తున్నారని ఆయన తీవ్రంగా మండిపడ్డారు. ములుగు జనరల్ హాస్పిటల్ లో కనీస సౌకర్యాలు లేకపోవడం, మందులు, ల్యాబ్ పరీక్షల కొరత తీర్చాలని, రైతులకు యూరియా, పురుగు మందుల సమస్యలు, దందాలు ఆపాలని డిమాండ్ చేశారు. ఏటూరునాగారం మండలం కొండాయి గ్రామం వద్ద వంతెన నిర్మాణం తక్షణం చేపట్టాలని, గోదావరి వరదల నియంత్రణకు కరకట్ట నిర్మాణం అవసరం, ఏటూరునాగారం రెవెన్యూ డివిజన్ ఏర్పాటు, దేవాదుల పైప్ ద్వారా చెరువులకు సాగునీరు, తాగునీరు కల్పించాలని, ములుగు మునిసిపాలిటీ లో టాయిలెట్లు, పార్కులు, ట్రాఫిక్ సిగ్నల్, డ్రైనేజీ, సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలి, పూర్తి స్థాయి సిబ్బంది నియమించాలి. మేడారం జాతర పనులు నాణ్యతగా, పారదర్శకంగా జరగాలని, రైతులకు ముందుగానే పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పంట నష్టపోయిన రైతులకు పరిహారం, సన్నవడ్ల బోనస్ వెంటనే ఇవ్వాలి. జిల్లా సమస్యలు పరిష్కరించక పోతే బీజేపీ ప్రజా ఉద్యమాలతో ఆందోళనలు చేపడతామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చింతలపూడి భాస్కర్ రెడ్డి, అజ్మీరా కృష్ణవేణి నాయక్, ఎస్టీ మోర్చా ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్, భూక్యా రాజ్ కుమార్, ఎస్టీ మోర్చా అధికార ప్రతినిధి గుగులోతు స్వరూప, జిల్లా ప్రధాన కార్యదర్శులు శ్రీలమంతుల రవింద్రాచారి, జాడి వెంకట్, జిల్లా ఉపాధ్యక్షులు జినుకల కృష్ణాకర్ రావు, ఏనుగు రవిందర్ రెడ్డి, మేడిశెట్టి ఓమ్రా, మద్దినేని తేజ రాజు, అల్లె శోభన్, జిల్లా కార్యదర్శి కొత్త సుధాకర్ రెడ్డి, చందా జ్యోతి, ఈక మహాలక్ష్మి జిల్లా కోశాధికారి గంగిశెట్టి రాజ్ కుమార్, మండల అధ్యక్షులు రాయంచు నాగరాజు, పైడాకుల మల్లేశ్, మార్కసతీష్, తాళ్లపల్లి లక్ష్మణ్, రావుల జానకిరాం, దుర్గం సమ్మక్క, సుమలత, పల్ల బుచ్చయ్య, ఇమ్మడి రాకేశ్ యాదవ్, గాధం కుమార్, రవి రెడ్డి, వైదుగుల తిరుపతి రెడ్డి, జాడి దిలీప్, శ్యాం ప్రసాద్, డ్యాగల సలేందర్, లాకావత్ రాజ్ కుమార్, కుక్కల పవన్, సాంబయ్య, వినోద్, ప్రవీణ్ చారి, శివరాం నాయక్, కత్తి హరీశ్, బైకాని మహేందర్ పాపిరెడ్డి, మేక రాజు తదితరులు పాల్గొన్నారు.

# భూమి కోసం తల్లి హత్య

- భర్తతో కలిసి ఘాతుకం • పెద్దతండా (కే)లో ఘటన



**పాలకుర్తి, సెప్టెంబర్ 10 (జనంసాక్షి) :** నవ మాసాలు మోసి అల్లారు ముద్దుగా పెంచుకున్న కన్న కూతురు భూమి కోసం కన్న తల్లిని హత్య చేసింది. మానవత్వాన్ని మంటగలిపింది. తల్లి పేరిట ఉన్న 20 గుంటల భూమిని తనకు పట్టా చేయడం లేదనే కక్షతో భర్తతో కలిసి తల్లిని హత్య చేసిన అమానుష ఘటన బుధవారం జనగాం జిల్లా, పాలకుర్తి మండలం, పెద్దతండా (కే) గ్రామంలో జరిగింది. సీఐ జానకీరాంరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జనగాం జిల్లా పాలకుర్తి మండలం పెద్దతండా (కే) చెందిన బాదావత్ లక్ష్మీ (42) వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగిస్తుంది. ఆమె భర్త తిరుపతి గత 15 సంవత్సరాల క్రితం మృతి చెందాడు. ఈ దంపతులకు సంగీత ఏకైక సంతానం ఈమెను ఐదేండ్ల క్రితం ఇదే మండలంలోని దుబ్బతండా (ఎస్పీ) గ్రామానికి చెందిన బానోతు వీరన్నతో వివాహం చేశారు వివాహ సమయంలో సంగీతకు వరకట్న, బంగారం ఇచ్చి పెళ్లి చేసింది. లక్ష్మీ పేరిట ఉన్న 20 గుంటల వ్యవసాయ భూమి ఉంది. దానిపై కుమార్తె సంగీత కన్నుపడింది. పలు మార్లు పట్టా చేయాలని తల్లిని అడిగింది. దానికి ఆమె నిరాకరించింది. దీంతో ఎలాగైన ఆ భూమిని దక్కించుకోవాలని దురుద్దేశ్యంతో తల్లిని హత్య చేయాలని స్కెచ్ చేసింది. ఈ విషయాన్ని భర్తతో చర్చించింది. ఇరువురు హత్య చేయాలని నిర్ణయం తీసుకొని మంగళవారం రాత్రి పెద్దతండాకు చేరుకొని నిద్రలో ఉన్న తల్లిని కూతరు సంగీత. అల్లుడు వీరన్న ఇద్దరు కలిసి మొఖంపై దిండు పెట్టి బలవంతంగా హత్య చేశారు. కూలీ పని కోసం పిలవడానికి వెళ్లిన మహిళ చూసి తండావాసులకు తెలపడంతో పోలీసులకు సమాచారం అందించినట్లు తెలిపారు. మృతి ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జానకీరాంరెడ్డి తెలిపారు.

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- రూ.5.75 తో సామాజిక ఆస్పత్రి భవన నిర్మాణానికి శంకుస్థాపన
- భారీ వర్షాలతో నష్టపోయిన రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటాం
- నష్టపోయిన రైతుల పంటల నివేదికను వెంటనే పంపాలని అధికారులకు ఆదేశం
- రాష్ట్ర ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



**ముధోల్ , సెప్టెంబర్ 10( జనం సాక్షి)బాసరలో** నూతన ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి రాష్ట్ర ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖల మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు బుధవారం శంకుస్థాపన చేశారు. ఎంపీ గోడం నగేష్, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌తో కలిసి ఆయన కార్యక్రమంలో పాల్గొన్నారు. సుమారు రూ.5.75 కోట్ల వ్యయంతో 30 పడకల ఆసుపత్రిని నిర్మించనున్నట్టు మంత్రి తెలిపారు. ఆసుపత్రి పూర్తయితే బాసర ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. అనంతరం మంత్రి జూపల్లి భారీ వర్షాల వల్ల బాసర పరిసరాల్లో నష్టపోయిన పంట చేనులను పరిశీలించారు. రైతులతో మాట్లాడి పంట వివరాలు, పెట్టుబడి పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. పంట నష్టపోయిన ప్రతి రైతుకు తప్పక నష్టపరిహారం అందజేస్తామని భరోసా ఇచ్చారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతుల వివరాలు, నివేదికలు త్వరితగతిన అందజేయాలనీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీర సంకేత్ కుమార్, డీఎంహెచ్వో రాజేందర్, వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్, అదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గడెం నగేష్, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సలహాదారులు కేంద్ర మంత్రివర్యులు సముద్రాల వేణుగోపాల చారి, ఎమ్మెల్సీ దండేవిటల్, రాష్ట్ర మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, ముధోల్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యేలు నారాయణరావు పటేల్, జి. విట్టల్ రెడ్డి, భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనందరావు పటేల్, తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

జనంసాక్షి www.janamsakshi.org | గురువారం 11 సెప్టెంబర్ 2025

# విద్యార్థినులు ప్రావీణ్యం ఉన్న అంశంపై సాధన చేయాలి

- ప్రతి ఒక్కరికీ మంచి ఆశయం, లక్ష్యం ఉండాలి
- బాలికలు అన్ని అంశాల్లో రాణించాలి
- కోదాడ డి.ఎస్.పి శ్రీధర్ రెడ్డి



**హుజూర్‌నగర్, సెప్టెంబర్ 10 (జనంసాక్షి) :** పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమంలో భాగంగా హుజూర్ నగర్ పట్టణంలో మైనారిటీ గర్ల్స్ కళాశాల నందు మహిళల, విద్యార్థినిలు, బాలికల రక్షణ చట్టాలు గురించి కోదాడ డిఎస్పి శ్రీధర్ రెడ్డి అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో హుజూర్ నగర్ సిఐ చరమంద రాజు, ఎస్సై మోహన్ బాబు లు పాల్గొన్నారు. బుధవారం జిల్లా పోలీస్ కళాబృందం పాల్గొని సామాజక అంశాలు, షి టీమ్స్, మంచి అలవాట్ల గురించి పాటలు పాడి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కోదాడ డీఎస్పీ శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి చదువు చాలా విలువైనది ప్రపంచంలో చదువుతోనే విజ్ఞానం వెలుగొందుతుంది అన్నారు. మనకు విజ్ఞానాన్ని, తెలివిని పాఠశాల నేర్పిస్తుందన్నారు. బాగా చదివి ప్రయోజకులు కావాలి, సదుపాయాలను సద్వినియోగం చేసుకుని లక్ష్యం కోసం నిరంతరం కృషి చేయాలని అన్నారు. అవకాశాలు లేని రోజుల్లో మంచి విజయాలు సాదించిన గొప్పవాళ్ళు ఉన్నారు. అలాంటి వారి విజయగధాలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. బాలికలు కష్టపడి చదివి ఉన్నతస్థాయికి చేరాలన్నారు. సమాజంలో ఎన్నో రుగ్మతలు ఉన్నాయి వాటి నిర్మూలనకు చదువు మార్గం అన్నారు. ప్రావీణ్యం ఉన్న అంశంలో కృషి చేయాలి, ఆటలు ఆడాలి. శారీరకంగా ధృఢంగా ఉండాలి అని కోరారు. భేటీ బచావో – భేటీ పడావో నినాదంతో బాలికల అభ్యున్నతికి ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. బాలికలను ఎదగనివ్వాలి అని అన్నారు. బాల్య వివాహాలు చేయవద్దు అని కోరారు. విద్యార్థులు చిన్నచిన్న సమస్యలకు ఒత్తిడికి లోనై, ఆకర్షణలకు లోనై బంగారు జీవితాన్ని భవిష్యత్తుని నాశనం చేసుకోవద్దు, ఆత్మహత్య లాంటివి చేసుకోవద్దు అని కోరారు. చెడు అలవాట్లకు లోను కావద్దు. మంచి పుస్తకాలను, మంచి స్నేహితులను ఏర్పాటు చేసుకోవాలి, కష్టపడి చదివి తల్లిదండ్రులకు, చదువు చెప్పిన గురువులకు, పాఠశాలకు మంచి పేరు తేవాలని కోరారు. ఏ రకంగా నైనా వేధింపులు జరుగుతున్న తెలిసినవాళ్లు, బంధువులు, ఎవరైనా చెడు బుద్ధితో శరీరాన్ని తాకుతున్నట్లు గ్రహించిన వెంటనే తల్లిదండ్రులకు, గురువులకు తెలియజేయాలి. ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలి అని అన్నారు. ప్రస్తుత సమాజంలో సైబర్ మోసాలు, మాదకద్రవ్యాలు అతిపెద్ద సమస్యగా ఉన్నాయని వీటిపై విద్యార్థులు ఫ్రంట్ వారియర్స్ లాగా పనిచేసే పెద్దలకు అవగాహన కల్పించాలని సూచించారు. సామాజిక మాధ్యమాలలో వచ్చే వాటికి ప్రభావితం కావొద్దు అని ఇంటర్నెట్ నుంచి జ్ఞాన సముపార్జనకు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రెహనా, ఉపాధ్యాయులు శైలజ, నస్రిన్, స్వప్న, దివ్య, పుష్ప, కళ్యాణి, పావని, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## రేషన్ దొంగలపై పీడీ యాక్ట్

- పౌర సరఫరాల శాఖ ఎన్ఫోర్స్మెంట్ డిటీ మాచన రఘునందన్



**మర్రిగూడ, సెప్టెంబర్ 10 (జనం సాక్షి) :** రేషన్ బియ్యం అక్రమ రవాణా కు అలవాటు పడిన వారి పై పిడి యాక్ట్ నమోదు చేస్తున్నట్టు, పిడి ఎస్ కేసుల్లో ఎక్కువ మార్లు పట్టుబడిన వాహనాల జప్తు కు సైతం సిఫారసు చేస్తానని పౌర సరఫరాల శాఖ ఎన్ఫోర్స్మెంట్ డిప్యూటీ తాశిల్దార్ మాచన రఘునందన్ హెచ్చరించారు. కొందరు రేషన్ బియ్యం అక్రమార్కులు రంగారెడ్డి జిల్లా నుంచి వచ్చి నాంపల్లి పరిసర ప్రాంతాల్లో రేషన్ బియ్యం అధిక ధరకు కొనుగోలు చేసే దందా చేస్తున్నారని చెప్పారు. ఒకే వాహనాన్ని ఎక్కువ మార్లు రేషన్ బియ్యం అక్రమ రవాణా కు ఉపయోగిస్తే ఆ వాహనం నడిపిన వ్యక్తి లైసెన్స్ రద్దు కు సిఫారసు చేస్తానని మాచన రఘునందన్ హెచ్చరించారు. సన్న బియ్యం ను కూడా కొంతమంది వద్ద అధిక ధరకు కొని అమన్ గల్, కడ్తాల్ మీదుగా..మహేశ్వరం, శంషాబాద్ , హైదరాబాద్ కు తరలించి సొమ్ము చేసుకునే ప్రయత్నం చేస్తున్నారని రఘునందన్ ఆక్షేపించారు. ఈ అక్రమ రవాణా కు పటిష్ట నిఘా తో చెక్ పెట్టనున్నట్టు వివరించారు.

## పిడుగు పడి గిరిజన రైతుకు తీవ్ర గాయాలు



**కామేపల్లి, సెప్టెంబర్ 10 (జనం సాక్షి) :** ఏజెన్సీ ప్రాంతమైన కామేపల్లి మండలంలోని కొమ్మినేపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని మిర్చి తోటలో పిడుగు పడి అదే గ్రామానికి చెందిన గిరిజన వ్యవసాయ రైతు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి కొమ్మినేపల్లి గ్రామానికి చెందిన గిరిజన రైతు గూగులోత్ బావ్ సింగ్ (40) తన మిర్చి తోటలో బుధవారం కూలీలతో సగు మిర్చిమొక్కలు వేయిస్తుండగా ఉరుముల మెరుపులతో ఈదురు గాలులతో వర్షం వచ్చింది. ఇంటికి వద్దామని చేను నుండి వస్తుండగా అతని సమీపంలో పిడుగు పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే అతనిని 108 వాహనం లో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్నాడు. అని గ్రామ ప్రజలు తెలిపారు.

# ఉపాధ్యాయ వృత్తి చాలా గొప్పది

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, సెప్టెంబర్ 10 (జనంసాక్షి) :** సమాజంలో గురు శిష్యుల బంధం ఎంతో పవిత్రమైనదని, విద్యార్థులకు సరైన విద్యాబుద్ధులు నేర్పి భవిష్యత్తులో సత్ప్రవర్తన కలిగిన పౌరుడిగా తీర్చిదిద్దటంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైనదని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ లో నిర్వహించిన గురుపూజోత్సవం 2025 కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణ ఉపాధ్యాయులుగా ప్రయాణం మొదలుపెట్టి రాష్ట్రపతిగా, ఉపరాష్ట్రపతిగా, యూనివర్సిటీ వైస్ ఛాన్సెలర్ గా ఎన్నో గొప్ప పదవులు పొందారని, వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. జిల్లాలో ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచారని, నాణ్యమైన విద్యను అందిస్తున్నారని అన్నారు. పదో తరగతి ఫలితాల్లో కూడా ఈ సంవత్సరం రాష్ట్ర స్థాయిలో ముందంజలో ఉంచేందుకు కృషి చేస్తున్నారని ప్రోత్సహించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించేందుకు ఎప్పటికప్పుడు సామర్థ్యాలు పెంచుకొని, నూతన బోధన పద్ధతులు నేర్చుకొని విద్యార్థులను నవీన సాంకేతిక వైపు ఆలోచించేలా తయారు చేయాలని అన్నారు. విద్యార్థులు నిజజీవితంలో సైన్స్ యొక్క ఉపయోగాలు తెలుసుకొని ఆవిష్కారణాత్మక ఆలోచనల వైపు ముందడుగు వేసే విధంగా అప్లికేషన్ మెథడాలజీని ఉపాధ్యాయులు ఉపయోగించుకోవాలని సూచించారు. చదువులో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి వారిని ముందంజలోకి తీసుకొని రావాలని పేర్కొన్నారు. విద్యార్థులకు ఏదైనా ఒక సబ్జెక్టు పై ఆసక్తి ఉంటే వారిని ఆ సబ్జెక్టుపై పూర్తి అవగాహన తెచ్చుకునే విధంగా తయారు చేయాలని సూచించారు. ఉపాధ్యాయ వృత్తి సమాజంలో చాలా గొప్పదని జిల్లాను ప్రగతి పథంలో నడిపేందుకు ఉపాధ్యాయులు అహర్నిశలు కష్టపడుతున్నారని వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో ఎంపికైన 40 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం చేసి ప్రశంస పత్రాలు, మెమోరాండం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, కో ఆర్డినేటర్లు శ్రావణ్ కుమార్, రాంబాబు, పూలమ్మ, జాతీయ అవార్డు గ్రహీత మారం పవిత్ర, రాష్ట్ర అవార్డు గ్రహీతలు చత్రు నాయక్, యల్లయ్య, మండల విద్యాధికారులు, హెడ్మాస్టర్లు, ఉపాధ్యాయులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# టేకులపల్లి మండలంలో కుండపోత వర్షం

- పత్తి, వరి పొలాల్లో ముంచెత్తిన వరద
- పలు గ్రామాల్లో ఇళ్లల్లోకి వరద నీరు
- పొంగిన వాగులు, వంకలు, తెగిన రోడ్లు



**టేకులపల్లి, సెప్టెంబర్ 10 (జనంసాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలంలో బుధవారం మధ్యాహ్నం అకస్మాత్తుగా కురిసిన భారీ వర్షానికి (కుండపోత) దీంతోపాటు పిడుగుల మోతతో భయంకరమైన మెరుపులతో టేకులపల్లి మండలంలో వర్ష బీభత్సం సృష్టించింది. పంట పొలాల్లో ఉన్న రైతులు, కూలీలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ఇళ్లకు చేరుకున్నారు. గంటన్నరగా కురిసిన కుండపోత వర్షానికి ఎక్కడికక్కడ వరి పొలాలు కనపడకుండా నీటిమయంగా మారిపోయాయి. ఏపుగా ఎదిగిన పత్తి చేలు వరదలు మూలాన నేలకొరిగాయి. ఇప్పుడిప్పుడే పత్తి పంట పూతకాతదశలో ఉండడంతో రైతుల ఆశలు ఈ వర్ష బీభత్సానికి నిరాశకు గురయ్యారు. ఇకపోతే మండలంలోని వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. చెరువులో అలుగులు పోస్తున్నాయి. టేకులపల్లి నుండి ముత్యాలంపాడు కు వెళ్లే బీటీ రోడ్డు ఏ కాలనీ సమీపంలో స్మశాన వాటిక దగ్గర రోడ్డు కొట్టుకుపోయింది. అదే రోడ్డు తూర్పు గూడెం నుండి బేతంపూడి రైల్వే స్టేషన్ వెళ్లే మార్గం మధ్యలో లెవెల్ వాగు ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిపివేశారు. రానున్న రోజుల్లో మరింతగా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ హెచ్చరికలు జారీ చేయడంతో పంటలు పూర్తిగా దెబ్బతినే అవకాశాలు ఉండడంతో రైతాంగం ఆందోళన చెందుతున్నారు. వరదల కారణంగా డొంక రోడ్లన్నీ పూర్తిగా జలమయమై, అక్కడక్కడ కోతలకు గురై రైతులు పంట పొలాలకు వెళ్లే పరిస్థితులు అధ్వానంగా మారడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

## సమాజంలో మార్పు తెచ్చేందుకు కృషి చేయాలి

**సూర్యాపేట ప్రతినిధి, సెప్టెంబర్ 10 (జనంసాక్షి) :** ప్రభుత్వ ఉద్యోగులు సమాజంలో మార్పు తెచ్చేందుకు కృషి చేయాలని తదుపరి జిల్లా, రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతాయని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ లో నిర్వహించిన వీరనారి చాకలి ఐలమ్మ 40వ వర్ధంతి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ పాల్గొని చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతాంగ పోరాటంలో భాగంగా అన్యాయానికి వ్యతిరేకంగా ధైర్యంగా నిలబడి చాకలి ఐలమ్మ పోరాటం చరిత్రలో నిలబడిపోతుందని అన్నారు. ఆమె త్యాగాలు, పోరాట స్ఫూర్తి భావితరానికి దిశానిర్దేశం చేస్తాయని అన్నారు. గతంలో సమాజంలో ఎలాంటి పరిస్థితులు ఉన్నాయో వాటి నుంచి బయటికి రావటానికి మహనీయులు ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేశారని అట్టి విషయాలు భావితరాలకు తెలుపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిబిసిడిఓ నరసింహారావు, డిపిఓ యాదగిరి, ఎస్సీడీఓ దయానందరాణి, టీఎన్జీవో సెక్రటరీ దున్న శ్యామ్, బీసీ సంఘం నాయకులు చల్లమల్ల నరసింహ, బంటు కృష్ణ, మల్లికార్జున్, వెంకటేశ్వర్లు, లక్ష్మయ్య, పద్మ, శ్రీదేవి, ఎంఆర్పిఎస్ నాయకులు చిన్న శ్రీరాములు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## పట్టుబడిన 25మోటార్ సైకిల్

- కర్నూల్ పోలీస్ అదుపులో నిందితుడు జస్వంత్



**మల్దకల్, సెప్టెంబర్ 10 (జనంసాక్షి) :** గద్వాల్ జోగులాంబ గద్వాల్ జిల్లా మల్దకల్ మండలం అమరవాయి గ్రామంలో దొంగలించిన మోటార్ సైకిల్ బుధవారము కర్నూల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కర్నూల్ టూ టౌన్ ఎస్ఐ సిఐ నాగరాజు రావ్ తో పాటు సిబ్బంది వచ్చి దొంగలించిన మోటార్ సైకిల్ ను దొంగల నుండి రికవరీ చేశారు. గత కొంతకాలంగా జల్సాగా తిరుగుతూ గద్వాల పట్టణానికి చెందిన జస్వంత్ అనే వ్యక్తి మోటార్ సైకిల్ ను దొంగలించి అక్కడక్కడ అమ్ముతూ ఉండేవాడు. ఇటీవల కర్నూల్ పట్టణంలోని ఒక వ్యక్తి మోటార్ సైకిల్ దొంగలించడంతో బాధితుడు కర్నూల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ చేపట్టి దొంగలించిన జస్వంత్ ను పూర్తిస్థాయిలో విచారణ చేపట్టగా అన్ని వివరాలను పోలీసులు సేకరించారు. మహబూబ్నగర్, జడ్చర్ల, గద్వాల తోపాటు వివిధ ప్రాంతాలలో దొంగతనాలుపాల్పడి మోటార్ సైకిల్ ను దొంగలించి తక్కువ ధరకే అమ్మి వచ్చిన డబ్బుతో జల్సా చేస్తూ ఉండేవాడు. మోటార్ సైకిల్ కొన్నవాళ్లను యజమానులు ఎక్కువగా మల్దకల్ మండలం అమరవాయి గ్రామంలో దాదాపు 25 మోటార్ సైకిల్ లను కర్నూల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారము కర్నూల్ పోలీసులు మోటార్ సైకిల్ తోపాటు జస్వంత్ ను అదుపులో తీసుకొని కర్నూలు వెళ్లారు.

# గణేష్ నిమజ్జనం రోజున దళిత మైనర్ బాలికపై అత్యాచారం

- శాబ్దుల్లాపురంలో బాధితురాలు కుటుంబంపై దాడి
- కులం పేరుతో దుర్భాషలు
- సంఘటన వివరాలను బహిర్గతం చేయడానికి సాసేవిరా అన్న పోలీసులు..



**కనగల్, సెప్టెంబర్ 10 (జనం సాక్షి) :** మండలంలోని శాబ్దుల్లాపురం గ్రామంలో గణేష్ నిమజ్జనం రోజున దళిత మైనర్ బాలికపై అత్యాచారం జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితురాలు కుటుంబ సభ్యులు, బంధువులు వెల్లడించిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన దళిత కుటుంబానికి చెందిన ఓ మైనర్ బాలిక కందుల నల్లగొండలో చదువుకుంటుంది, గణేష్ ని మజ్జనం కావడం అదేరోజు కళాశాలకు సెలవు దినం ఇవ్వడంతో ఇంటికి వచ్చింది. గ్రామంలో గణేశుల శోభయాత్ర కొనసాగుతూ గ్రామ సెంటర్లోకి వచ్చిన గణేశులను చూడటానికి బాలికఅక్కడికి వచ్చింది. బాలికను గమనించిన ఇదే గ్రామానికి చెందిన సోమ సుఖేందర్ బాలిక వైపు చూసి ఆమెను తన ఫోన్ ఎత్తమని సైగచేస్తూ సతాయించ సాగాడు. అతని వేధింపులు భరించలేని బాధితురాలు అక్కడి నుంచి తన ఇంటికి బయలుదేరింది అదే క్రమంలో బాత్రూ రూమ్ లోకి వెళ్లి మొఖం శుభ్రపరచుకొని ఇంట్లోకి వెళ్లి నిద్రపోదామనుకున్న సమయములోనే వెనుక నుంచి గుట్టు చప్పుడు కాకుండా తన సెల్ ఫోన్ వెంట పెట్టుకుని వచ్చిన సోమ సుఖేందర్ ఒక్కసారిగా బాత్రూ రూములోకి వెళ్లి గడియ (గొలుసు) గట్టిగా పెట్టి బాలికను తన సున్నితో నోరు మూసి అత్యాచారం చేస్తున్న సమయంలో ఒక్కసారిగా బాతు రూమ్ తలుపు చప్పుడు కావడం, కేక వేయడంతో బాధితురాలు పెద్ద అన్న నల్లగొండ నుంచి తన పనులను ముగించుకొని ఇంటికి అదేసమయానికి రావడం చప్పుడు వినపడడంతో బాతు రూమ్ దగ్గరికి వచ్చి తలుపులు నెట్టి చూసేసరికి తన చెల్లి తో పాటు సోమ సుఖేందర్ కనిపించడంతో తలుపు గడియ గట్టిగా పెట్టి కుటుంబ సభ్యులు తీసుకురావడంతో సుఖేందర్ తన సెల్ ఫోన్ నుంచి మన్నెం రాంబాబు, సోమ చంటి లకు ఫోన్ చేశాడు. వెంటనే బాధితురాలు ఇంటి వద్దకు వచ్చిన రాంబాబు బాధితురాలు కుటుంబ సభ్యులను కులం పేరుతో (మాదిగ కులం) దుర్భాషలాడి వారిపై దాడి చెయ్యడమే కాకుండా మరో వ్యక్తి అయిన సోమ చంటి బాత్ రూమ్ తలుపులు తీయగానే సుఖేందర్ అక్కడినుంచి పారిపోయాడు. ఈ సంఘటనను గ్రామ పెద్దలు నాలుగు రోజుల నుంచి గోప్యంగా ఉంచి ఇరువర్గాలను రాజీ కుదరచడానికి సకలప్రయత్నాలు చేసిన నిందితుడు సుఖేందర్ తో పాటు అతని స్నేహితులైన రాంబాబు, చంటిల అహంకారం తగ్గకపోవడం చివరిసారిగా మంగళవారం తిరిగి గ్రామంలో పంచాయతీ పెట్టిన కూడా వారిలో మార్పు కనిపించక పోవడమే కాకుండా నిందితుడి కుటుంబ సభ్యులు ఇతర గ్రామాల నుంచి తన బంధువులను పిలిపించుకొని బాధితురాలి కుటుంబ సభ్యులను, బంధువులను తమ నోటికొచ్చినట్టు కులం పేరుతో దుర్భాషలాడుతూ దాడి చేసే ప్రయత్నం జరిగింది. చివరికి బాధితురాలితోపాటు కుటుంబ సభ్యులు ఏమి చేయలేక దిక్కు తోచని పరిస్థితిలో కనగల్ పోలీస్ స్టేషన్ ఆశ్రయించి తనకు జరిగిన అత్యాచారం, అవమానంపై ఫిర్యాదు చేశా రు. ఇట్టి ఫిర్యాదు పై పోలీసులు నిందితుడి పై ఫోక్స్ కేసు నమోదు అయినట్లు సమాచారం కాగా, నిందితుడు తో పాటు అతని అనుచరులపై ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసు నమోదు కావాలని బాధితురాలు కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. నిందితుడికి ఫోకస్ కేసుతోపాటు ఎస్సీ ,ఎస్టీ, అట్రాసిటీ కేసు నమోదు చేసి బాధితురాలికి న్యాయం జరిగేలా చూడాలని దళిత సంఘాలు ఆరోపిస్తున్నారు. లేనిపక్షంలోదళిత సంఘాలు బాధితురాలు కుటుంబానికి అండగా నిలిచి ఆందోళన కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహిస్తామని హెచ్చరిస్తున్నారు.

## అర్హత లేకుండా వైద్య సేవలు అందిస్తే కఠిన చర్యలు

- డాక్టర్ జిల్లా ఆరోగ్య శాఖ ఉప వైద్యాధికారి



**తుంగతుర్తి, సెప్టెంబర్ 10 (జనం సాక్షి) :** ఎవరైన అర్హత, అనుమతులు లేకుండా వైద్య సేవలు అందిస్తే వారి మీద కఠిన చర్యలతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఉప వైద్యాధికారి డాక్టర్ మనోహరి, డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. తుంగతుర్తి మండల పరిధిలోని వెలుగు పల్లి గ్రామంలో అనుమతులు లేకుండా నడుస్తున్న శ్రీ సంజీవని మెడికల్ అండ్ జనరల్ స్టోర్స్ స్టోర్ పై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక బృందం బుధవారం ఆకస్మిక తనిఖీలు జరిపింది. ఈ మేరకు వారి తనిఖీల్లో నిర్వాహకుడు ఆర్.ఎం.పి వైద్యుడు సంపత్ కుమార్ ఎటువంటి రిజిస్ట్రేషన్ అర్హత అనుమతులు లేకుండా రోగులకు ఇంజక్షన్లు గ్లూకోజులు అందిస్తున్నట్లు తెలిపారు. అర్హత లేకుండా వైద్యం చేస్తున్నాడని ఫిర్యాదులు అందడంతో క్లినిక్ సంబంధించిన రిజిస్టర్ లను రెఫరెన్స్ స్లిప్పులను స్వాధీనం చేసుకొని క్లినిక్ ను సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య బృందం డాక్టర్ నాజియా డాక్టర్ ఆశ్రిత తదితరులు పాల్గొన్నారు.




# ఐటీ, బ్యాంక్ షేర్ల ర్యాలీ..

• లాభాల్లో ముగిసిన స్టాక్‌మార్కెట్లు



**న్యూఢిల్లీ,జనంసాక్షి:**బెంచ్ మార్క్ ఇండియన్ ఈక్విటీ సూచీలు బుధవారం సానుకూల నోట్‌లో ముగిశాయి. ఐటీ, ప్రభుత్వ రంగ బ్యాంక్ స్టాక్స్ లో ర్యాలీతో లాభాల్లో స్థిరపడ్డాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 323.83 పాయింట్లు లేదా 0.40 శాతం లాభంతో 81,425.15 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 104.50 పాయింట్లు లేదా 0.42 శాతం పెరిగి 24,973.10 వద్ద ముగిసింది.భారత్ ఎలక్ట్రానిక్స్, హెచ్‌సీఎల్ టెక్, బజాజ్ ఫైనాన్స్, యాక్సిస్ బ్యాంక్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ 4.50 శాతం లాభపడ్డాయి. మరోవైపు మహీంద్రా అండ్ మహీంద్రా, మారుతి సుజుకి, టాటా మోటార్స్, అల్ట్రాటెక్ సిమెంట్, ఎటర్నల్ షేర్లు 2.46 శాతం వరకు పడిపోయాయి.నిఫ్టీ మిడ్ క్యాప్ 100, నిఫ్టీ స్మాల్ క్యాప్ 100 సూచీలు వరుసగా 0.83 శాతం, 0.73 శాతం లాభంతో స్థిరపడ్డాయి. నిఫ్టీ ఐటీ, పీఎస్‌యూ బ్యాంక్ సూచీలు వరుసగా 2.63 శాతం, 2.09 శాతం లాభంతో స్థిరపడ్డాయి. ఎంఆర్ఎఫ్, మహీంద్రా అండ్ మహీంద్రా, టీవీఎస్ మోటార్ కంపెనీ నిఫ్టీ ఆటో ఇండెక్స్ 1.28 శాతం నష్టంతో స్థిరపడింది. మార్కెట్ విస్తృతి సానుకూలంగా ఉంది. ఎందుకంటే ఎన్ఎస్ఈలో 3,128 ట్రేడెడ్ స్టాక్స్ లో 1,835 గ్రీన్‌లో ముగిశాయి. 1,210 రెడ్‌లో ముగిశాయి. మరోవైపు 83 షేర్లలో మార్పులేదు. ఎన్ఎస్ఈలో లిస్టెడ్ స్టాక్స్ మార్కెట్ క్యాపిటలైజేషన్ 5.14 ట్రిలియన్ డాలర్లుగా ఉంది.

## బైక్‌పై భారీ తగ్గింపు

విశాఖ(జనంసాక్షి):ద్విచక్ర వాహనాలు కొనాలనుకుంటున్నారా? రెండు వారాలు ఆగండి. జీఎస్టీ స్లాబుల సవరణతో బైక్‌ల ధరలు భారీగా తగ్గనున్నాయి. దసరా, దీపావళి పండగకు ముందే డిస్కౌంట్ల ఆఫర్లు అందుబాటులోకి రానున్నాయి.అన్ని ద్విచక్ర వాహనాలు రూ.10 వేలు నుంచి రూ.20 వేల వరకు తక్కువకు లభించనున్నాయి. జీఎస్టీ రేటు సవరణతో బైక్ మార్కెట్‌లో కొత్త జోష్ కనిపిస్తోంది. ఈ నెలాఖరు నుంచి భారీగా బైక్ విక్రయాలు జరుగుతాయని వ్యాపారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే దాదాపుగా అన్ని కంపెనీలు తగ్గింపు ధరలను సైతం ప్రకటించేశాయి.

**350 సీసీ లోపు బైక్‌లపై భారీగా తగ్గింపు**

కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ స్లాబులను సవరించింది. ఇందులో 350 సీసీ వరకు ఉన్న బైక్‌లపై జీఎస్టీ రేటును 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గించింది. ఈ కొత్త రేట్లు ఈ నెల 22 నుంచి అమలులోకి రానున్నాయి. నవరాత్రి తొలి రాజు నుంచే ఈ కొత్త ధరలు అందుబాటులోకి రానున్నాయి. దీంతో బైక్‌ల ధరలు గణనీయంగా తగ్గనున్నాయి.



## బ్యాంక్ ఆఫ్ బరోడాలో ప్రత్యేక అకౌంట్..

**జనంసాక్షి:**ప్రభుత్వ రంగ బ్యాంక్ ఆఫ్ బరోడా కొత్తగా 'బీఓబీ యాస్పైర్ ఎన్ఆర్ఐ సేవింగ్స్ అకౌంట్' ప్రవేశపెట్టింది. విదేశాలకు వెళ్లే ముందు, భారత్‌లోనే ఉన్నప్పుడే కస్టమర్లు బీఓబీ యాస్పైర్ ఎన్ఆర్ఈ సేవింగ్స్ అకౌంటు తెరవాలి.ఇలా తెరిచిన ఖాతా, తొలుత 'ఇనాక్టివ్ మోడ్'లో ఉంటుంది. ఖాతాదారులు తమ ఎన్నారై హోదాను ధృవీకరిస్తూ ఇమ్మిగ్రేషన్ స్టాంపుతో పాస్‌పోర్ట్ కాపీ, విదేశాల్లోని చిరునామా ధృవీకరణ పత్రాన్ని సమర్పించిన తర్వాత ఖాతా పూర్తి స్థాయిలో యాక్టివ్‌గా మారుతుంది. ఈ అకౌంటుపై తొలి రెండు త్రైమాసికాల్లో ఎలాంటి కనీస బ్యాలెన్స్ చార్జీలు ఉండవు. తదుపరి ప్రతి క్వార్టర్‌కు సగటున రూ.1,000 బ్యాలెన్స్ నిబంధన వర్తిస్తుంది. అకౌంటు బ్యాలెన్స్‌లో గరిష్ట పరిమితేమీ ఉండదు. ఖాతాపై వచ్చిన ఆదాయానికి, ఇన్‌కం టాక్స్ నుంచి, బ్యాలెన్స్‌లకు వెల్త్ ట్యాక్స్ నుంచి మినహాయింపు ఉంటుంది.ఎయిర్‌పోర్ట్ లాంజ్ ఫెసిలిటీతో పాటు మరెన్నో ప్రయోజనాలు అందించేలా కస్టమైజ్ చేసిన డెబిట్ కార్డు ఉంటుంది. భావి ప్రవాస భారతీయుల(ఎన్నారై) అవసరాలకు అనుగుణంగా 'బీఓబీ యాస్పైర్ అకౌంట్'ను ప్రవేశపెట్టామని బ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బీనా వహీద్ తెలిపారు.

## పాత స్టాక్‌పై ఎంఆర్‌పీ మార్చవచ్చు: కేంద్రం

**జనంసాక్షి:**వస్తు సేవల పన్ను శ్లాబులను ఇటీవల సవరించిన ప్రభుత్వం వినియోగ వస్తువుల కంపెనీలకు కార్యాచరణ అడ్డంకులను తగ్గించే లక్ష్యంతో కొన్ని నిర్ణయాలు తీసుకుంది. వస్తువుల తయారీదారులు, ప్యాకర్లు, దిగుమతిదారులకు కొత్త జీఎస్టీ రేట్లను ప్రతిబింబించేలా అమ్ముడుపోని ప్రీ-ప్యాకేజ్డ్ స్టాక్‌పై గరిష్ట రిటైల్ ధరను సవరించడానికి అనుమతించింది. దీని అమలు డిసెంబర్ 31, 2025లోపు పూర్తికావాలని చెప్పింది. కొత్తగా తయారయ్యే స్టాక్‌కు మారిన రేట్లను అప్‌డేట్ చేస్తారని గమనించాలి.కేబినెట్ కార్యదర్శి టి.వి.సోమనాథన్ అధ్యక్షతన జరిగిన ఉన్నత స్థాయి సమావేశం తర్వాత ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. ఇటీవల జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయాల ప్రకారం మార్పులను అమలు చేయడంలో పరిశ్రమ వర్గాలు ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో ఈమేరకు వెసులుబాటు తీసుకొచ్చినట్లు ప్రభుత్వం తెలిపింది. ఇది వృథాను నివారించడానికి, సప్లై చెయిన్ కార్యకలాపాలు సజావుగా సాగేలా చూడటానికి ఆచరణాత్మక విధానమని చెప్పింది. కంపెనీలు జీఎస్టీ సవరణ తేదీకి ముందు తయారు చేసిన అమ్ముడుపోని స్టాక్‌పై ఉన్న ఎంఆర్‌పీని సవరించవచ్చు.శ్లాబుల వారీగా వస్తువుల రేట్లు పెరిగినా, తగ్గినా సవరించేలా రెండింటినీ లెక్కించవచ్చు.

## ఇన్ఫోసిస్‌లో క్యాంపస్ ఉద్యోగాల జాతర

**న్యూఢిల్లీజనంసాక్షి:**దేశీయ రెండో అతిపెద్ద ఐటీ సంస్థ ఇన్ఫోసిస్ క్యాంపస్ నియామకాలకు సన్నద్ధమవుతోంది. దాదాపు రెండేళ్ల తర్వాత కాలేజీ క్యాంపస్‌లకు వచ్చి విద్యార్థులను ఉద్యోగాల్లో నియమించుకోబోతోంది.ఈ మేరకు రిక్రూట్‌మెంట్‌కు సంబంధించిన ప్యానెల్ ఇంటర్వ్యూలలో పాల్గొనాలని తమ సీనియర్ సిబ్బందిని ఇన్ఫోసిస్ కోరింది.టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, ఇన్ఫోసిస్, విప్రోతో సహా ప్రధాన ఐటీ కంపెనీలు కోవిడ్ కారణంగా క్యాంపస్, లేటరల్ రిక్రూట్మెంట్లను తగ్గించాయి. ఇన్ఫోసిస్ అయితే ఫ్రెషర్ రిక్రూట్‌మెంట్‌లను బాగా తగ్గించేసింది. 2024 ఆర్థిక సంవత్సరంలో 11,900 మందిని మాత్రమే నియమించుకుంది. అంతకుముందు సంవత్సరంలో నియామకాల సంఖ్య 50,000తో పోల్చితే ఇది చాలా తక్కువ. ఈ సంఖ్య 2025 ఆర్థిక సంవత్సరంలో 15,000 కు పెరిగింది.బెంగళూరుకు చెందిన ఐటీ సంస్థ మార్చి 2026 తో ముగిసే ఆర్థిక సంవత్సరానికి కంబైన్డ్ ఆఫ్, ఆన్-క్యాంపస్ కార్యక్రమాల ద్వారా 15,000-20,000 కొత్త నియామకాల లక్ష్యాన్ని పెట్టుకుంది. డిజిటల్ స్పెషలిస్ట్ ఇంజనీర్ల (డీఎస్ఈ) పేరుతో ఫ్రెషర్లను ఇన్ఫోసిస్ ఎంపిక చేయబోతోంది.క్యాంపస్ ఇంటర్వ్యూల గురించి ఇన్ఫోసిస్ తొలిసారిగా మేనేజర్ స్థాయి అంతకంటే ఎక్కువ హోదా ఉన్న ఉద్యోగులకు మాస్ ఈ మెయిల్ కమ్యూనికేషన్ పంపింది. దీని ప్రకారం.. ఇన్ఫోసిస్ ప్రతినిధులు అభ్యర్థుల ప్రాథమిక ప్రోగ్రామింగ్ సామర్థ్యాలను, ఎంట్రీ లెవల్ డీఎస్ఈ స్థానాలకు అవసరమైన సమస్య పరిష్కార సామర్థ్యాలను అంచనా వేస్తారు. ఇన్ఫోసిస్ క్యాంపస్ నియామాలు వచ్చే అక్టోబర్, నవంబర్ చివరి మధ్య షెడ్యూల్ చేసినట్లు తెలుస్తోంది. గతంలో కోవిడ్ మహమ్మారి సమయంలో కంపెనీ వర్చువల్ ఇంటర్వ్యూలను నిర్వహించింది.




## ప్రత్యేక కళాకృతుల ప్రదర్శన..



ప్రత్యేకమైన కళాకృతులు, ఆభరణాలు, కళలకు సంబంధించి అత్యాధునిక డిజైన్లను అందించే ఆర్ట్ కనెక్ట్, ఎ అండ్ హెచ్ కొలాబ్ సంస్థ సంయుక్తంగా హైదరాబాద్ వేదికగా తమ ఉత్పత్తులను ప్రదర్శించనున్నట్లు తెలిపాయి.సెప్టెంబర్ 15న హైదరాబాద్‌లోని రామానాయుడు స్టూడియోస్ సమీపంలో స్పిరిట్ కనెక్ట్‌లో ఈమేరకు ప్రదర్శన ఉంటుందని కంపెనీ ప్రతినిధులు ప్రకటన విడుదల చేశారు. ఆర్ట్ కనెక్ట్ కంపెనీని ప్రముఖ నటుడు రానా దగ్గుబాటి భార్య మిహీకా బాజాజ్ దగ్గుబాటి స్థాపించారు. ఏ అండ్ హెచ్ కోలాబ్ వ్యవస్థాపకులుగా అమృతా కిలాచంద్, హీనా ఓమర్ అహ్మద్ ఉన్నారు. ఈ ప్రదర్శన ప్రధానంగా ల్యామ్, వ్యానా అనే థీమ్‌లతో సాగుతుందని నిర్వాహకులు చెప్పారు. ఇందులో ప్రత్యేక ఆకృతులు, ఆభరణాలు, డిజైనింగ్ వస్తువులు..వంటివి ప్రదర్శనకు ఉంచబోతున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా మిహీకా బజాజ్ దగ్గుబాటి మాట్లాడుతూ..'ఆర్ట్ కనెక్ట్ కళాకృతులు, కళాకారులు, వినియోగదారుల మధ్య బంధాన్ని బలోపేతం చేసేందుకు ప్రయత్నిస్తోంది. యూజర్లలో పెరుగుతున్న డిజైన్ స్పృహకు హైదరాబాద్ ప్రసిద్ధి చెందింది. ఇది ఏ అండ్ హెచ్ కొలాబ్ సహకారంతో రూపొందించిన మా ప్రారంభ ఎడిషన్' అన్నారు. ఏ అండ్ హెచ్ కొలాబ్ వ్యవస్థాపకులు అమృతా కిలాచంద్, హీనా ఓమర్ అహ్మద్ మాట్లాడుతూ..'ఈ ప్రదర్శన కోసం ఆర్ట్ కనెక్ట్‌తో కలిసి ప్రేక్షకులను ఆకర్షించేందుకు ప్రయత్నిస్తున్నాం. అందుకు కళాకృతుల్లో కళను, డిజైన్‌ను మిళితం చేస్తున్నాం' అన్నారు.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.37 | ₹ 5.39 |

### బంగారం ధరలు (10 గ్రాములు)
హైదరాబాద్

| ₹ 1,01,300 | ₹ 1,10,509 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

### వెండి ధరలు (కేజీ)
హైదరాబాద్

₹ 1,40,000

## ప్రభుత్వ సెక్యూరిటీల వేలం

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) తాజాగా రాష్ట్ర ప్రభుత్వ సెక్యూరిటీల వేలం ద్వారా రూ.14,900 కోట్లు సమీకరించింది. వివిధ విడతలతో కూడిన ఈ వేలంలో ఆరు రాష్ట్రాలు తమ ఆర్థిక అవసరాల కోసం గణనీయమైన నిధులను సమకూర్చుకున్నాయి.ఆర్‌బీఐ అధికారిక ప్రకటన ప్రకారం.. వివిధ మెచ్యూరిటీల ద్వారా మొత్తం రూ.15,300 కోట్లు ఆఫర్ చేసింది. కానీ చివరకు రూ.14,900 కోట్లు అందించింది. ఆర్‌బీఐ రుణాలు ఇచ్చిన ఆరు రాష్ట్రాల వివరాలు కింది విధంగా ఉన్నాయి.ఈ సెక్యూరిటీల వేలంలో బిహార్ అతిపెద్ద రుణగ్రహీతగా ఉంది. మూడు వేర్వేరు విడతల ద్వారా రూ.6,000 కోట్లు సేకరించింది. 5, 9 మరియు 11 సంవత్సరాల కాలపరిమితితో సెక్యూరిటీల ద్వారా రాష్ట్రం రూ.2,000 కోట్ల చొప్పున నిధులు సమీకరించింది. గోవా.. 11 సంవత్సరాల సెక్యూరిటీ ద్వారా 7.48% ఈల్డ్‌తో రూ.100 కోట్ల రూపాయలను సేకరించింది.హరియాణా రూ.1,500 కోట్లు, జమ్మూ కశ్మీర్ 7.51% ఈల్డ్ అందించే 20 సంవత్సరాల బాండ్‌తో రూ.300 కోట్లు సమీకరించింది.

# అద్దెకు రైళ్లు..

**వందే భారత్‌ను అప్‌గ్రేడ్ చేస్తోన్న నేపథ్యంలో ఆర్థిక వెసులుబాటుకు చర్యలు**



**జనంసాక్షి:**భారతీయ రైల్వే 'మేక్ ఇన్ ఇండియా' చొరవతో దేశంలోని పలు మార్గాల్లో సెమీ-హై-స్పీడ్ రైలు వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను అప్‌గ్రేడ్ చేస్తోన్న నేపథ్యంలో ఆర్థిక వెసులుబాటుకు చర్యలు చేపడుతోంది.ఇందులో భాగంగా ఓ ప్రభుత్వ సంస్థకు అద్దె చెల్లిస్తుంది. ఇది కొంత ఆకస్తిగా అనిపించినా, రైల్వే మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నగదు అప్పుగా ఇచ్చిన ఐఆర్ఎఫ్‌సీ కంపెనీకి భారతీయ రైల్వే లీజు చెల్లింపులు చేస్తోంది. ఇది ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ నిధులను హరించకుండా రైల్వేను ఆధునీకరించడానికి వీలు కల్పిస్తుందని నమ్ముతోంది. ఇది భారతీయ రైల్వేలు, ఐఆర్ఎఫ్‌సీ రెండింటికీ మేలు చేస్తుందని అధికారులు చెబుతున్నారు. భారతీయ రైల్వే రైళ్ల తయారీ మౌలిక సదుపాయాలకు అద్దె చెల్లించేందుకు ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్ఎఫ్‌సీ) కీలకంగా వ్యవహరిస్తోంది. ప్రభుత్వ యాజమాన్యంలోని ఐఆర్ఎఫ్‌సీ భారతీయ రైల్వేలకు ఆర్థికంగా తోడ్పాటును అందిస్తోంది. ఇది మార్కెట్‌లో బాండ్లు, డిబెంచర్లను జారీ చేయడం ద్వారా మూలధనాన్ని సేకరిస్తోంది. దాంతో భారతీయ రైల్వేలకు అవసరమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, రోలింగ్ స్టాక్ (రైళ్లు, ఇంజిన్లు మొదలైనవి)లో పెట్టుబడి పెట్టడానికి అనుమతిస్తుంది. ఈ ఆస్తులను పెద్దమొత్తంలో నేరుగా కొనుగోలు చేయడానికి బదులుగా రైళ్లు, ఇంజిన్లు, ఇతర మౌలిక సదుపాయాల నిర్మాణానికి ఐఆర్ఎఫ్‌సీ బాండ్ల రూపంలో వచ్చిన నిధులతో నగదు సమకూరుస్తుంది. వీటిని ఏర్పాటు చేసి తిరిగి రైల్వేలకు లీజుకు ఇస్తోంది. ఉదాహరణకు.. చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ (ఐసీఎఫ్)ను ఐఆర్ఎఫ్‌సీ భారతీయ రైల్వేలకు లీజుకు ఇచ్చింది. ఇండియన్ రైల్వే ఐఆర్ఎఫ్‌సీకి చేసే లీజు చెల్లింపులను అద్దెగా పిలుస్తారు. వీటిని వాయిదాల్లో చెల్లించాల్సి ఉంటుంది. ఇందులో అసలు, వడ్డీ రెండూ ఉంటాయి.

**ఈ మోడల్ ఎందుకు?**

వందే భారత్ ఎక్స్‌ప్రెస్ వంటి హైటెక్ రైళ్ల తయారీకి అయ్యే ఖర్చు అధికంగా ఉంటుంది. ఈ భారీ ఆర్థిక భారాన్ని ముందస్తుగా భరించడానికి బదులుగా భారతీయ రైల్వే కాలక్రమేణా ఖర్చును వైవిధ్య పరుస్తుంది. ఐఆర్ఎఫ్‌సీ బాండ్ల వేలం ద్వారా సమీకరించిన డబ్బు ద్వారా మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసి ఆ ఆస్తులను ఉపయోగిస్తూ, తర్వాతి కాలంలో అందుకు అద్దె చెల్లిస్తుంది. భారతీయ రైల్వే తక్షణ బడ్జెట్‌పై భారీ ఒత్తిడి లేకుండా కార్యాచరణ ఆదాయాలను (ప్రయాణీకుల టిక్కెట్లు, సరుకు రవాణా మొదలైన వాటి ద్వారా వచ్చే ఆదాయాలు) ఉపయోగించి క్రమంగా చెల్లింపులు చేస్తుంది. ప్రభుత్వ బడ్జెట్ పరిమితులకు లోబడి పనిచేసే భారతీయ రైల్వే వంటి ప్రభుత్వ రంగ సంస్థకు ఇది చాలా ముఖ్యమైనే అభిప్రాయాలున్నాయి.

## జేఈఈ అడ్వాన్స్‌డ్ లేకుండానే.. ఐఐటీలో అడ్మిషన్!




**జనంసాక్షి:**ప్రతిష్టాత్మక ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)లో ప్రవేశం కోసం దేశవ్యాప్తంగా ఏటా లక్షలాది మంది విద్యార్థులు పోటీ పడుతుంటారు. జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్(జేఈ ఈ)లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఐఐటీలో సీటు సంపాదించాలని విద్యార్థులు కోరుకుంటారు.ఇంజనీరింగ్ చేయాలనుకునే దాదాపు ప్రతి విద్యార్థి ఐఐటీలో అడ్మిషన్ పొందడం కోసం ప్రయత్నాలు చేస్తుంటారు. ఐఐటీలో సీటు రావాలంటే జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్‌లో అత్యుత్తమ మార్కులు సాధించాల్సి ఉంటుంది. అయితే జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్ పరీక్షలు రాయకుండానే ఐదుగురు విద్యార్థులు ఐఐటీ అడ్మిషన్ సాధించారు.జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్ లేకుండానే ఐదుగురికి విద్యార్థులకు కాన్పూర్ ఐఐటీలో ప్రవేశం లభించినట్టు ఇండియా టుడే వెల్లడించింది. బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ (బీఎస్), బ్యాచిలర్ ఆఫ్ టెక్నాలజీ (బీటెక్)లో ఈ ఐదుగురు సీట్లు దక్కించుకున్నారని తెలిపింది. ఒలింపియాడ్‌లో చూపిన ప్రతిభ ఆధారంగా వీరిని 2025- 26 సెషన్‌కి ఎంపిక చేసినట్టు పేర్కొంది. ఐదుగురు విద్యార్థులు కంప్యూటర్ సైన్స్, ఇంజనీరింగ్‌లో సీఎస్ఈ ఎంచుకున్నారు. వీరికి సంబంధించిన వ్యక్తిగత వివరాలను కాన్పూర్ ఐఐటీ వెల్లడి చేయలేదు. ఎంపికైన విద్యార్థులలో ఇద్దరు ఇంటర్నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ ఒలింపియాడ్ శిక్షణ శిబిరంకు చెందినవారు. మిగతా ముగ్గురు విద్యార్థులు ఇంటర్నేషనల్ మ్యాథమెటికల్ ఒలింపియాడ్ శిక్షణ శిబిరం నుంచి వచ్చారు. ఒలింపియాడ్‌లో సాధించిన విజయాలు, శిక్షణా శిబిరాలకు హాజరు వంటి అంశాలతో పాటు జేఈఈ అడ్వాన్స్‌డ్స్‌కు సమాన స్థాయి ప్రమాణాలతో వీరిని పరీక్షించారు. ప్రవేశ నిబంధనలకు అనుగుణంగానే వీరికి సీట్లు కేటాయించారు. ఒలింపియాడ్ ద్వారా ప్రవేశం పొందిన విద్యార్థులు నేరుగా రెగ్యులర్ కోర్సులో చేరతారు. జేఈఈ అడ్వాన్స్‌డ్ ద్వారా అడ్మిషన్ పొందిన విద్యార్థులతో కలిసి చదువుతారని అధికారులు వెల్లడించారు. వీరికి ప్రత్యేకంగా విద్యా సహాయం చేయడం అంటూ ఏమీ ఉండదని స్పష్టం చేశారు. అయితే ఒలింపియాడ్ ఎంట్రన్స్.. ఎంపిక చేసిన కొన్ని కోర్సులకు మాత్రమే పరిమితమని తెలిపారు.

ఒలింపియాడ్ ఎంట్రన్స్ ఈ 5 కోర్సులకు మాత్రమే.

1. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్
2. మ్యాథమెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్
3. ఎకనామిక్ సైన్సెస్
4. బయోలాజికల్ సైన్సెస్ అండ్ బయో ఇంజనీరింగ్
5. కెమిస్ట్రీ

ఒలింపియాడ్స్‌లో అత్యుత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను రాత పరీక్షకు ఎంపిక చేస్తుంది. జేఈఈ అడ్వాన్స్‌డ్ సిలబస్ ప్రకారమే వీరికి రాత పరీక్ష పెడతారు. వీటి ఫలితాలు ఆధారంగా కేంద్ర అడ్మిషన్ల కమిటీ ప్రవేశానికి ఎంపిక చేస్తుంది. మొత్తం ఈ ప్రక్రియ అంతా జేఈఈ అడ్వాన్స్‌డ్స్‌లో అర్హత సాధించిన వారికి సరి సమానంగా ఉంటుందని కాన్పూర్ ఐఐటీ తెలిపింది. జేఈఈ అడ్వాన్స్‌డ్ విజేతలతో సమానమైన ప్రతిభ ఉన్న ఒలింపియాడ్ విజేతలకు ఐఐటీలో ప్రవేశానికి ప్రత్యామ్నాయ మార్గంగా దీన్ని చెప్పుకోవచ్చు. కాబట్టి తల్లిదండ్రులు ఇక నుంచి ఒలింపియాడ్స్‌పైనా ఫోకస్ చేయాల్సి ఉంటుంది.2025 జాయింట్ ఇంప్లిమెంటేషన్ కమిటీ (జేఐసీ) నివేదిక ప్రకారం 27,285 మంది అభ్యర్థులు తమ ప్రాధాన్యత జాబితాలో ఐఐటి కాన్పూర్‌లో సీఎస్ఈని ఎంచుకున్నారు. ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ 23,254 ప్రాధాన్యతలతో రెండవ స్థానంలో ఉంది. మెకానికల్ ఇంజనీరింగ్ (20,261), సివిల్ ఇంజనీరింగ్ (15,846), కెమికల్ ఇంజనీరింగ్ విత్ పవర్ అండ్ ఆటోమేషన్ (15,758) తర్వాత స్థానాల్లో ఉన్నాయి.


## ఐఎస్ఐకి భారత సిమ్ కార్డుల సరఫరా ..

### నేపాలీ జాతీయుడి అరెస్టు



**న్యూఢిల్లీ,జనంసాక్షి:**పాకిస్తాన్ ఇంటర్-సర్వీసెస్ ఇంటెలిజెన్స్ (ఐఎస్ఐ) ఏజెన్సీకి భారత సిమ్ కార్డులను సరఫరా చేశాడనే ఆరోపణలపై ఒక నేపాలీ జాతీయుడిని పోలీసులు అరెస్టు చేశారు.నిందితుడు ప్రభాత్ చౌరాసియా(43) బీఎస్సీ చదువుకున్నాడని, మహారాష్ట్ర, ఢిల్లీలో ఫార్మాస్యూటికల్ కంపెనీలలో పనిచేశాడని ఢిల్లీ పోలీసులు తెలిపారు.మహారాష్ట్రలోని లాతూర్‌లో నమోదైన తన ఆధార్ కార్డును ఉపయోగించి బీహార్, మహారాష్ట్రల నుండి 16 సిమ్ కార్డులను కొనుగోలు చేశాడని పోలీసులు పేర్కొన్నారు. తరువాత వాటిని గూఢచర్యంతో సంబంధం ఉన్న కార్యకలాపాలను నిర్వహించడానికి ఉపయోగించాడని ఢిల్లీ పోలీసులు తెలిపారు. నిందితుడిని ఆగస్టు 28న స్పెషల్ పోలీసు బృందం లక్ష్మీ నగర్‌లోని విజయ్ బ్లాక్‌లో అరెస్టు చేసినట్లు తెలిపారు. లాహోర్, బహవల్పూర్, పాకిస్తాన్‌లోని పలు ప్రాంతాల నుండి ఐఎస్ఐ ఆపరేటర్లు పదకొండు సిమ్‌లను ఆపరేట్ చేస్తున్నారని పోలీసులు గుర్తించారు. నిందితుడు 2024లో నేపాలీ మధ్యవర్తి ద్వారా ఐఎస్ఐ హ్యాండ్లర్లను సంప్రదించాడని దర్యాప్తులో తేలింది. అమెరికా వీసా, విదేశాల్లో జర్నలిజంలో అవకాశాల హామీతో అతన్ని ఐఎస్ఐ ఏజెంట్లు ఆకర్షించారు. డీఆర్‌డీఓ, ఆర్మీ సంస్థలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించే పనిని అతనిని అప్పగించారని స్పెషల్ సెల్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ అమిత్ కౌశిక్ తెలిపారు.నిందితుడు సిమ్ కార్డులను భారతదేశం నుండి ఖాఠ్మండుకు అక్రమంగా రవాణా చేసి, తరువాత ఐఎస్ ఐహ్యాండ్లర్లకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. 2017లో ప్రభాత్ చౌరాసియా ఖాఠ్మండులో ఒక లాజిస్టిక్స్ కంపెనీని ప్రారంభించాడు. అది ఆర్థిక నష్టాల కారణంగా మూతబడింది. దీంతో సంపాదన కోసం ఐఎస్ఐ హ్యాండ్లర్లతో పరిచయం పెంచుకున్నాడని పోలీసులు అనుమానిస్తున్నారు. కాగా నిందితుని నుంచి పలు డిజిటల్ పరికరాలు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుడు ప్రభాత్ చౌరాసియాపై కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## 'మా హోటల్‌కు నిప్పు పెట్టారు'.. మమ్మల్ని కాపాడండి




**జనంసాక్షి:**నేపాల్‌లో భారత పర్యటకురాలు విలవిల
న్యూఢిల్లీ: జనరేషన్ జెడ్ నిరసనలతో నేపాల్ అట్టుడుకిపోతోంది. ఈ నేపథ్యంలో అక్కడున్న పర్యాటకులు పలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అక్కడ చిక్కుకుపోయిన ఒక పర్యాటకురాలు తనను కాపాడాలంటూ భారత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.ఉపాసన గిల్‌గా తనను పరిచయం చేసుకున్న ఆమె తనకు ఎదురైన భయానక అనుభవాలను పంచుకున్నారు.'నేను స్పాలో ఉండగా, నేను బస చేసిన హోటల్‌కు నిరసనకారులు నిప్పంటించారు. కర్రలు చేత పట్టుకుని కొందరు పరిగెడుతూ అందరినీ భయపెట్టారు. వాలీబాల్ లీగ్‌ను నిర్వహించడానికి నేను నేపాల్‌కు వచ్చాను. దయచేసి నాకు సహాయం చేయాలని భారత రాయబార కార్యాలయాన్ని అభ్యర్థిస్తున్నాను. నేను ఇక్కడ నేపాల్‌లోని పోఖ్రాలో చిక్కుకుపోయాను. నేను బస చేసిన హోటల్ దగ్ధమయ్యింది. వస్తువులన్నీ నా గదిలోనే ఉండిపోయాయి.హోటల్ మొత్తం తగలబడింది. నేను ప్రాణాలతో తప్పించుకోగలిగాను. ఇక్కడి పరిస్థితులు చాలా దారుణంగా ఉన్నాయి. ప్రతిచోటా రోడ్లపై మంటలు చెలరేగుతున్నాయి. ఆందోళనకారులు ఇక్కడి పర్యాటకులను విడిచిపెట్టడం లేదు. ప్రతిచోటా నిప్పు పెడుతున్నారు. దయచేసి మాకు సహాయం చేయండి. ఇక్కడ నాతోపాటు చాలా మంది ఉన్నారు' అని ఆ భారత మహిళ వీడియోలో మొరపెట్టుకున్నారు.సోషల్ మీడియాపై నిషేధానికి వ్యతిరేకంగా ప్రారంభమైన నిరసనలు ప్రధానమంత్రి కేపీ శర్మ ఓలి నేతృత్వంలోని ప్రభుత్వ అవినీతిపై తిరుగుబాటుగా మారాయి. సోమవారం రాత్రి ఆలస్యంగా సోషల్ మీడియాపై నిషేధం ఎత్తివేసినప్పటికీ, భారీ నిరసనల నేపథ్యంలో ప్రధాని ఓలి రాజీనామా చేశారు. ప్రదర్శనకారులు పలు ప్రభుత్వ భవనాలను ముట్టడించి, పార్లమెంటుతో పాటు పలువురు ఉన్నత స్థాయి అధికారుల ఇళ్లను తగలబెట్టారు. కాగా కాఠ్మండులోని భారత రాయబార కార్యాలయం.. నేపాల్‌లోని పరిస్థితులు చక్కబడే వరకూ ప్రయాణాలను వాయిదా వేయాలని కోరింది.

## మన రాజ్యాంగం చూసి గర్వపడాలి

సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్.. ప్రజాప్రాముఖ్యం కలిగిన లేదా ప్రజలను ప్రభావితం చేసే ఏదైనా చట్టంపై సుప్రీం కోర్టు సలహా కోరే హక్కు రాష్ట్రపతికి ఉందన్నారు. "మన రాజ్యాంగం చూసి గర్విస్తున్నాం. పొరుగుదేశాల్లో ఏం జరుగుతుందో చూడండి. నేపాల్‌లో పరిస్థితి గమనించండి" అని వ్యాఖ్యానించారు. నేపాల్‌లో పరిస్థితి గమనించండి" అని వ్యాఖ్యానించారు. "అవును.. బంగ్లాదేశ్‌లోనూ" అంటూ జస్టిస్ విక్రమ్‌నాథ్ స్పందించారు. బిల్లులను నెల రోజులకు పైగా రిజర్వ్ చేసే విషయంలో గవర్నర్ల అధికారాలను సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సమర్థించారు. అటువంటి కేసులు తక్కువే ఉన్నాయన్నారు. రాష్ట్రప్రభుత్వం ఆమోదించిన అన్ని బిల్లుల్లో 90 శాతం బిల్లులకు గవర్నర్ నెలలోపే సమ్మతి తెలుపుతారని చెప్పారు. 1970 నుంచి 2025 వరకు తమిళనాడుకు చెందిన ఏడు బిల్లులు సహా కేవలం 20 బిల్లులు మాత్రమే రిజర్వ్‌లో ఉన్నట్లు ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు.

# కామారెడ్డి జిల్లాలో గిరిజన (కుల) లొల్లి





**కామారెడ్డి జిల్లా బ్యూరో సెప్టెంబర్ 10 (జనం సాక్షి) :** కామారెడ్డి జిల్లాలో ఎక్కడా లేని విధంగా నాయక్ పోడ్ (ఎస్టీ) గిరిజన కులం ధ్రువపత్రాల లొల్లి మొదలైంది. కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపిస్తూ బుధవారం ఆదివాసి నాయక్ పోడ్ సేవా సంఘం ఆధ్వర్యంలో జిల్లాలోని మహ్మద్ నగర్ మండల కేంద్రంలోని జాతీయ రహదారి 765 పై రాస్తారోకో నిర్వహించారు. ఈ ఆందోళనతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు మొట్ట పెంటయ్య మాట్లాడుతూ కామారెడ్డి జిల్లాలోని 9 మండలాల్లో గల 27 గ్రామాల్లో నాయక్ పోడ్ లు నివసిస్తున్నారని తెలిపారు. గతంలో జీవో నెం. 11 (తేది: 21-01-1992), 3. 144 (తేది: 12-08-1997) ఆధారంగా తమకు కుల ధ్రువీకరణ పత్రాలు అందజేసేవారని గుర్తుచేశారు. కానీ ఇటీవల ట్రైబల్ వెల్ఫేర్, ఎస్టీ కమిషన్ నుండి అధికారులు, తహసీల్దార్ల అవగాహన లోపం వల్ల తమ పిల్లలకు కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల అనేకమంది విద్యార్థులు గురుకుల, మోడల్, నవోదయ వంటి విద్యా సంస్థలలో ప్రవేశ పరీక్షలు రాయలేకపోతున్నారని, నిరుద్యోగులు ఉద్యోగ అవకాశాలను కోల్పోతున్నారని ఆయన అన్నారు. అంతేకాకుండా, ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకోవడంలో కూడా ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. నిరసన విషయం తెలుసుకున్న జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు వెంటనే స్పందించి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి ద్వారా సమస్యను తెలుసుకున్నారని, అనంతరం ఆయన ఫోన్లో మొట్ట పెంటయ్యతో మాట్లాడి ఈ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే విధంగా చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళనకారులు రాస్తారోకోను విరమించారు. అనంతరం నాయక్ పోడ్ లు తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన కొనసాగించారు. కలెక్టర్ మరియు సబ్ కలెక్టర్లు స్వయంగా వచ్చి సమస్యను పరిష్కరించాలని నినాదాలు చేశారు. వెంటనే బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని, సమస్యను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సబ్ కలెక్టర్ కు వినతిపత్రం అందజేసిన తరువాత నిరసన విరమించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి నాయకపోడు జిల్లా అధ్యక్షుడు మొట్ట పెంటయ్య, గాండ్ల రామచందర్, ప్రధాన కార్యదర్శి పుట్ట వెంకట్, కోశాధికారి టెంకటి సాయిబాబా, సాయిలు, కుర్తి రవీందర్, సిర్నాపల్లి సాయన్న, కుర్తి కాశీరాం, ఎముల కాశీరాం, స్థానిక తహసీల్దార్ సవాయి సింగ్, డిప్యూటీ తాసిల్దార్ క్రాంతి కుమార్,బాన్సువాడ రూరల్ సిఐ తిరుపయ్య అన్నదేవర, ఎస్ఐ శివకుమార్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జగిత్యాలలో సాండ్ బజార్ ప్రారంభం

## మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**జగిత్యాల, సెప్టెంబర్ 10 (జనం సాక్షి):** జగిత్యాల పట్టణంలోని వాణినగర్‌లో తెలంగాణ ఖనిజాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాండ్ బజార్‌ను బుధవారం సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రజలకు ఇసుక సులభంగా అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు సాండ్ బజార్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సాండ్ బజార్ ల ద్వారా రూ.800 చెల్లిస్తే ఇసుక ఇంటికే చేరుతుందని, ఇసుక దోపిడీ, దళారీ వ్యవస్థను అరికట్టేందుకు ఈ విధానం ఉపయోగపడుతుందని వివరించారు. స్టాక్ పాయింట్ల వద్ద 24 గంటలూ లారీలు అందుబాటులో ఉంటాయని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుక కొరత లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి పేర్కొన్నారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఇప్పటికే ఏర్పాటైన సాండ్ బజార్‌లు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని, జగిత్యాల ప్రజలు కూడా ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ బి. సత్యప్రసాద్ కోరారు. జగిత్యాల, ధర్మపురి నియోజకవర్గాల్లో ఇసుక కొనుగోలు భారంగా ఉండటంతో, ముడున్నర ఎకరాల్లో ఈ సాండ్ బజార్ ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. స్వంత అవసరాలకు ఇసుక కావాల్సిన వారు స్థానిక ఎమ్మార్వో వద్ద రూ.800 చలాన రూపంలో చెల్లించి ఇసుక పొందవచ్చని, రవాణా, కూలీ ఖర్చులను వినియోగదారులే భరించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఉచితంగా ఇసుక అందిస్తామని, అనధికార ఇసుక రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. త్వరలో వెల్గటూర్ మండలంలో మరో సాండ్ బజార్ ఏర్పాటుకు పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల శాసనసభ్యులు సంజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, టిజిఎండిసి జనరల్ మేనేజర్ శ్రీనివాస్, అదనపు కలెక్టర్ బిఎస్ లత, ఆర్డీవో మధుసూదన్, ప్రాజెక్ట్ అధికారి వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వాసుపత్రికి ఆధునిక వైద్య పరికరాలు

- ఈఎన్‌టీ హాస్పిటల్‌కు ఇండియన్ ఆయిల్ సహాయం
- రూ.50 లక్షల విలువైన పరికరాలు అందజేత



**హైదరాబాద్, సెప్టెంబర్ 10 (జనంసాక్షి) :**
హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ కోటిలో ఉన్న ప్రభుత్వ ఈఎన్‌టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌కు రూ.50 లక్షల విలువైన ఆధునిక వైద్య పరికరాలను అందజేసింది. వీటిని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యాలయం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, రాష్ట్ర హెడ్ పియూష్ మిట్టల్ అధికారికంగా ప్రారంభించారు. ఈ పరికరాలతో చిన్నారుల కోక్లియర్ ఇంప్లాంట్ శస్త్ర చికిత్సకు అవసరమైన ఆధునిక నిర్ధారణ, చికిత్స సౌకర్యాలను మెరుగుపరచడంతో పాటు లారింజియల్ (గొంతు) క్యాన్సర్‌తో బాధపడుతున్న రోగులకు కూడా ప్రయోజనం కలగనుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ హాస్పిటల్స్, ప్రభుత్వ రంగ సంస్థల మధ్య ఉన్న భాగస్వామ్యం ప్రజారోగ్య వ్యవస్థను బలోపేతం చేస్తుందన్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా ఈఎన్‌టీ కోటి సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్ ఆచార్య మాట్లాడుతూ పుట్టుకతో వినికిడి లోపం ఉన్న శిశువుల కేసులు పెరుగుతున్నాయన్నారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ నుంచి లభించిన ఈ ఆధునిక పరికరాలు పేద రోగులకు ఎటువంటి ఖర్చు లేకుండా ఉన్నత స్థాయి కోక్లియర్ చికిత్సలను అందించగల మా సామర్థ్యాన్ని మరింత మెరుగుపరుస్తాయని తెలిపారు. ఈ హాస్పిటల్‌కు అందించిన ఆధునిక వైద్య పరికరాలు ఇవే.. 'బ్రెయిన్ స్టెమ్ ఎవోక్డ్ రెస్పాన్స్ ఆడియోమెట్రీ' ఇది పిల్లల లో వినికిడి లోపాలను గుర్తించడానికి ఉపయోగపడుతుంది. పుట్టుకతో చెవిటితనాన్ని ముందుగా గుర్తిస్తుంది. కోక్లియర్ ఇంప్లాంట్‌కు అర్హత ఉన్న వారిని సకాలంలో గుర్తించడంలో సహాయపడుతుంది. 'లెకా ఎం320 మైక్రో స్కోప్' ఇది కోక్లియర్ ఇంప్లాంట్ శస్త్రచికిత్సలు, సూక్ష్మ చెవి శస్త్రచికిత్సలు, కణితుల చికిత్స కోసం ఉపయోగించే అధునాతన శస్త్రచికిత్స మైక్రోస్కోప్. 'ఫ్లెక్సిబుల్ నాసోఫారింజో లారింజోస్కోప్' ఇది లారింక్స్, హైపోఫారింక్స్ భాగాల్లో గడ్డలు, వ్యాధులను గుర్తించేందుకు ఉపయోగించే పరికరం. మత్తు అవసరం లేకుండా ముందస్తుగా క్యాన్సర్ లక్షణాలను గుర్తించడంలో సహాయపడుతుంది.

# పేరేమో.. కిరాణం చేసేది.. డ్రగ్స్ రవాణా



**నిజామాబాద్ జిల్లా బ్యూరో సెప్టెంబర్ 10 (జనం సాక్షి) :** నిజామాబాద్ జిల్లా కేంద్రంలో కిరాణా జనరల్ స్టోర్ నిర్వహణ ముసుగులో నిషేధిత మత్తు పదార్థాల దందాను కొనగిస్తున్న విషయం బట్టబయలైంది. ఈ సందర్భంగా ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు బుధవారం గుట్టురట్టు చేశారు. నిజామాబాద్ ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ ఇన్స్పెక్టర్ స్వప్న తెలిపిన కథనం ప్రకారం వివరాల ప్రకారం నిజామాబాద్ నగరంలోని గోశాల రోడ్డులో నిషేధిత మత్తుపదార్థం అల్ఫా జోలం రవాణా జరుగుతుందని విశ్వసనీయ సమాచారం అందిందని, ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ బృందం నగరంలోని గోశాల రోడ్డులో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో నిజామాబాద్ నగరంలోని కోజా కాలనీ కి చెందిన అబ్దుల్ మాలిక్ దేవాని అనే వ్యక్తి స్కూటీపై వస్తుండగా తనిఖీ చేశారు. అతని స్కూటీ డిక్కీలో నిషేధిత మత్తు పదార్థమైన అల్ఫా జోలం 609 గ్రాముల కలిగిన దానిని స్వాధీనం చేసుకోవడం జరిగిందని, దాని విలువ బహిరంగ మార్కెట్లో ఐదారులక్షలు ఉంటుందని తెలిపారు. సంబంధిత నిషేధిత మత్తు పదార్థాన్ని కృత్రిమ రసాయనాల తయారీ కల్తీకల్లు కోసం ఉపయోగిస్తారని తెలిపారు. అబ్దుల్ మాలిక్దేవాని నగరంలో ప్రొవిజన్ స్టోర్ నిర్వహిస్తున్నట్టు విచారణలో వెల్లడైంది. ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ పోలీసులు ఆ కోణంలో విచారణ జరుపుతున్నారు. అబ్దుల్ మాలిక్ దేవానిని అరెస్టు చేసి రిమాండ్ పంపుతామని సీఐ తెలిపారు. నిషేధిత మత్తుపదార్థం అబ్దుల్ మాలిక్ దేవాని ఎక్కడినుంచి తీసుకువచ్చి విక్రయాలు చేస్తున్నారని కోణంలో విచారణ జరుపుతున్నట్టు పేర్కొన్నారు. ఈ దాడిలో ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ ఎస్సై రవికుమార్ తోపాటు హెడ్ కానిస్టేబుల్ లు రాజన్న, నారాయణరెడ్డి, కానిస్టేబుళ్లు హామీద్ తదితరులు పాల్గొన్నారు.



## తండ్రి అంత్యక్రియలకు వచ్చి కొడుకు ఆత్మహత్య

**పిట్లం, సెప్టెంబర్ 10, 2025 (జనం సాక్షి):** పిట్లం మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన వడ్డే ప్రకాష్ (36) జీవితంలో విషాద ఘటన చోటుచేసుకుంది. గత కొంతకాలంగా ప్రకాష్‌కు తన భార్య తులసితో కుటుంబ విషయాలపై తరచూ గొడవలు జరుగుతుండగా, ఈ నేపథ్యంలో తులసి తన పుట్టింటిలో ఉంటోంది. సెప్టెంబర్ 9న రాత్రి ప్రకాష్ తండ్రి వడ్డే నాగయ్య అనారోగ్యంతో మరణించారు. తండ్రి అంత్యక్రియల కోసం ధర్మారం వచ్చిన ప్రకాష్, బుధవారం ఉదయం తన భార్య మరియు బామ్మర్దులతో గొడవపడ్డాడు. ఈ వివాదం తర్వాత ప్రకాష్ తన ఇంటికి వెళ్లి తలుపులు వేసుకొని ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు ప్రకాష్‌కు ఇద్దరు కూతుళ్లు, ఒక కొడుకు ఉన్నారు. మృతుడి సోదరుడు బుచ్చయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకట్ రావు తెలిపారు. ఈ ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది.

## చాకలి ఐలమ్మకు నివాళులు అర్పించిన మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు



**మంథని, (జనంసాక్షి) :**
వీర వనిత చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా బుధవారం మంథని లోని ఐలమ్మ విగ్రహానికి మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో రాష్ట్రంలో మహనీయులను గౌరవించని, వారి పోరాట స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేయని పార్టీ ఏదైనా ఉంది అంటే అది కాంగ్రెస్ పార్టీనేనని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలో మహనీయులను వెలికితీస్తే ఈనాడు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత చాకలి ఐలమ్మ జయంతి వర్ధంతిని అధికారికంగా నిర్వహిస్తామని చెప్పి కనీసం విగ్రహాన్ని శుభ్రం చేయలేదన్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్‌కు మహనీయులపై ఎలాంటి భావన ఉందో అర్థం అవుతుందన్నారు. మహనీయుల వర్ధంతి జయంతులను బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గొప్ప నిర్వహించడంతో పాటు వారి చరిత్రను చాటి చెప్తామని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్ రియంబర్స్మెంట్ విడుదల చేయాలి

## రాష్ట్ర కార్యదర్శి వియం విఠల్ డిమాండ్




**కామారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 10 (జనం సాక్షి) :** భారతీయ విద్యార్థి మోర్చ ఆధ్వర్యంలో పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్స్ రియంబర్స్మెంట్ అలాగే బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ స్కీమ్ విడుదల చేయాలని కామారెడ్డి జిల్లా కేంద్రంలో వేలాది మందితో బుధవారం ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి వియం విఠల్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 9000 కోట్లపైగా విద్యార్థులకు రావలసిన బకాయిలు పెండింగ్లో ఉన్నాయని. అలాగే బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీమ్ కింద రావలసిన డబ్బులు కూడా పెండింగ్లో ఉన్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు అవుతున్న ఇప్పటివరకు విడుదల చేయకపోవడం సిగ్గుచేటు అన్నారు. విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఎన్నోసార్లు మంత్రులకు,ఎమ్మెల్యేలకు వినతి పత్రం ఇచ్చిన విడుదల చేస్తామని మాట ఇచ్చి తప్పడం జరిగిందన్నారు. స్కాలర్షిప్ పెండింగ్ లో ఉండడం వలన కార్పొరేట్,ప్రయివేట్ విద్యా సంస్థలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులు గురి చేస్తున్నారు. అలాగే విద్యాశాఖ మంత్రిని కేటాయించకపోవడం వల్ల విద్యారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధి ఉంటే వెంటనే పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్లను బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీం బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి కామారెడ్డి పర్యటన రాకముందే విద్యార్థులకు పెండింగ్లో ఉన్న బకాయిలను విడుదల చేయాలని హెచ్చరించారు. లేనిపక్షంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భారతీయ విద్యార్థి మోర్చ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు యశ్వంత్,అర్బస్ ఖాన్,జిల్లా ఇన్చార్జి పెరుమాండ్ల బుల్లెట్ చక్రవర్తి, నాయకులు గడ్డం రవి, చిట్యాల లింగం, ప్రసాద్,రాజు, శివకుమార్,మనోజ్ విద్యార్థులు పాల్గొన్నారు.

# కజకిస్తాన్, బెలారస్ గౌరవ కాన్సల్ సమావేశం

## పర్యాటక, వ్యాపార అవకాశాలపై చర్చ



**హైదరాబాద్, సెప్టెంబర్ 10 (జనంసాక్షి) :**
కజకిస్తాన్ రిపబ్లిక్ గౌరవ కాన్సుల్ డాక్టర్ నవాబ్ మీర్ నాసిర్ అలీ ఖాన్ జూబ్లీ హిల్స్‌లోని తన నివాసంలో ముంబైలోని బెలారస్ కాన్సుల్ జనరల్ అలియాక్సాండర్ మత్సుకోతో సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో కజకిస్తాన్, బెలారస్, భారతదేశం మధ్య సహకారం పెంపొందించడం, దౌత్య సంబంధాలు బలోపేతం చేయడం, సాంస్కృతిక మార్పిడిని విస్తరించడం అంశాలపై దృష్టి సారించారు. వ్యాపార సహకారం, విమానయాన కనెక్టివిటీ, పర్యాటక తదితర రంగాలపై కూడా చర్చలు జరిపారు. ఈ చర్చలలో ఆల్మాటిలోని కజిన్ డీఎంసీ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ రోహిత్ షోరే, స్కాల్ ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షుడు ఎన్ఎస్ఎన్ మోహన్, ఎయిర్ ఆస్తానా (ఇండియా) హెడ్ అలన్ అటమ్కులోవ్, జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్ చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ అశిష్ కుమార్, జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్ ఎయిర్లైన్ మార్కెటింగ్, రూట్ డెవలప్‌మెంట్ హెడ్ ఆనంద ఆచార్య, వాల్మీకి ట్రావెల్ అండ్ టూరిజం సొల్యూషన్స్ డైరెక్టర్ వాల్మీకి హరి కిషన్ తదితరులు పాల్గొన్నారు.
ఈ సమావేశం అనంతరం హైదరాబాదులోని తాజ్ వివంతలో జరిగిన వాల్మీకి ఈవెంట్‌లో కజకిస్తాన్, బెలరస్, అజర్బైజాన్, జార్జియాలో ప్రయాణ, పర్యాటక అవకాశాలపై సెమినార్ నిర్వహించారు. ఈ సమావేశంలో కజిన్ డీఎంసీ, ఎయిర్ ఆస్తానా, బెలవియా ఎయిర్‌లైన్స్ సులభమైన కనెక్టివిటీ, కొత్తగా అభివృద్ధి చెందుతున్న పర్యాటక గమ్య స్థలాలను ప్రదర్శించాయి. ఈ సందర్భంగా వాల్మీకి హరి కిషన్ ను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో కజకిస్తాన్ పర్యాటక ప్రచారంలో చేసిన విశిష్ట కృషికి నవాబ్ మీర్ నాసిర్ అలీ ఖాన్ ప్రత్యేక అవార్డుతో సత్కరించారు.

# వామ్మో..కేఎఫ్‌సీ హోటళ్లలో ఫుడ్డా!

- ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలో బండారం బట్టబయలు
- కిచెన్‌లో అపరిశుభ్రత, దుర్వాసన తేల్చిన అధికారులు




**నిజామాబాద్ జిల్లా బ్యూరో సెప్టెంబర్ 10 (జనం సాక్షి) :**
నిజామాబాద్ జిల్లా కేంద్రంలో పెద్ద పెద్ద హోటళ్లన్నీ భోజన ప్రియులను బోల్తా కొట్టించేవిధంగా బోర్డులు పెట్టి, అలంకారప్రాయంగా చూపిస్తూ భోజన ప్రియులను బొంద పెడుతున్నారనే చెప్పాలి. భోజనాలకు వెళ్లిన వారికి కూర్చునేందుకు అలంకరణ చేసిన కుర్చీలు, టేబుళ్ళు వేసి, డ్రెస్ కోడ్ ఉన్న సిబ్బంది వచ్చి మెనూ ఇవ్వగానే అందులో ఉన్న దానిని ఆర్డర్ చేయడంతో దాన్ని తీసుకొని వచ్చి వినియోగదారులకు ఇచ్చి, అయ్యిందనగానే పొడవాటి బిల్లు చేతుల్లో పెట్టి డబ్బులు దండు కోవడమే పని అయ్యింది కానీ ఆ హోటళ్ళలో వంట గదులలో జరిగే బండారాన్ని ఎండగట్టాలంటే అక్కడ నో అడ్మిషన్ అనే బోర్డు పెట్టి హోటల్ యాజమాన్యం రెడీగా ఉంటారు. ఈ విషయాలు ఇలా ఉన్నాయని, గత రెండు రోజుల క్రితం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని వేణు మాల్ లో గల కే ఎఫ్ సీ హోటల్ లో కుళ్లిపోయిన చికెన్ వచ్చిందంటూ ఓ బాధితుడు ప్రజావాణిలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు జిల్లా కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు బుధవారం ఫుడ్ సేఫ్టీ అధికారులు విస్తృతంగా కే ఎఫ్ సిలో తనిఖీలు చేపట్టారు. ఫుడ్ సేఫ్టీ గెజిటెడ్ ఇన్స్పెక్టర్ సునీత, ఫుడ్ సేఫ్టీ అధికారిని నివిత, విక్రమ్ లు మున్సిపల్ శాఖ ఎం ఎచ్ ఓ, ఇతర అధికారులు నిర్వహించిన సంయుక్త తనిఖీలలో ఊహించని విషయాలు బయటపడ్డాయి. ఈ సందర్భంగా ఫుడ్ సేఫ్టీ ఇన్స్పెక్టర్ సునీత మాట్లాడుతూ కే ఎఫ్ సీని తనిఖీ చేయగా కిచెన్ హాల్ బూజు పట్టి ఉందని, అలాగే కిచెన్ లో దుర్వాసన వెదజల్లటం, ఆహార పదార్థాలపై దుర్వాసన రావడాన్ని గమనించడం జరిగిందని, దీనిపై కేఎఫ్‌సీ నిర్వహకులపై అసహనం వ్యక్తం చేశామని అన్నారు. కొన్ని అపరిశుభ్రంగా ఉన్న శాంపిల్స్ ను ల్యాబ్ కు తరలించడం జరుగుతుందని ఫుడ్ సేఫ్టీ గెజిటెడ్ ఇన్స్పెక్టర్ ఆఫీసర్ సునీత వివరించారు. అలాగే కిచెన్ లో అపరిశుభ్రత వాతావరణం, డ్రైనేజ్ బ్లాక్, చెడు దుర్వాసన లాంటివి వెదజల్లుతున్నాయని ఆమె తెలిపారు. దీనికోసం కె ఎఫ్ సీ నిర్వాహకులకు నోటీసులు సైతం ఇవ్వడం జరిగిందన్నారు. అలాగే కస్టమర్లకు ఇచ్చే లెగ్ పీస్ లలో సగం ఉడికి ఉడికనట్టుగా ఉన్నాయని, వాటిని కూడా ల్యాబ్ కు తరలించడం జరుగుతుందని, 15 రోజుల్లోగాగా కెఎఫ్‌సీ నిర్వాహకులు ఈ విషయంపై తమకు పూర్తి నివేదిక అందజేయాలని లేనియెడల తదుపరి చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.

# వేములవాడలో అభివృద్ధి పనుల జోరు





- తిప్పాపూర్ వద్ద మూడవ బ్రిడ్జి నిర్మాణం ఆరంభం
- కుల సంఘ భవనాలకు నిధులు, గృహ నిర్మాణంలో పురోగతి

**వేములవాడ, సెప్టెంబర్ 10, 2025 (జనంసాక్షి):** వేములవాడ పట్టణం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోంది. ప్రభుత్వ విప్ మరియు స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ నాయకత్వంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, సామాజిక సంక్షేమ కార్యక్రమాలు వేగంగా సాగుతున్నాయి. మూడవ బ్రిడ్జి నిర్మాణం, కుల సంఘ భవనాలు, గౌరవ కార్యక్రమాలతో పట్టణం కొత్త రూపు సంతరించుకుంటోంది. తిప్పాపూర్ వద్ద మూలవాగుపై మూడవ బ్రిడ్జి నిర్మాణ పనులు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కీలక ప్రాజెక్టు ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చొరవతో ఆకారం తీసుకుంటోంది. ప్రారంభ దశలో జెసిబీలతో పిల్లర్ల వద్ద భూమి చదును చేసే పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ బ్రిడ్జి పూర్తయితే, పట్టణంలో రాకపోకలు సులభతరం కానున్నాయి, ట్రాఫిక్ సమస్యలు గణనీయంగా తగ్గనున్నాయని అధికారులు తెలిపారు. తిప్పాపూర్, చుట్టుపక్కల గ్రామాలు, పట్టణ ప్రజలకు ఈ బ్రిడ్జి ప్రధాన మార్గంగా ఉపయోగపడనుంది. గతంలో వర్షాకాలంలో ఈ ప్రాంతంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడేది, కానీ ఈ బ్రిడ్జి పూర్తయితే ఆ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, "వేములవాడ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. రోడ్లు, డ్రైనేజీ, బ్రిడ్జిల వంటి మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించి, పనులను వేగంగా పూర్తి చేస్తాం," అని హామీ ఇచ్చారు. పట్టణ ప్రజలు ఈ ప్రాజెక్టు ప్రారంభంపై ఆనందం వ్యక్తం చేస్తూ, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. "ఎన్నో ఏళ్ల నిరీక్షణ తర్వాత మా స్వప్నం సాకారం అవుతోంది," అని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.
వేములవాడ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "చాకలి ఐలమ్మ ధైర్యసాహసాలకు నిదర్శనం. తెలంగాణలో సామాజిక న్యాయం కోసం పోరాడిన ఆమె, నేటి తరానికి స్ఫూర్తిదాయకం," అని పేర్కొన్నారు. ఐలమ్మ మార్గంలో సమాజం ముందుకు సాగాలని, ఆమె ఆలోచనలను యువత ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ఐలమ్మ సేవలను గౌరవిస్తూ, మహిళా కళాశాలకు ఆమె పేరు పెట్టి, ఆమె కుటుంబ సభ్యులకు రాజకీయ గుర్తింపు కల్పించిందని ఆయన తెలిపారు. వేములవాడ పట్టణంలోని 14, 21, 28 వార్డుల్లో కుల సంఘ భవనాల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ప్రొసీడింగ్ పత్రాలను ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "గతంలో ఎన్నడూ లేని విధంగా 43 కుల సంఘ భవనాల నిర్మాణానికి రూ. 2.5 కోట్ల నిధులు మంజూరు చేశాం. ఈ భవనాలు సమావేశాలు, పండుగల నిర్వహణకు ఉపయోగపడతాయి," అని తెలిపారు. అంతేకా కుండా, పట్టణంలో ఇళ్లు లేని వారికి 400కు పైగా ఇళ్లు మంజూరు చేశామని, వీటిలో 300 ఇళ్లు బేస్మెంట్ దశ దాటి నిర్మాణంలో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. అడుగు స్థలం లేని వారికి కూడా ఇళ్లు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం అభివృద్ధిని కేవలం బ్రోచర్లలో చూపించి ందని, ప్రస్తుత ప్రజా ప్రభుత్వం క్షేత్రస్థాయిలో నిజమైన అభివృద్ధి చేస్తోందని ఆయన విమర్శించారు. వేములవాడ దేవాలయ అభివృద్ధి, రోడ్డు వెడల్పు పనులు, ములవాగు, గుడి చెరువులో మురుగునీరు చేరకుండా చర్యలు, మర్రిపల్లి, కలికోట సూరమ్మ రిజర్వాయర్ పనులు వేగంగా సాగుతున్నాయని ఆయన తెలిపారు. "52 ఏళ్లుగా నిరీక్షిస్తున్న రోడ్డు వెడల్పు పనులు ప్రారంభమయ్యాయి. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా అభివృద్ధి కొనసాగుతోంది," అని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. పట్టణ ప్రజలు ఈ అభివృద్ధి పనులను చూసి సంతోషం వ్యక్తం చేస్తూ, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ నాయకత్వాన్ని ప్రశంసించారు.

# ఆరోగ్యకర భోజనానికి 'సంప్రద' చిరునామా

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- గచ్చిబౌలిలో 'సంప్రద మల్టీక్యూజిన్ రెస్టారెంట్' ప్రారంభం



**హైదరాబాద్, సెప్టెంబర్ 10 (జనంసాక్షి) :** ఆరోగ్యకర భోజనానికి 'సంప్రద' చిరునామాగా నిలుస్తోందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. గచ్చిబౌలిలోని వినాయక నగర్లో ఏర్పాటు చేసిన 'సంప్రద మల్టీక్యూజిన్ రెస్టారెంట్'ను చేవెళ్ళ లోక్‌సభ సభ్యుడు కొండా విశ్వేశ్వర రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ తిరుపతిలో ప్రారంభమైన ఈ సంప్రద ప్రయాణం.. ఇప్పుడు అనేక నగరాల్లో శాఖలతో విస్తరించిందన్నారు. హైదరాబాద్‌లో ఈ రెస్టారెంట్‌ను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. రుచికరమైన శాకాహార, మాంసాహార వంటకాలకు ఎంతో పేరు పొందిందన్నారు. నాణ్యమైన ఆహారాన్ని అందించడంలో కూడా మంచి పేరు సంపాదించిందన్నారు. ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇస్తూ రుచికరమైన, పోషకాహార భోజనాన్ని అందిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా చేవెళ్ళ లోక్‌సభ సభ్యుడు కొండా విశ్వేశ్వర రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న యువత బర్గర్లు, పిజ్జాలు వంటి ఫాస్ట్‌ఫుడ్స్‌ను ఆస్వాదిస్తున్నారన్నారు. నెమ్మదిగా శరీరానికి హాని చేసే పదార్థాలు ఇవన్నారు. అందుకే మన సంప్రదాయ రుచుల ఆధారంగా.. ఆరోగ్యానికి మేలు చేసే ఆహార ఎంపికలు రావడం ఎంతో స్వాగతించదగిన విషయం అన్నారు. ఈ రెస్టారెంట్ ఆహారాన్ని రుచి చూశానన్నారు. నిజంగా ఎంతో రుచిగా ఉన్నాయన్నారు. ఆరోగ్యంగా ఉండాలన్న ఉద్దేశంతో పిజ్జాలు, బర్గర్లు మానేశానన్నారు. ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఎంచుకుంటున్నానని చెప్పారు. ఆహారపు అలవాట్లు మార్చుకున్నానని తెలిపారు. ఈ సందర్భంగా సంప్రద మల్టీక్యూజిన్ రెస్టారెంట్ డైరెక్టర్ నాగ భరత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తిరుపతి, ఇతర ప్రాంతాల్లో మా వంటకాల రుచితో ప్రజల హృదయాలను గెలుచుకున్నామని చెప్పారు. హైదరాబాద్ ప్రజలకు మా రుచులు అందించాలని ఆశపడుతున్నామని చెప్పారు. సంప్రదలో మన అమ్మమ్మ ఎంతో ప్రేమగా వండినట్టు ఉండే సంప్రదాయ తెలుగు వంటకాలను వడ్డిస్తున్నామని తెలిపారు. మీరు ఎప్పుడూ ఇష్టపడే రుచి ఇప్పుడు అదే ఆత్మీయ అనుభవం హైదరాబాద్‌లోనూ లభిస్తుందన్నారు. ఈ రెస్టారెంట్ 5000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉందన్నారు. నాలుగో అంతస్తులో 220 సీట్ల సామర్థ్యంతో కలదన్నారు. కాంటినెంటల్, చైనీస్ వంటకాలతో పాటు నెల్లూరు చేపల పులుసు, భీమవరం రొయ్యల వేపుడు వంటి దక్షిణ భారతీయ సంప్రదాయ వంటకాలను ప్రతిబింబించేలా దీనిని రూపొందించామన్నారు. స్నేహితులతో గడపడానికి, అర్ధరాత్రి ఆకలి తీర్చుకోవడానికి, వీకెండ్‌లో ప్రత్యేకంగా తినడానికి ఇది సరైన స్థలం అన్నారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, గచ్చిబౌలి జీహెచ్ఎంసీ కార్పొరేటర్ వీ గంగాధర్ రెడ్డి, శేరిలింగంపల్లి జీహెచ్ఎంసీ కార్పొరేటర్ నాగేందర్ యాదవ్, కాలుష్య నియంత్రణ మండలి సభ్యులు చింపుల సత్యనారాయణ రెడ్డి, గౌరవ పంచాయతీ రాజ్ అధ్యక్షుడు పసునూరి నరేంద్ర, సంప్రద మల్టీక్యూజిన్ రెస్టారెంట్ డైరెక్టర్ దయాకర్ బాబు సింగం తదితరులు పాల్గొన్నారు.

# ఆల్ఫోర్స్ మహిళా డిగ్రీ కళాశాలలో ఘనంగా న్యూట్రీషన్ వారోత్సవాల వేడుకలు

- ముఖ్య అతిథిగా రెనే గ్రూప్స్ ఆఫ్ హెూస్పిటల్స్ కన్సల్టెంట్ డైటీషియన్ డాక్టర్ బుర్ర స్ఫూర్తి.



**కరీంనగర్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 10 (జనంసాక్షి):** బుధవారం రోజు స్థానిక ఆల్ఫోర్స్ మహిళా డిగ్రీ కళాశాలలో జాతీయ పోషకాహార వారోత్సవ వేడుకలను "ఆల్ఫోర్స్ న్యూట్రిషన్ నోవా 2025" పేరిట ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు కళాశాల కరెస్పాండెంట్ వి.రవీందర్ రెడ్డి అధ్యక్షత వహించగా, రెనే గ్రూప్స్ ఆఫ్ హెూస్పిటల్స్ కన్సల్టెంట్ డైటీషియన్ డాక్టర్ బుర్ర స్ఫూర్తి ముఖ్య అతిథిగా విచ్చేసి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యకమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ బుర్ర స్ఫూర్తి మాట్లాడుతూ... మనం తినే ఆహారం పైనే మన ఆరోగ్యం ఆధారపడి ఉంటుందని, మనం తీసుకునే ఆహారంలో కార్బోహైడ్రేట్స్, ప్రోటీన్స్, ఫైబర్, సూక్ష్మ పోషకాలు అన్నీ ఉండేలా చూసుకోవాలని, వివిధ రకాల ఇన్ఫెక్షన్లు , రోగాలను తరిమికొట్టేందుకు, రోగనిరోధక వ్యవస్థ, ప్రోటీన్లు, లిపిడ్లు, కార్బోహైడ్రేట్లు, ఖనిజాలు, ఫైబర్స్, విటమిన్ లపై ఆధారపడి ఉంటుందని, ఇవి శరీరానికి పుష్కలంగా అందితేనే, రోగ నిరోధక వ్యవస్థ బలంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కరెస్పాండెంట్ వి. రవీందర్ రెడ్డి మాట్లాడుతూ... ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 1 నుండి సెప్టెంబర్ 7వ తేది వరకు జాతీయ పోషకాహార వారోత్సవాలను, దేశ ప్రజలలో పోషకాహారం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్ల గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి ఈ వారోత్సవాలను నిర్వహిస్తామన్నారు. ఆరోగ్యకరమైన అలవాట్లు ఆరోగ్యకరమైన జీవనశైలిని అవలంబించేందుకు పాటించాల్సిన విషయాలను నేర్పించేందుకు విద్యార్థినుల ద్వారా వివిధ ప్రదర్శనా కార్యక్రమాలను, అవగాహన శిక్షణ తరగతులను నిర్వహించామని తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన ముగింపు వేడుకలలో కళాశాల కరెస్పాండెంట్ వి.రవీందర్ రెడ్డి, ముఖ్య అతిథి డైటీషియన్ డా.బి స్ఫూర్తి లతో పాటు ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపాల్, న్యూట్రిషన్ అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



# వీరవనిత చాకలి ఐలమ్మకి హైడ్రా నివాళి

**హైదరాబాద్, సెప్టెంబరు 10 (జనంసాక్షి) :** నాటి తెలంగాణ సాయుధ పోరాట వీర వనిత, చిట్యాల (చాకలి) ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ నివాళులర్పించారు. బహుజన ఆత్మగౌరవానికి ఆమె ప్రతీక అని వ్యాఖ్యానించారు. నాటి తెలంగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మ ప్రదర్శించిన ధైర్యసాహసాలు, ప్రజాస్వామిక పోరాటాలకు స్ఫూర్తిగా నిలిచాయని కొనియాడారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి నుంచి విముక్తి కోసం సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మ పాత్ర మరువలేనిదన్నారు. హైడ్రా అడిషనల్ కమిషనర్ ఎన్ అశోక్ కుమార్, హైడ్రా అదనపు సంచాలకులు వర్ల పాపయ్య, హైడ్రా అడ్మిన్ ఎస్పీ ఆర్. సుదర్శన్, హైడ్రా ఏసీపీలు తిరుమల్, శ్రీకాంత్, పలువురు అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని చాకలి ఐలమ్మకు నివాళులర్పించారు.

# వరద బాధితులకు సేవలందించిన ఎన్వైపి, నిఫా



**గోదావరిఖని, జనంసాక్షి :** ఆగస్టు, సెప్టెంబర్‌లో సంభవించినటు వంటి అతివృష్టి కారణాలవల్ల వరద బీభ త్సానికి బలి అయిన ఎన్నో ప్రాంతాలు కామారెడ్డిలో వీక్షించడం జరిగినది.. సం దర్శించి ప్రజల కష్టసుఖాలను తెలుసుకో వడం జరిగింది రామకృష్ణ మాట్ హైదరాబాద్ వారు ఇన్ఫోసిస్ సంబంధిం చి నటువంటి అధికారులు, వాలంటీర్స్. ఈ విపత్తును దృష్టిలో ఉంచుకుని బేలూరు మట్ ఇన్ఫోసిస్ రామకృష్ణ హైదరాబాద్ వారి చేత వరద బాధితుల సహాయార్థం చేపట్టినటువంటి కార్యక్రమాల్లో నిఫా, యాన్వైపుకి సంబంధించినటువంటి 15 మంది వాలంటీర్స్ గత ఐదు రోజుల నుండి కామారెడ్డి మాచారెడ్డి పాల్వంచ రాజంపేట చుట్టుపక్కల ఉన్నటువంటి వరద బాధితులకు సేవలు అందించడం జరిగినది ముఖ్యంగా ఈ కార్యక్రమంలో స్వామీజీ తత్పదానంద మహారాజ్ ప్రకాష్ జి. విజయ్ రామకృష్ణ బావ సేవ సమితి. ఎన్వైపి -నిఫా ల్గారా రాష్ట్ర అధ్యక్షులు కే. యాదవ రాజు నాయకత్వంలో 15 మంది వాలంటీర్స్ పాల్గొని గత మూడు రోజులు ఉచిత సేవలు అందించడం జరిగింది.వాలంటీర్స్ శృతి, మానస, కుల్దీప్ నాయక్, రాజ్ కుమార్ తదితరులు, పాల్గొని దాదాపు ఒక్కొక్క కుటుంబానికి మూడు వేల ఒక వంద ఇరవై రూపాయల సామాగ్రిని అందజేయడం జరిగినది. ఇలాంటి సేవా కార్యక్రమాలను పాల్గొనందుకు గాను ప్రతి ఒక్కరు స్వామీజీ, రామకృష్ణ సేవా సమితి సభ్యులు వాలంటీర్సును యాదవ రాజును అభినందించారు.

# శారీరక శ్రమ తగ్గడంతో అనారోగ్యం

యువతులు ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టాలి : ఫిట్‌నెస్ ట్రైనర్ అను ప్రసాద్



**హైదరాబాద్ (జనంసాక్షి) :** యువతులు, మహిళలు ఫిట్‌నెస్‌పై ప్రత్యేక దృష్టి సారించి నిత్యం వ్యాయామం, యోగ వంటి ఆరోగ్యాన్ని పెంపొందించే అంశాలను అలవాటు చేసుకోవాలని ప్రముఖ ఫిట్‌నెస్ ట్రైనర్ అను ప్రసాద్ సూచించారు. నాంపల్లిలోని ఇందిరా ప్రియదర్శిని మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ప్రత్యేక ఫిట్‌నెస్ క్యాంపులో ఆయన మాట్లాడారు. క్షణం తీరికలేని నగర జీవితంలో శారీరక శ్రమ తగ్గిపోవడంతో పలురకాల వ్యాధుల బారినపడాల్సి వస్తుందని చెప్పారు. ముఖ్యంగా యువతులు, మహిళలు ఊబకాయం వంటి సమస్యలతో అనారోగ్య సమస్యలకు గురవుతు న్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో యుక్త వయసు నుంచే వ్యాయామం, జుంబా, డ్యాన్స్ వంటి ఫిట్‌నెస్ కార్యక్రమాలు చేయాలని అను ప్రసాద్ సూచించారు. విద్యార్థి దశ నుంచే వ్యాయామానికి సమయం కేటాయించడం ద్వారా భవిష్యత్తులో తలెత్తే సమస్యలను నివారించవచ్చని కళాశాల ఎన్ఎస్ఎస్ కార్యక్రమ అధికారి ఉదయశ్రీ అనిత పేర్కొన్నారు. క్యాంపులో పాల్గొన్న కళాశాల ప్రిన్సిపల్ చంద్ర ముఖర్జీ, ట్రైనర్ అనుప్రసాద్‌ను అభినందించారు. విద్యార్థులకు స్కిప్పింగ్ రోప్స్, షటిల్ బ్యాట్స్, గ్రిప్పర్స్ పంచిపెట్టారు.

# హెచ్ఐవి/ఎయిడ్స్ నివారణకు అవగాహనే ఆయుధం




**గోదావరిఖని, సెప్టెంబర్ 10, (జనంసాక్షి):** గోదావరిఖనిలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హెచ్ఐవి/ఎయిడ్స్ వ్యాప్తి నిరోధంపై అవగాహన కల్పించేందుకు బుధవారం ఒక ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం, రెడ్ రిబ్బన్ క్లబ్, మరియు ఐసీటీసీ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య జై కిషన్ ఓఝా అధ్యక్షత వహించగా, ఐసీటీసీ కౌన్సిలర్ శంకర్ రిసోర్స్ పర్సన్‌గా హాజరై విద్యార్థులకు హెచ్ఐవి/ఎయిడ్స్ నివారణ గురించి వివరించారు. యువత ఆరోగ్యవంతమైన జీవన శైలిని అలవర్చుకోవాలని, డిస్పోసబుల్ సిరంజిలు వాడడం, రక్త మార్పిడి సమయంలో జాగ్రత్త వహించడం, అనారక్షిత సంభోగం నుండి దూరంగా ఉండడం, హెచ్ఐవి సోకిన గర్భిణీ స్త్రీల శిశువులకు ఎన్‌వీపీ ఇంజెక్షన్ ఇవ్వడం ద్వారా వ్యాధి సంక్రమణను నివారించవచ్చని శంకర్ తెలిపారు.

ఎయిడ్స్ అనేది అంటు వ్యాధి కాదని, అంటించుకునే వ్యాధి అని, బాధితుల పట్ల సానుభూతితో, మర్యాదగా ప్రవర్తించాలని కోరారు. హెచ్ఐవి బాధితులను గుర్తించి, వారిని ఐసీటీసీ కేంద్రాలకు సమాచారం అందించి, కౌన్సెలింగ్‌లో పాల్గొనేలా ప్రోత్సహించా లని, ప్రభుత్వం అందించే ఉచిత మందులను క్రమం తప్పకుండా వాడాలని సూచించారు. యువత ఈ విషయంలో నిశ్శబ్దాన్ని వీడి బహిరంగ చర్చలు జరపాలని పిలుపునిచ్చారు. ప్రిన్సిపల్ జై కిషన్ ఓఝా మాట్లాడుతూ, విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు హెచ్ఐవి/ఎయిడ్స్ మహమ్మారిని నిరోధించేందుకు అవగాహనతో ముందుకు సాగాలని, ఈ వ్యాధికి నివారణే ఏకైక మార్గమని, బాధితు ల పట్ల సానుకూల దృక్పథం పెంపొందించుకోవాలని అన్నారు. రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. డి. కిరణ్మయి సభను నిర్వహించి, ఈ కార్యక్రమాన్ని ప్రోత్సహించిన ప్రిన్సిపల్ జై కిషన్ ఓఝా మరియు శంకర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులతో ఎయిడ్స్ నివారణపై నినాదాలు చెప్పించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. ఎం. నరేష్ వాలంటీర్లకు సలహాలు, సూచనలు అందజేసి, సభకు వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎ. సాంబశివ రావు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా చాకలి ఐలమ్మ 40వ వర్ధంతి వేడుకలు

జాతీయ బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ ఇన్చార్జ్ ఇంగిలే రామారావు



**జమ్మికుంట, సెప్టెంబర్ 10 (జనంసాక్షి):** చాకలి ఐలమ్మ 40వ వర్ధంతి వేడుకలను పురస్కరించుకొని బుధవారం జాతీయ బిసి సంక్షేమ సంఘం హుజురాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్ ఇంగిలే రామారావు ఆధ్వర్యంలో జమ్మికుంట మున్సిపాలిటీ లోని మారుతి నగర్ వద్ద గల చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ వరంగల్ జిల్లా రాయపర్తి మండలం క్రిష్ణాపురం గ్రామంలో జన్మించినటువంటి చాకలి ఐలమ్మ బాల్యవివాహం చేసు కున్నారని, దేశ్ముక్, రజాకారుల అరాచకాలపై ఎదురు తిరిగి పోరాడారన్నారు. భూమి కొరకు, భుక్తి కొరకు, వెట్టి చాకిరి విముక్తి కోసం వీరోచితంగా పోరాడి తెలంగాణ ప్రజల తెగువ పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటి చెప్పిన నిప్పు కనిక మహిళ లోకానికి స్ఫూర్తినిచ్చిన వీర వనిత అని ఆమె నడిచినటువంటి బాటలోనే నడవాలని,ఆమె ఆశయ సాధన కోసం మనమంతా కృషి చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు సలీం, అశోక్, వెంకటేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



# ఐలమ్మ ఆశయాల కోసం కృషి చేద్దాం

రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం

**నిజామాబాద్ జిల్లా బ్యూరో (జనం సాక్షి) :** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, స్వర్గీయ చాకలి ఐలమ్మ పోరాట ఆశయాల కోసం కృషి చేద్దామని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ శాసన సభ్యులు పోచారం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఐలమ్మ 40వ వర్ధంతి సందర్భంగా బాన్సువాడ పట్టణంలోని తాడ్కోల్ రోడ్డులో గల ఆమె విగ్రహానికి రాష్ట్ర అగ్రోస్ ఛైర్మన్ కాసుల బాలరాజ్‌తో కలిసి పూల మాలలు వేసి ఘనంగా నివాళులను అర్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ చాకలి ఐలమ్మ నిజాం నిరంకుశ పాలనపై పోరాటం చేసిన తొలి మహిళ అని అయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ సబ్ కలెక్టర్ శ్రీమతి కిరణ్మయి, ప్రజాప్రతినిధులు, నాయకులు, రజక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలలో వేగం పెంచాలి

నిజామాబాద్ జిల్లా కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి




**నిజామాబాద్ జిల్లా సెప్టెంబర్ 10 (జనం సాక్షి) :** జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగంగా జరిగేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేసి, వేగం పెంచాలని నిజామాబాద్ జిల్లా కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుండి బుధవారం సాయంత్రం కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపు, ప్రభుత్వ కార్యాలయ భవనాలపై సౌర విద్యుత్ ఫలకాల ఏర్పాటు, ఉపాధి హామీ కూలీలచే పంట పొలాల్లో ఇసుక మేటలు తొలగింపు, ఈజీఎస్ కాంపోనెంట్ మెటీరియల్ పనుల పురోగతిపై ఎంపీడీఓలు, ఎంపీఓలు, హౌసింగ్ ఏ.ఈలు, ఏపీఓ లు, ఏపీఎంలు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. పై అంశాలలో ప్రగతి గురించి ఒక్కో మండలం వారీగా వివరాలను అడిగి తెలుసుకున్నారు. వివిధ కారణాల వల్ల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ముందుకు రాని వారి స్థానంలో అర్హులైన కొత్త లబ్దిదారులకు ఇళ్లను మంజూరు చేశామని కలెక్టర్ తెలిపారు. ఈ విషయాన్ని ఇందిరమ్మ కమిటీల ద్వారా కొత్త లబ్దిదారులకు తెలియజేస్తూ, అందరూ మార్కింగ్ చేసుకుని నిర్మాణాలు ప్రారంభించేలా ప్రోత్సహించాలని అన్నారు. లబ్దిదారులకు సెర్ప్, మెప్మా ద్వారా రుణాలు మంజూరు అయ్యేలా చొరవ చూపాలన్నారు. అదేవిధంగా డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలని, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా లబ్దిదారులను వెంటనే గుర్తించి జాబితాలు సమర్పించాలని కలెక్టర్ సూచించారు. కాగా, ఇటీవల భారీ వర్షాలకు ఇసుక మేటలు వేసిన ఆరు మండలాల్లోని పంట పొలాల్లో ఉపాధి హామీ కూలీలతో ఇసుక మేటలు తొలగింపజేయాలని అన్నారు. పనుల జాతరలో భాగంగా మెటీరియల్ కాంపోనెంట్ కింద మంజూరీ తెలిపిన మేజిక్ సోక్ పిట్లు, పశువుల కొట్టాలు, వర్మీ కంపోస్ట్ తదితర నిర్మాణ పనులను వెంటనే చేపట్టి, సకాలంలో పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇదిలా ఉండగా, జిల్లాలో అన్ని ప్రభుత్వ కార్యాలయాల భవనాలపై సౌర విద్యుత్ ఫలకాలను ఏర్పాటు చేసేందుకు వీలుగా మరోసారి క్షేత్రస్థాయిలో కార్యాలయాల భవనాలను పరిశీలించి, సమగ్ర వివరాలతో నివేదికలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ అంకిత్, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, డీఆర్డీఓ సాయాగౌడ్, హౌసింగ్ పీ.డీ పవన్ కుమార్, ఈ.ఈ నివర్తి, డీపీఓ శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ అధికారి జె.గోవిందు తదితరులు పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ స్ఫూర్తితో యువత ముందుకు వెళ్లాలి

టిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి



**వేములవాడ, సెప్టెంబర్ 10 (జనంసాక్షి):** వేములవాడ పట్టణంలోని తెలంగాణ చౌక్ వద్ద చాకలి ఐలమ్మ 40వ వర్ధంతి సందర్భంగా వేములవాడ పట్టణ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో వారి విగ్రహానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా టిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి మాట్లాడుతూ చాకలి ఐలమ్మ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడిన ధిరవనీత,తెలంగాణ సాయుధపోరాటంలో రజాకారుల దోపిడిని ఎదిరించి రోకలి బండను ఎత్తి ఎదిరించి,ఒక్కచెత్తో కోడవలి పట్టి మావోయిస్టుల సిద్ధాంతాన్ని నమ్మిన అలుపెరగని ధైర్యశాలిని,మహిళ ఆత్మగౌరవానికి నిలువెత్తు నిదర్శనం చాకలి ఐలమ్మ అనీ అన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ,నిమ్మశెట్టి విజయ్,మాజీ సెస్ డైరెక్టర్ రామతీర్థపు రాజు, టిఆర్ఎస్ రూరల్ మండల అధ్యక్షులు గోస్కుల రవి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డం హన్మాండ్లు, మాజీ కౌన్సిలర్లు నరాల శేఖర్,మారం కుమార్, నీలం శేఖర్, జోగిని శంకర్, సిరిగిరి చందు, గోలి మహేష్, మాజీ సర్పంచ్ మ్యాకల శ్రీనివాస్,కృపాల్,మంతె సందీప్,పర్వేజ్, అంజత్ పాషా, అంజయ్య, షాహిద్, దేవరాజు, అరుణ్, పోతు అనిల్,సయ్యద్ బాబా,పులి రవి, రాధా కిషన్ రావు,ప్రేమ్ చారీ, రాకేష్, మధు, కలీల్ పాల్గొన్నారు.



# జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం

గొర్రెల కాపరితో పాటు 26 గొర్రెలు మృతి

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (జనం సాక్షి) :** కామారెడ్డి జిల్లా దేవునిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని 44వ జాతీయ రహదారిపై బుధవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది.ఈ ప్రమాదంలో ఓ గొర్రెల కాపరి తో పాటు 26 గొర్రెలు మృతి చెందాయి. స్థానికుల కథనం ప్రకారం మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన గొర్రెల కాపర్లు గొర్రెలు మేపుకుంటూ రహదారి పైకి రాగా అతివేగంగా వచ్చిన లారీ ఢీ కొట్టింది. ఈ సంఘటనలో గాయపడ్డ వ్యక్తి పరిస్థితి విషమంగా ఉంది. దేవునిపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు.

# సర్కారు స్థలాల్లో కబ్జాలకు హైడ్రా కంచె

- కూకట్పల్లిలో 1.20 ఎకరాల ప్రభుత్వ స్థలం స్వాధీనం
- రూ. వంద కోట్ల విలువైన భూమికి విముక్తి



**హైదరాబాద్, సెప్టెంబరు 10 (జనంసాక్షి) :** మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలోని కూకట్పల్లి గ్రామం సర్వే నంబరు 276లో 1.20 ఎకరాల భూమిని బుధవారం హైడ్రా స్వాధీనం చేసుకుంది. దీని విలువ రూ. 100 కోట్లకుపైగా ఉంటుంది. ఆల్విన్ కాలనీకి ఆనుకుని ఉన్న 276 సర్వే నంబరులో 2.39 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా.. ఇప్పటికే కొన్ని ఇళ్లు నిర్మాణం జరిగాయి. ఇంకా మిగిలి ఉన్న 1.20 ఎకరాల భూమి కబ్జా కాకుండా హైడ్రా కాపాడింది. స్వాధీనం చేసుకున్న భూమి చుట్టూ కంచె వేసింది. అయితే ఈ భూమి తమదంటూ హైదరాబాద్ ఆల్విన్ ఎంప్లాయీస్ హౌసింగ్ కమిటీ పోరాడుతోంది. ఇదే సమయంలో ఆల్విన్ కాలనీ సంక్షేమ సంఘంతో పాటు ఆ పక్కనే ఉన్న కాకతీయనగర్ కాలనీ వాసులు మాత్రం ఈ భూమిని కాపాడి.. పార్కును నిర్మించాలని లని డిమాండ్ చేస్తున్నారు. ఎవరి డిమాండ్లు ఎలా ఉన్నా.. ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అవ్వకుండా హైడ్రా ఫెన్సింగ్ వేయడంపట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రజావాణి ఫిర్యాదుల మేరకు.. హైదరాబాద్ ఆల్విన్ ఎంప్లాయీస్ హౌసింగ్ కమిటీకి 1986లో ప్రభుత్వం 79.29 ఎకరాల స్థలాన్ని ఇచ్చింది. రెండు దశల్లో ప్లాట్ల కేటాయింపు జరిగింది. ఇంకా ఇల్లు రానివారు కొంతమంది ఉన్నారంటూ పక్కనే ఉన్న 2.39 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించాలని హైదరాబాద్ ఆల్విన్ ఎంప్లాయీస్ హౌసింగ్ కమిటీ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు డబ్బులు కూడా చెల్లించినట్టు కమిటీ ప్రతినిధులు చెబుతున్నారు. కమిటీ ప్రతినిధులు కొనకుండానే 2.39 ఎకరాల్లో ప్లాట్లు వేసి అక్రమంగా అమ్మారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆల్విన్ కంపెనీ బంద్ అయ్యింది. ఇంకా ఆ కమిటీ మనుగడలో లేదని.. ఆల్విన్ కాలనీలోని ప్లాట్లు కూడా ఇష్టానుసారం అమ్మేశారని ఆ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఇక్కడి ఖాళీ స్థలంలో అక్రమ పార్కింగ్ కొనసాగుతోందని.. దీంతో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని హైడ్రా ప్రజావాణికి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదులను విచారించిన హైడ్రా.. సర్వేనంబరు 276లో ఉన్నది 2.39 ఎకరాలు ప్రభుత్వ స్థలమే అని నిర్ధారించింది. ఇప్పటికే కొన్ని ఇళ్లు రాగా.. మిగిలి ఉన్న 1.20 ఎకరాల స్థలాన్ని కాపాడి బుధవారం ఫెన్సింగ్ వేసింది.

# దాడికి గురవుతున్న ప్రజాస్వామ్యం

- నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణలో ఇసి విఫలం
- బీహార్ తరహా వైఫల్యం ఇతర రాష్ట్రాల్లోనూ సాధ్యం
- సిపిఐ సమావేశాల్లో జాతీయ ప్రధాన కార్యదర్శి రాజా



**తిరువనంతపురం, సెప్టెంబర్ 10 (జనంసాక్షి) :** దేశంలో ప్రజాస్వామ్యం నిరంతరం దాడికి గురవుతోందని, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడంలో ఎన్నికల సంఘం విఫలమైందని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా మండిపడ్డారు. బుధవారం కేరళలోని అలప్పుజలో జరిగిన సిపిఐ రాష్ట్ర కమిటీ సమావేశాల్లో ప్రతినిధుల సమావేశాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. బీహార్‌లో ఎస్ఐఆర్‌ను విమర్శిస్తూ.. ప్రజల ఓటు హక్కును లాక్కుంటున్నారని మండిపడ్డారు. బీహార్‌లోని అర్హులైన ఓటర్లందరికీ ఓటు– హక్కును కల్పించడంలో ఇసి విఫలమైంది. ఇది ఏ రాష్ట్రంలోనైనా జరగ వచ్చన్నారు. ఎన్నికల సంఘం ఒక రాజ్యాంగ సంస్థ . తటస్థంగా వ్యవహరిస్తూ ప్రజల ఓటు– హక్కుకు హామీ ఇవ్వాలి. కానీ స్వేచ్ఛగా, న్యాయంగా ఎన్నికలు నిర్వహించడంలో ఇసి విఫలమైందని అన్నారు. భారతదేశం తీవ్రమైన ముప్పులను ఎదుర్కొంటోందని అన్నారు. మితవాద శక్తులు అధికారాన్ని చేజిక్కించుకున్నాయి. ఆర్ఎస్ఎస్ ఒక నియంతృత్వ శక్తి. బిజెపి ఆర్ఎస్ఎస్ రాజకీయ విభాగం తప్ప మరొకటి కదు. వారు భారతదేశాన్ని నియంతృత్వ రాజ్యంగా, మతపరమైన దేశంగా మార్చేందుకు తీవ్రంగా యత్నిస్తున్నారని అన్నారు. ఒకేదేశం ఒకే ఎన్నికను తీవ్రంగా విమర్శిస్తూ.. అది ఆర్ఎస్ఎస్ సిద్ధాంతమని అన్నారు. ఆర్ఎస్ఎస్ భారతదేశాన్ని భిన్న రూపాల, భిన్న సాంస్కృతిక, బహుభాషా దేశంగా గుర్తించడం లేదు. ఆర్ఎస్ఎస్, బిజెపిలు భారతదేశాన్ని ఏకరూప దేశంగా మార్చాలని కోరుకుంటున్నాయి. భారతదేశ ప్రజాస్వామ్య నిర్మాణాలను కూల్చివేయాలని కోరుకుంటున్నాయి. మోడీ ప్రభుత్వంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం ముప్పులో ఉన్నాయి. బిజెపి, ఆర్ఎస్ఎస్‌లను ఓడించేందుకు అన్ని లౌకిక, ప్రజాస్వామ్య శక్తులు ఏకం కావాలని అన్నారు. వామపక్షాల ఐక్యత కోసం కృషి చేయాలని, వామపక్ష పార్టీలు ఐక్యమై కమ్యూనిస్ట్ ఉద్యమాన్ని బలోపేతం చేయాలని అన్నారు. మితవాద, ఫాసిస్ట్ శక్తుల నుండి పెద్ద సవాళ్లను ఎదుర్కొంటున్నామని, వాటిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని అన్నారు. మనం ఆదర్శంగా నిలవాలని, కమ్యూనిస్ట్ విలువలు మరియు నైతికతను బలోపేతం చేయాలని అన్నారు.

# ఐశ్వర్య బాటలో అభిషేక్ బచ్చన్

- ఎఐ సాయంతో అశ్లీల కంటెంట్ తయారీ
- ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు



**న్యూఢిల్లీ, సెప్టెంబర్10 (జనంసాక్షి) :** బాలీవుడ్ నటుడు అభిషేక్ బచ్చన్ బుధవారం దిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. తన పబ్లిసిటీ, పర్సనాలిటీ హక్కులకు రక్షణ కల్పించాలని న్యాయస్థానంలో పిటిషన్ వేశారు. కొన్ని వెబ్‌సైట్‌లు తన అనుమతి లేకుండా ఫొటోలు, వీడియోలు వాడుకుంటున్నాయని.. వాటిని ఉపయోగించేందుకు వీలులేకుండా ఆదేశాలివ్వాలని న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. కొందరు వ్యక్తులు ఏఐతో అభిషేక్ ఫొటోలు క్రియేట్ చేసి అశ్లీల కంటెంట్‌కు ఉపయోగించుకుంటున్నట్లు– నటుడి తరఫు న్యాయవాది ప్రవీణ్ కోర్టుకు (తెలిపారు. దీనికి సంబంధించిన పూర్తి ఆధారాలు కోర్టుకు సమర్పించినట్లు– చెప్పారు. ఇక సోషల్ మీడియాలో వైరలవుతోన్న ఏఐ ఫొటోలు, వీడియోలు సెలబ్రిటీలకు తలనొప్పిగా మారాయి. తాజాగా ఇదే విషయంపై అభిషేక్ సతీమణి, నటి ఐశ్వర్యారాయ్ కూడా దిల్లీ హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. అనుమతి లేకుండా తన ఫొటోలను, పేరును ఉపయోగించేందుకు వీలులేకుండా ఆదేశాలివ్వాలని ఆమె కోర్టును కోరారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం.. ఐశ్వర్య పేరు, ఫొటోలు ఉపయోగించకుండా తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేస్తామని సూచించింది.

# పదునెక్కుతున్న హైడ్రా కోరలు

**ఆక్రమణదారుల్లో గుబులు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 10 (జనంసాక్షి) :** రాష్ట్రంలో హైడ్రా దూసుకుపోతోంది. ఎక్కడా వెనకడుగు వేయడం లేదు. ఎన్ని విమర్శలు వచ్చినా పట్టించుకోవడం లేదు. ఇప్పటివరకు చేసింది కొంతే అయినా.. హైడ్రా పనితీరుకు ప్రజల్లో మంచి పేరు వస్తోంది. ఆక్రమణలు కూల్చాల్సిందేనని అంటున్నారు. రాజకీయనేతలు, రియల్టర్ల ఆక్రమణలు తొలుత కూల్చాలని కోరుకుంటున్నారు. నాలాలను ఆక్రమించిన వారు ఎవరైనా ఊరుకోవద్దని ప్రజలు సూచిస్తున్నారు. ఇప్పటికే వందల కోట్ల విలువైన ఆస్తును హైడ్రా స్వాధీనం చేసుకుంది. పార్కులను మింగిన వారి నుంచి భూములను లాక్కుంది. జంటనగరాల్లో హైడ్రా వల్ల మంచి ఫలితాలు వస్తున్నాయి. ఈ క్రమంలో మూసీ డెవలప్‌మెంట్ కోసం సిఎం రేవంత్ దృష్టి సారించారు. ఇందుకు అనుగుణంగా మూసీ ఆక్రమణలపై హైడ్రా దృష్టి పెడుతుందని అంటున్నారు. మూసి ఆక్రమణల తొలగింపు హైడ్రా తదుపరి టార్గెట్‌గా ఉంది. మూసి వైపుకు హైడ్రా బుల్డోజర్లు దూసు కెళ్లనున్నాయి. మూసిలో ఇళ్లను నిర్మించిన వారిపై చర్యలకు హైడ్రా సిద్ధమైంది. మూసి ఆక్రమణల తొలగించేందుకు రంగం సిద్ధమైంది. గత 15 ఏళ్ళలో మూసి ఎఫ్టిఎల్, బఫర్ జోన్లలో నిర్మాణాలు భారీగా వెలిశాయి. ఇప్పటికే చాదర్‌ఘాట్, మూసారాంబాగ్ మూసి ఆక్రమణలకు పాల్పడ్డ వారికి నోటీసులు జారీ అయ్యాయి. అర్హులైన బాధితులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళు కేటాయించేలా ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తోంది. మూసి ఆక్రమణలపై ప్రభుత్వానికి హైడ్రా సమగ్ర నివేదిక అందజేసినట్లు తెలుస్తోంది. మూసిలో 10 వేలకు పైగా ఇళ్ళు ఉన్నట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. అలాగే కొందరు మూసీలో మట్టి నింపి ఆక్రమించి వ్యాపార సముదాయాలు కట్టారు. గండిపేట నుంచి మొదలు నాగోల్ వరకు అనేక చోట్ల ఆక్రమణలు స్పష్టంగా కనిపిస్తున్నారు. మరోవైపు చెరువుల పరిరక్షణ లక్ష్యంతో ఏర్పాటైన హైడ్రాని ప్రభుత్వం మరింత బలోపేతం చేస్తోంది. ఈ మేరకు ప్రభుత్వ స్థలాల సంరక్షణ, చెరువులు, నాలాలు, కుంటల ఆక్రమణలపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు, అక్రమ కట్టడాలను కూల్చివేసేందుకు సంబంధించిన సర్వాధికారాలను హైడ్రాకు అప్పగించారు. రెవెన్యూ, ఆక్రమణల నిరోధం చట్టంపై కలెక్టర్ల నుంచి కిందిస్థాయి వరకు ఉన్న అధికారాలను హైడ్రాకు అప్పగించేందుకు అభ్యంతరాలు లేవని స్పష్టం చేసింది. దీంతో ఇక హైదరాబాద్‌లో ఆక్రమణలపై హైడ్రా మరింద దూకుడు ప్రదర్శించనుంది. మూసీ పరివాహకం క్లీన్ కానుంది. అలాగే చెరువులకు విముక్తి దక్కనుంది.

# బాసర క్షేత్రాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం

- 190 కోట్ల వ్యయంతో బాసర ఆలయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్
- రాబోయే గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహిస్తాం
- రాష్ట్ర ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు...



**ముధోల్, సెప్టెంబర్ 10( జనం సాక్షి) :** బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారిని రాష్ట్ర ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు బుధవారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వేద మంత్రాల నడుమ పూర్ణకుంభంతో ఆహ్వానించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రిని ఆలయ అధికారులు శాలువాతో సత్కరించి, అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. తర్వాత ఆయన మహంకాళి అమ్మవారిని కూడా దర్శించుకున్నారు. అనంతరం మంత్రి జూపల్లి, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, అధికారులతో సమావేశం నిర్వహించి ఆలయ అభివృద్ధిపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో సుమారు రూ.190 కోట్ల వ్యయంతో బాసర ఆలయ మాస్టర్ ప్లాన్ అమలు చేయనున్నట్లు తెలిపారు. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖతో చర్చించి బాసర అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. బాసరను ప్రధాన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు. రానున్న గోదావరి పుష్కరాల కోసం ఇప్పటికే పకడ్బందీ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. పుష్కరాలను విజయవంతంగా నిర్వహించేలా అన్ని శాఖలతో సమన్వయం చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. బాసర ఆలయ అభివృద్ధిపై తాను ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నానని వివరించారు. ఈ కార్యక్రమంలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆలయ ఈవో అంజనా దేవి, ఇతర అధికారులు, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ముఖ్య సలహాదారులు కేంద్ర మంత్రివర్యులు సముద్రాల వేణుగోపాల చారి, మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, ముధోల్ మాజీ ఎమ్మెల్యేలు నారాయణరావు పటేల్, జి . విట్టల్ రెడ్డి, ఎమ్మెల్సీ దండే విట్టల్, భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనందరావు పటేల్, తదితరులు పాల్గొన్నారు.

# ఆయుధాల దొంగతనం కేసులో సైనికుడి అరెస్ట్

- సహకరించిన అతడు సోదరుడు సైతం
- ఎస్పీ కాంతి లాల్ పాటిల్




**కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో సెప్టెంబర్ 10 (జనం సాక్షి) :** నావికాదళంలో విధులు నిర్వహిస్తూ, ఆయుధాల దొంగతనానికి పాల్పడిన సైనికుడ్ని ముంబై క్రైమ్ బ్రాంచ్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. అంతేకాకుండా అతడికి సహకరించిన సోదరుని సైతం అరెస్టు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి . కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా పోలీస్ అధికారి పంతిలాల్ పాటిల్ వివరాలు వెల్లడించారు. జిల్లాలోని పెంచికల్పేట్ మండలం ఎలకపల్లి గ్రామానికి చెందిన దుబ్బుల రాకేష్( 22) కు 2023 ముంబై నావిక దళములో సెక్యూరిటీ ఉద్యోగం లభించింది. అక్కడ సుమారు రెండు సంవత్సరాల పాటు రాకేష్ విధులు నిర్వహించారు. అనంతరం 2025 ఫిబ్రవరి లో కేరళలో రాష్ట్రం ఎర్నాకులం నావిక దల%శీ% కు రాకేష్ కు ట్రాన్స్ఫర్ అయింది. ఈ క్రమంలో ఈనెల 6 తేదీన సైనికుడు రాకేష్, అతడి సోదరుడు ఉమేష్ సహకారంతో ముంబాయి నావికదళం సెక్యూరిటీ కేంద్రం నుంచి 1 ఇన్సాస్ ఆయుధం,3 మ్యాగ్జిన్లు, 40 బుల్లెట్లు దొంగలించారు. ఈ క్రమంలో ముంబై క్రైమ్ బ్రాంచ్ పోలీసులు ఆయుధాల దొంగతనంపై విచారణ చేపట్టారని తెలిపారు. ఈ క్రమంలో విచారణ లో భాగంగా ముంబాయి క్రైమ్ బ్రాంచ్ పోలీసులు బుధవారం వేకువజామున రాకేష్ స్వగ్రామైన కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్పేట్ మండలంలోని ఎలకపల్లి గ్రామానికి చేరుకొని రాకేష్, ఉమేష్ లను అదుపులోకి తీసుకొని అరెస్టు చేశారు. క్రైమ్ బ్రాంచ్ పోలీసులకు స్థానిక కాగజ్ నగర్ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కుమారస్వామి, సబ్ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్లు సహకరించినట్లు ఎస్పీ కాంతిలాల్ పాటిల్ పేర్కొన్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఆయుధాల దొంగతనం పెద్ద నేరంగా భావించాల్సిందని పేర్కొన్నారు. ఎవరైనా ఇలాంటి కార్యక్రమాలకు పాల్పడిన, ఇతరత్రా సంఘవిద్రోహ శక్తులు అనుమానస్పదంగా కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్పి కాంతిలాల్ పాటిల్ ప్రజలను ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# కాంగ్రెస్ పాలనలో ఢిల్లీ యాత్రలు

**పదేపదే సిఎం రేవంత్,మంత్రుల ప్రదక్షిణలు**



**హైదరాబాద్, సెప్టెంబర్10 (జనంసాక్షి) :** కాంగ్రెస్ ఏ రాష్ట్రంలో అధికారంలో ఉన్నా ఢిల్లీకి పర్యటనలు తప్పవు. ప్రతి చిన్న విషయానికి పదేపదే యాత్రలు చేయాల్సిందే. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన తరవాత ఇప్పటికే పలుమార్లు సిఎం రేవంత్ రెడ్డి, డిప్యూటి సిఎం భట్టి, మంత్రులు ఢిల్లీ యాత్రలు చేశారు. ఏ చిన్నపనయినా అధిష్టానం అనుమతి తప్పనిసరి. ఫోన్‌లో మాట్లాడడానికి ఉండదు. కేవలం వ్యక్తిగతం గా పరదా చాటున మాట్లాడాల్సిందే.ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ ఈ విషయంలో మాత్రం ఫ్యూడల్ విధానంలోనే సాగుతున్నారు. సిఎంలు సామంతరాజుల్లా ఢిల్లీ చుట్టు చక్కర్లు కొట్టాల్సి వస్తోంది. సిఎంగా రేవంత్ రెడ్డికి కూడా ఇది తప్పడం లేదు. తెలంగాణ రాజకీయ వర్గాలు ఎప్పుడెప్పుడూ అని ఎదురుచూస్తున్న కేబినెట్ విస్తరణ మిగిలే ఉంది. సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళుతున్నప్రతిసారీ ఏదో ఒక చర్చ నడుస్తూనే ఉంది. కాంగ్రెస్ అధిష్టానంలో రేవంత్ రెడ్డి వెళ్లిన ప్రతిసారీ చర్చలు జరుపుతారు. అనేక సమస్యలు ప్రస్తావిస్తారని తెలుస్తోంది. కానీ పెద్దగా ఫలితం ఉండడం లేదు. మంత్రివర్గ విస్తరణ పూర్తిస్థాయిలో జరగలేదు. హోం మంత్రిత్వశాఖ, మున్సిపల్, విద్య, మైనింగ్‌తో పాటు పలు కీలక శాఖలు సీఎం వద్దే ఉన్నాయి. కాగా కేబినెట్‌లో చోటు కోసం పలువురు సీనియర్ల ప్రయత్నాలు చేస్తున్నారు. తెలంగాణ కేబినెట్ విస్తరణలో పలువురు సీనియర్ మంత్రి పదవులు ఆశిస్తున్నారు. ఎమ్మెల్సీగా ప్రొఫెసర్ కోదండరామ్ నియామకం అయ్యాక ఆయనను కేబినేట్‌లోకి తీసుకుంటారని అంటున్నారు. తెలంగాణ ఉద్యమంలో ఆయనది కీలక పాత్ర. ఆయన లేకుండా ఉద్యమాన్ని చూడలేం. అందుకే తొలి ప్రాధాన్యం ఆయనకే ఉంటుందని అనుకున్నారు. కానీ అలా జరగలేదు. కోదండరామ్ విషయంలో కాంగ్రెస్ అధిష్టానానికి కూడా స్పష్టత ఉంది. ఇక రేసులో ఉన్న నేతల విషయానికి వస్తే రంగారెడ్డి జిల్లా నుంచి మల్ రెడ్డి రంగారెడ్డి, నల్గొండ జిల్లా నుండి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిలు నేటికీ మంత్రి పదవుల కోసం ఎదురు చూస్తున్నారు. మైనార్టీ కోటాలో షబ్బీర్ అలీ, అజారుద్దీన్ అమాత్య పదవులను ఆశిస్తున్నారు. మరి వీరిలో ఎవరిని పదవులు వరించనున్నాయన్నది చూడాలి.

# ఝార్ఖండ్ ముఖ్యమంత్రిని కలిసిన భట్టి



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఝార్ఖండ్ పర్యటనలో భాగంగా తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఝార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. జార్ఖండ్ ముక్తి మోర్చా వ్యవస్థాపకుడు, జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి, సీఎం హేమంత్ తండ్రి శిబూ సోరెన్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. శిబూ సోరెన్ మృతి పట్ల డిప్యూటీ సీఎం తన సంతాపాన్ని ప్రకటించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇటీవల జరిగిన జార?ండ్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జిగా అక్కడ విస్తృతంగా పర్యటించి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హేమంత్ సోరెన్ తో కలిసి పనిచేశారు. జేఎంఎం, కాంగ్రెస్ కూటమి ఆ ఎన్నికల్లో విజయం సాధించడంలో భట్టి విక్రమార్క కీలక భూమిక పోషించారు. బుధవారం రాంచీలో ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ను కలిసిన సందర్భంగా రెండు రాష్ట్రాల్లో జరుగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, ప్రస్తుత రాజకీయ పరిణామాలు తదితర అంశాలపై చర్చించారు.

# సర్వేపల్లి స్ఫూర్తిని కొనసాగించండి

**రాధాకృష్ణన్‌కు అభినందనలు తెలిపిన జైరామ్**



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10 (జనంసాక్షి) :** దేశ 15వ ఉపరాష్ట్రపతిగా, రాజ్యసభ చైర్మన్‌గానూ ఎన్నికైన సి.పి.రాధాకృష్ణన్‌కు కాంగ్రెస్ కమ్యూనికేషన్ ప్రతినిధి జైరాం రమేష్ బుధవారం శుభాకాంక్షలు తెలిపారు. ఉపరాష్ట్రపతి నిష్పక్షపాతంగా వ్యవహరించడం ముఖ్యమని పేర్కొంటూ.. మొట్టమొదటి ఉపరాష్ట్రపతి మరియు రాజ్యసభ చైర్మన్ అయిన డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ చెప్పిన మాటలను ఈ సందర్భంగా ఉదహరించారు. 'ప్రభుత్వ విధానాలను నిష్పాక్షికంగా, స్వేచ్ఛగా మరియు స్పష్టంగా విమర్శించడానికి ప్రతిపక్షాలను అనుమతించకపోతే ఆ ప్రజాస్వామ్యం నిరంకుశత్వంగా దిగజారిపోయే అవకాశం ఉంది' అని పేర్కొన్నారు. 1952 మే16న రాజ్యసభ ప్రారంభం రోజున, ప్రముఖ విద్యావేత్త, తత్వవేత్త, రచయిత, దౌత్యవేత్త ఈవిధంగా అన్నారు. 'నేను ఏ పార్టీకి చెందిన వాడిని కాదు. అంటే ఈ సభలోని ప్రతి పార్టీకి చెందినవాడిని. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం అత్యున్నత విలువలను, సాంప్రదాయాలను నిలబెట్టడం, ప్రతి పార్టీ పట్ల న్యాయంగా, నిష్పాక్షికంగా వ్యవహరించడం, ఎవరిపట్లా ద్వేషం లేకుండా, అందరిపట్ల సద్భావనతో వ్యవహరించేందుకు యత్నిస్తాను. ప్రభుత్వ విధానాలను ప్రతిపక్ష పార్టీలు న్యాయంగా, స్వేచ్ఛగా మరియు స్పష్టంగా విమర్శించడానికి అనుమతించకపోతే ప్రజాస్వామ్యం నిరంకుశత్వంగా దిగజారిపోయే అవకాశం ఉంది' అని ఎక్స్‌లో పేర్కొన్నారు. ' డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ తాను బోధించిన దానిని అక్షరాలా స్ఫూర్తితో ఆచరించారని ఉద్ఘాటించారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్‌డిఎ అభ్యర్థి సి.పి.రాధాకృష్ణన్ 452 ఓట్లతో తదుపరి ఉపరాష్ట్రపతిగా ఎన్నికయ్యారు. ఇండియా కూటమి అభ్యర్థి బి. సుదర్శన్ రెడ్డి 300 ఓట్లను సాధించారు.

# ఇచ్చిన హామీ మేరకు పేలకు ఇళ్లు

**మంత్రి వివేక స్పష్టీకరణ**

**సిరిసిల్ల, సెప్టెంబర్10 (జనంసాక్షి) :** ఇచ్చిన మాట ప్రకారం పేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నామని చెప్పారు మంత్రి వివేక్ వెంకటస్వామి. సిరిసిల్లలో సకలజనుల సన్మాన కార్యక్రమంలో మాట్లాడిన ఆయన.. కేసీఆర్ హయాంలోనే కాళేశ్వర కట్టారు..వాళ్ల హయాంలోనే కూలిందన్నారు. కాళేశ్వరంపై బీఆర్ఎస్ పచ్చి అబద్దాలు చెబుతోందని విమర్శించారు. ఇరిగేషన్ పై కేటీఆర్ కు కనీస అవగాహన లేదన్నారు. కాంగ్రెస్ కట్టిన ఎల్లంపల్లి నుంచే గోదావరి నీళు హైదరాబాద్ కు తరలిస్తామని చెప్పారు. కేసీఆర్ ఫ్యామిలీపై కవిత ఆరోపణలకు సమాధానం చెప్పాలని వివేక్ డిమాండ్ చేశారు. అమరుల త్యాగాలతోనే తెలంగాణ వచ్చిందన్నారు మంత్రి వివేక్. యువకుల బలిదానాలు చూసి చలించిపోయిన సోనియా తెలంగాణ ఇచ్చిందన్నారు. ఉద్యమంలో అమరులైన కుటుంబాలకు లక్ష ఇచ్చామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో సిరిసిల్లలో ఇసుక మాఫియా రాజ్యమేలిందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం పేదలకు పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. స్కిల్ డెవ లప్ మెంట్ తో యువతతలో నైపుణ్యం కల్పిస్తున్నామని చెప్పారు.పేద మహిళలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని.. కల్వకుంట్ల కుటుంబం ఖజానా ఖాళీ చేసినా..సీఎం రేవంత్ రెడ్డి స్కీమ్స్ కొనసాగిస్తున్నారని చెప్పారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370